ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 27.07.2025 | సంపుటి : 12 సంచిక : 08 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



సీఎంపై అనుచిత వ్యాఖ్యలు

## ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు

హైదరాబాద్‌(జనంసాక్షి): రాజేంద్రనగర్‌ పోలీస్‌ స్టేషన్‌లో భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదైంది. సీఎం రేవంత్‌రెడ్డిపై కౌశిక్‌రెడ్డి అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని రాజేంద్రనగర్‌కు చెందిన కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యేపై పలు సెక్షన్ల కింద కేసు

మిగతా 2లో..



## 30న 'నిసార్‌' ప్రయోగం

రాకెట్‌ క్రయోజెనిక్‌ ఇంజన్‌ సాంకేతికతలో భారత్‌ విజయం

అమెరికాతో సంయుక్తంగా తయారీ

వార్త 3 లో

## తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం

### ఆయన లేకుంటే ప్రత్యేక తెలంగాణ సాకారం అయ్యేదే కాదు

- విలువలకు కట్టుబడ్డ నేత.. వారి స్ఫూర్తితో మా ప్రభుత్వం నడుస్తోంది
- ప్రస్తుతం సిద్ధాంత రాజకీయాలు లేవు..స్విగ్గీ పాలిటిక్స్‌ నడుస్తున్నాయ్‌
- జైపాల్‌రెడ్డి మెమోరియల్‌ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి
- మోహన్‌గురుస్వామికి సూదిని జైపాల్‌రెడ్డి అవార్డు ప్రదానం



హైదరాబాద్‌(జనంసాక్షి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో దివంగత నేత జైపాల్‌ రెడ్డి పాత్ర ఎన్నటికీ మరువలేనిదని, ఆయన సహకారం లేకుంటే ప్రత్యేక రాష్ట్రం వచ్చేది కాదని సీఎం రేవంత్‌ రెడ్డి అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆయన సమయస్ఫూర్తి ఎంతో పని కొచ్చిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జైపాల్‌ రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియా గాంధీ కూడా ఓసారి చెప్పారని రేవంత్‌ రెడ్డి గుర్తు చేశారు. శనివారం హైదరాబాద్‌లో క్యాపిటల్‌ ఫౌండేషన్‌ సొసైటీ-, ఇక్ఫై నిర్వహించిన ఎస్‌. జైపాల్‌ రెడ్డి స్మారక అవార్డు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌ రెడ్డి పాల్గొన్నారు. ప్రముఖ ఆర్థిక నిపుణులు మోహన్‌ గురుస్వామికి జైపాల్‌ రెడ్డి డెమొక్రసీ తొలి అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ మాట్లాడుతూ.. జైపాల్‌ రెడ్డికి ప్రతిపక్ష పార్టీలతో కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే విభేదాలు ఉండేవని, రాజకీయాల్లో ఆయన 40 ఏళ్ల పాటు- అజాతశత్రువుగా ఉన్నారని కొనియాడారు. సమాచార హక్కు చట్టం రావడంలో జైపాల్‌ రెడ్డి పాత్ర ఎంతో ఉందన్నారు. సంస్కరణల అమలుకు జైపాల్‌ రెడ్డి ఎంతో తాపత్రయపడేవారన్నారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం జైపాల్‌ రెడ్డి ఎంతో కృషి చేశారని అన్నారు. తెలంగాణ నుంచి పీవీ నర్సింహా రావు తర్వాత అంత పేరు తెచ్చుకున్నది జైపాల్‌ రెడ్డి మాత్రమేనన్నారు. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని జైపాల్‌ రెడ్డి చెప్తుండేవారని ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని

మిగతా 2లో..

> 'తెలంగాణ కోసం జైపాల్‌రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియాగాంధీ కూడా ఓసారి చెప్పారు. సమాచారహక్కు చట్టం రావడంలో జైపాల్‌రెడ్డి కృషి ఎంతో ఉంది. సంస్కరణల అమలుకు కూడా ఆయన ఎంతో తాపత్రయపడేవారు. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని ఆయన చెబుతుండేవారు. ఇవాళ ఐడియాలజీ పాలిటిక్స్‌ కనుమరుగై స్విగ్గీ పాలిటిక్స్‌ వచ్చాయి. ఇవాళ రాజకీయాలు ప్రమాదకరమైన దిశలో వెళ్తున్నాయి. ప్రజాస్వామిక విలువలు తగ్గి పొలిటికల్‌ మేనేజ్‌మెంట్‌ పెరిగింది. రాజకీయాల్లో కార్యకర్తలు కనుమరుగై వాలంటీర్లు పెరిగిపోయారు. పీవీ నరసింహారావు, జైపాల్‌రెడ్డి స్ఫూర్తి రాజకీయాల్లో కొనసాగాలి."
>
> – ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి



## తెలంగాణలో ఉపాధ్యాయుల పదోన్నతులకు పచ్చజెండా

### 2 రోజుల్లో షెడ్యూల్‌ విడుదల చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్‌(జనంసాక్షి) తెలంగాణలో ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీనికి సంబంధించిన దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎస్జీటీలు, స్కూల్‌ అసిస్టెంట్లకు పదోన్నతులు రానున్నాయి. దీనికి సంబంధించి రెండు రోజుల్లో షెడ్యూల్‌ విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2000 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించే అవకాశం ఉంది. స్కూల్‌ అసిస్టెంట్లకు గెజిటెడ్‌ హెడ్‌మాస్టర్‌లుగా పదోన్నతి రావాల్సి ఉంది. గతేడాది సుమారు 1500 మంది స్కూల్‌ అసిస్టెంట్లకు ఈమేంకు పదోన్నతి ఇచ్చారు. కొన్ని కారణాల వల్ల మల్టీజోన్‌-2లో మిగిలిపోయినవి, పదవీ విరమణ వల్ల సుమారు 750 గెజిటెడ్‌ హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్‌ అసిస్టెంట్లకు పదోన్నతి ఇచ్చి వీటిని భర్తీ చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఉపాధ్యా యులు దీనికోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా దీని కి సంబంధించిన ఫైల్‌ క్లియర్‌ అయ్యింది. పదోన్న తులతో ఖాళీ అయ్యే స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులను ఎస్జీటీలతో భర్తీ చేయనున్నారు. అదేవిధంగా డీఎస్సీ-2012

మిగతా 2లో..

## పార్టీలకతీతంగా అర్హులందరికీ రేషన్‌కార్డులు



చిగురుమామిడి(జనంసాక్షి): కరీంనగర్‌ జిల్లా చిగురుమామిడి మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. లబ్ధిదారు లకు కొత్త రేషన్‌ కార్డులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ రేషన్‌ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వారికి మహిళా సంఘం నుంచి రూ.లక్ష రుణం ఇస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్‌ వాడకుం డా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

## చేనేత రంగంలో తెలంగాణది ప్రత్యేక స్థానం

డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యతతో వస్త్రాలను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలి : మంత్రి తుమ్మల



హైదరాబాద్‌(జనంసాక్షి): మహిళా శక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. చేనేత, జౌళిశాఖ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు

మిగతా 2లో..

## వదలని వాన



- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేడు అతి భారీ వర్షాలు
- నిండుకుండలా హుస్సేన్‌సాగర్‌
- భద్రాచలం వద్ద పెరుగుతున్న
- గోదావరి మట్టం.. కడెం గేట్లు ఎత్తివేత
- జార్ఖండ్‌ వద్ద వాయుగుండం
- పలు ప్రాంతాలకు భారీ వర్ష సూచన

భద్రాచలం(జనంసాక్షి):ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరిలో క్రమంగా నీటిమట్టం పెరుగుతున్నది. శనివారం 11 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 34.4 అడుగులకు చేరింది. దీంతో స్నాన ఘట్టాల ప్రాంతం వద్ద మెట్లు- వరద నీటిలో మునిగిపోయాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో నీటి మట్టం మరింత పెరుగుతుందని అధికారులు తెలిపారు. వరద ఉధృతి నేపథ్యంలో లోతట్టు- ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీచేశారు. కాగా, దుమ్ముగూడం మండలం పర్ణశాల వద్ద పర్యాటక ప్రదేశం నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగిపోయింది.

మిగతా 2లో..

## కేసులెత్తేస్తే పార్టీని విలీనం చేస్తామన్నారు

### కేటీఆర్‌పై భాజపా ఎంపీ సీఎం రమేశ్‌ సంచలన వ్యాఖ్యలు

- బీజేపీలోకి బీఆర్‌ఎస్‌ విలీనం
- మరోసారి పేలిన బాంబు



అనకాపల్లి(జనంసాక్షి):తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్‌ తనపై చేసిన ఆరోపణలను అనకాపల్లి భాజపా ఎంపీ సీఎం రమేశ్‌ ఖండించారు. అనకాపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. "తెలంగాణలో నాకు సీఎం రేవంత్‌ రెడ్డి రూ.1660 కోట్ల నామినేషన్‌ వర్క్‌ ఇచ్చారని అవగాహన లేకుండా కేటీఆర్‌ మాట్లాడుతున్నారు. రేవంత్‌ రెడ్డిపై బురద జల్లాలని నాపై లేనిపోని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఏపీలో జగన్‌ ఇంట్లో సమస్య ఉన్నట్లే.. కేటీఆర్‌కు కూడా

మిగతా 2లో..

## ఇప్పటికీ.. ఎప్పటికీ.. విలీనం ప్రసక్తే లేదు

- ఇతర పార్టీల్లోనూ బీఆర్‌ఎస్‌ కలిసేది లేదు
- ఆ విషయం తెలంగాణ ప్రజలకు కూడా తెలుసు
- ఇరకాటంలో పడిన ప్రతిసారీ కాంగ్రెస్‌,భాజపా నేతలు పనికిరాని అంశాన్ని తెరమీదకు తీసుకొస్తున్నారు.. కేటీఆర్‌ కౌంటర్‌



హైదరాబాద్‌(జనంసాక్షి):తెలంగాణ ప్రజల కోసం పుట్టి, పోరాడిన భారాస రాష్ట్ర సమితి ఇప్పుడే కాదు.. ఎప్పటికీ ఏ ఇతర పార్టీలో విలీనమయ్యే ప్రసక్తే లేదని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ అన్నారు. ఆ విషయం తెలంగాణ ప్రజలకు కూడా తెలుసన్నారు. ఇరకాటంలో పడిన ప్రతిసారీ కాంగ్రెస్‌, భాజపా నేతలు ఈ పనికిరాని చెత్త అంశాన్ని తెరమీదకు తీసుకొచ్చి, రాష్ట్ర ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆక్షేపించారు. ఎంపీ సి.ఎం.

మిగతా 2లో..

## కృష్ణా,గోదావరి జలాలపై మళ్లీ ఉద్యమిస్తాం

- బనకచర్ల పేరుతో చంద్రబాబు కుట్రలు
- ఆయనకు రేవంత్‌ రెడ్డి పరోక్ష సహకారం
- కృష్ణా నీటిని రాయలసీమకు తరలించే ఎత్తులు
- నికరజలాలే లేనప్పుడు మిగులు జలాలు ఎక్కడివి?
- బీఆర్‌ఎస్‌ విద్యార్థి విభాగం సమావేశంలో హరీశ్‌



హైదరాబాద్‌(జనంసాక్షి): సీఎం రేవంత్‌రెడ్డికి నిద్రలో కూడా కేసీఆర్‌ గుర్తుకు వస్తున్నారని, అందుకే ఆయన పేరును పదే పదే ప్రస్తావిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌ మల్లాపూర్‌లోని ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు- చేసిన సదస్సులో గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు వల్ల కలిగే నష్టంపై ప్రజంటేషన్‌ ఇచ్చారు. ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలు, భవిష్యత్‌ కార్యాచరణపై బీఆర్‌ఎస్వీ

మిగతా 2లో..



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్‌

### ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టుల మృతి

చర్ల(జనంసాక్షి):ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌ జిల్లాలో ఎన్‌కౌంటర్‌ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలను భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్‌ జిల్లాలోని నైరుతి ప్రాంతంలో మావోయిస్టుల ఉనికికి సంబంధించి సమాచారం అందగా భద్రతా బలగాలు కూంబింగ్‌ చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల వారోత్సవాలకు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ వారోత్సవాలకు ముందే ఎన్‌కౌంటర్‌ చోటుచేసుకోవడం గమనార్హం.

## యాదాద్రి జిల్లాలో రోడ్డు ప్రమాదం..

ఘటనలో ఇద్దరు ఏపీ డీఎస్పీలు మృతి

వార్త 9 లో

## ఇకపై అమెరికా వీసా మరింత కఠినం

### ఆ దేశ పౌరసత్వం కోసం నిబంధనలపై మరిన్ని ఆంక్షలు



వాషింగ్టన్‌(జనంసాక్షి): అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటినుంచి వలసల అంశంపై ప్రత్యేక దృష్టిసారించారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ ట్రంప్‌. వీసా, పౌరసత్వ విధానాలు మరింత కఠినతరం చేసే దిశగా కొత్త ఆలోచనలు చేస్తూనే ఉన్నారు. తమ ప్రభుత్వం నైపుణ్యం కలిగిన కార్మికుల కోసం వీసా వ్యవస్థలో మార్పులు చేయనుందని యూఎస్‌ సిటిజన్‌షిప్‌ అండ్‌ ఇమిగ్రేషన్‌ నూతన అధ్యక్షుడు జోసెఫ్‌ ఎడ్లో ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. అమెరికా పౌరసత్వం కోసం నిర్వహించే పరీక్షలు మరింత క్లిష్టంగా మార్చాలనే యోచనలో ఉన్నట్లు చెప్పారు. "ప్రస్తుతం నిర్వహిస్తోన్న పరీక్షలు ఏమంత కఠినంగా లేవు. టెస్టుల్లో బట్టీ పట్టి అప్పగించే సమాధానాలు ఉంటున్నాయి. యూఎస్‌ ఆర్థికవ్యవస్థ కోసం హెచ్‌-1బీ వీసాను ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై పునరాలోచన చేస్తున్నాం" అని ఎడ్లో పేర్కొన్నారు. ట్రంప్‌ తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడే దీన్ని సంస్కరించే ప్రయత్నాలు చేపట్టారు. అయితే తర్వాత అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన జో బైడెన్‌ ఆ నిర్ణయాన్ని ఉపసంహరించారు.అమెరికాలో కొత్త ప్రభుత్వం వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తోంది. వీసాల జారీ కోసం 'సోషల్‌ మీడియా వెట్టింగ్‌'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని హెచ్చరించింది కూడా. ఇక, అమెరికా పౌరసత్వం కోసం కొత్త ప్రతిపాదనలు చర్చల దశలో ఉన్న సంగతి తెలిసిందే. అందుకోసం ఎన్నడూ లేనివిధంగా ఓ రియాలిటీ షో ఏర్పాటుచేస్తున్నట్టుగా వార్తలు వచ్చాయి.

## చర్చల విషయంలో భారత్‌దే తుది నిర్ణయం




### ఆ దేశ అధికారిక స్పందన కోసం మేం ఎదురుచూస్తున్నాం: పాక్‌

న్యూయార్క్‌(జనంసాక్షి):ఆపరేషన్‌ సిందూర్‌ దెబ్బకు కాళ్లబేరానికి వచ్చిన పాకిస్థాన్‌కు తలబిరుసు మాత్రం తగ్గడం లేదు. ఒకవైపు సీమాంతర ఉగ్రవాదానికి కాలుదువ్వు తూనే..భారత్‌తో చర్చలకు సిద్ధమంటూ అంతర్జాతీయ వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలిస్తోంది. తాజాగా పాక్‌ ఉపప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి ఇషఖ్‌ దార్‌ అదే తరహా వ్యాఖ్యలు చేశారు. చర్చల విషయంలో న్యూదిల్లీ తుది నిర్ణయం తీసుకోవాలని, ఆ దేశ అధికారిక స్పందన కోసం తాము ఎదురుచూస్తున్నామని వెల్లడించారు "వాణిజ్యం, ఆర్థిక సహకారం, ఉగ్రవాదంపై పోరాటం.. ఇలా ప్రతి అంశంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు పాక్‌ సిద్ధంగా ఉంది. ఆ చర్చలు అర్థవంతంగా ఉండాలి" అని మాట్లాడారు. అయితే, కశ్మీర్‌ అంశం, సరిహద్దు భద్రత, ఆర్థిక సంబంధాల్లో ఉన్న ఆందోళనలపై గతంలోని విధివిధానాల ఆధారంగానే చర్చలు ఉండాలని నిబంధనలు పెట్టడం గమనార్హం. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్‌ సింధూర్‌ తదితర

మిగతా 2లో..

## భారత్‌ మాకు కొండంత అండ

- న్యూదిల్లీతో స్నేహబంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ఎంతో ఉత్సాహంతో ఉన్నాం: మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు
- పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా ఇరు దేశాల మైత్రీ: మోదీ

వార్త 2 లో

## శత్రుమూకల ఆట కట్టించే 'రుద్ర'

- భారత సైన్యంలో కొత్తగా ఏర్పాటైన శక్తిమంతమైన దళం
- భవిష్యత్‌ ముప్పను ఎదుర్కొనేలా వ్యూహం
- సైన్యాధిపతి జనరల్‌ ఉపేంద్ర ద్వివేది వెల్లడి

## కేసులెత్తేస్తే పార్టీని విలీనం చేస్తామన్నారు

ఉంది. ప్రజలను మభ్యపెట్టేందుకు కేటీఆర్ నాలాంటివాళ్లపై ఆరోపణలు చేస్తున్నారు. కవిత జైల్లో ఉన్నప్పుడు ఢిల్లీలో నా ఇంటికి వచ్చి కలిసిన విషయం కేటీఆర్ మర్చిపోయారా..? కేసులు ఎత్తివేస్తే.. భాజపాలో భారత రాష్ట్ర సమితిని విలీనం చేస్తామని చెప్పింది మర్చిపోయారా..? రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో భాజపా, తెదేపా కలిసి పోటీ చేస్తాయన్న భయంతో కేటీఆర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారు. నాపై చేసిన తప్పుడు ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధం. తెలంగాణ భవన్‌లోనైనా.. ప్రెస్‌క్లబ్‌లోనైనా మీ ఇష్టం. మీ ప్రతి మాటకు జవాబు ఉంటుంది. ఇంకా చాలా నిజాలు చెప్పాల్సి ఉంటుంది” అని సీఎం రమేశ్ స్పష్టం చేశారు

### ఇప్పటికీ.. ఎప్పటికీ..

## వీలీనం ప్రసక్తే లేదు

రమేశ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరూ కలిసి వస్తే.. హెచ్‌సీయూ రూ.10 వేల కోట్ల కుంభకోణంపైనా, రూ.1660 కోట్ల రోడ్ కాంట్రాక్ట్ స్కామ్ పైనా కలిసి చర్చిద్దామని సవాల్ విసిరారు. సి.ఎం. రమేశ్ చేసిన ఆరోపణలపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా కుమ్మక్కు రాజకీయం తెలంగాణలో జరుగుతోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ సి.ఎం. రమేశ్‌ల బాగోతాన్ని తాను బయట పెట్టడంతో ఏం చేయాలో తోచక ఇద్దరూ సతమతమవుతున్నారని వ్యాఖ్యానించారు.

## భారత్ మాకు కొండంత అండ

**న్యూఢిల్లీతో స్నేహబంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ఉత్సాహంతో ఉన్నాం: మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు**

**పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా ఇరు దేశాల మైత్రి: మోదీ**

**మాలీ(జనంసాక్షి):**‘ఇండియా ఔట్’ విధానాన్ని అనుసరించి నాడు భారత్‌తో ఘర్షణ పడిన మాల్దీవులు ఇప్పుడు న్యూఢిల్లీతో స్నేహబంధాన్ని పునరుద్ధరించుకునేందుకు ఆరాటపడుతోంది. భారత్ తమకు అత్యంత విశ్వసనీయమైన భాగస్వామి అని, మిత్ర దేశమని మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు కొనియాడారు. ఆ దేశ పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోదీతో భేటీ అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “సుదీర్ఘకాలంగా మాల్దీవులకు భారత్ సన్నిహిత, విశ్వసనీయ భాగస్వామిగా నిలుస్తోంది. భద్రత, వాణిజ్యం, ఆరోగ్య సంరక్షణ, విద్య వంటి విస్తృత రంగాల్లో ఇరుదేశాల మధ్య పరస్పర సహకారం కొనసాగుతోంది. ఎలాంటి విపత్తులు, సంక్షోభాల సమయంలోనైనా మా ద్వీప దేశానికి భారత్ అండగా నిలిచింది. వేగంగా స్పందించి ఆపన్నహస్తాన్ని అందించింది” అని ముయిజ్జు ప్రశంసించారు. తమ దేశ పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీ (%వీశీఉఱ మీఖ్రీఉఱజవం ఎఱంఱ%)కి మాల్దీవులు అధ్యక్షుడు అధికారిక విందు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా మోదీ నాయకత్వాన్ని కొనియాడారు. 4,078 రోజుల పాటు ప్రధాని పదవిలో కొనసాగుతుండటం అనేది చిరస్మరణీయ మైలురాయి అని అన్నారు. “ప్రజాసేవపై మీకున్న నిబద్ధత, దేశ ప్రజల పురోగతి, శ్రేయస్సుపై మీకున్న అంకితభావానికి ఈ మైలురాయి నిదర్శనం” అని ముయిజ్జు ప్రశంసలు కురిపించారు. అంతకుముందు ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా భారత్, మాల్దీవుల మైత్రీ సాగుతోందని తెలిపారు. రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంలో ఈ ద్వీప దేశానికి అండగా ఉంటామన్నారు. భారత్ ‘పొరుగు వారికి ప్రాధాన్యం’ విధానంలో మాల్దీవుల కు ముఖ్యస్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. ద్వీప దేశానికి రూ.4,850 కోట్ల రుణాన్ని ప్రకటించారు. ఈ పర్యటనలో భాగంగా శనివారం మాల్దీవులు స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు

నమోదు చేసినట్టు రాజేంద్రనగర్ పోలీసులు తెలిపారు. నిన్న సీఎంపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో కౌశిక్‌రెడ్డి నివాసానికి ఆయన మద్దతుదారులు, భారత రాష్ట్ర సమితి శ్రేణులు భారీగా చేరుకున్నారు. కొండాపూర్‌లోని కొల్లా లగ్జరీస్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసం ఉండగా.. ఆయన ఇంటిపై ఏ క్షణమైన దాడి జరిగే అవకాశం ఉందనే సమాచారంతో పోలీసులు మోహరించారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దాడి చేస్తే అడ్డుకునేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు చెబుతున్నారు.

## కార్గిల్ యుద్ధవీరుల సంస్మరణ

**నివాళి అర్పించిన రాష్ట్రపతి, ప్రధాని**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ.. అమర జవాన్లకు నివాళులు అర్పించారు. నాటి యుద్ధంలో పాక్‌పై విజయం కోసం జవానులు చేసిన త్యాగాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రధాని, రాష్ట్రపతితో పాటు– త్రివిధ దళాధిపతులు కూడా అమర జవాన్‌లకు నివాళులు అర్పించారు. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్‌లకు తాను నివాళులు అర్పిస్తున్నానని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎక్స్ వేదికగా స్పందించారు. దేశ సైనికుల ధైర్యసాహసాలు, సడలని పట్టు–దలకు ఈ రోజు చిహ్నమని వ్యాఖ్యానించారు. వారి త్యాగాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కూడా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత మాత బిడ్డల ధైర్యసాహసాలు, త్యాగాలను ఈ రోజు గుర్తుకు తెస్తోందని అన్నారు. భారత్ సగర్వంగా తలెత్తుకునేలా జవాన్‌లు తమ జీవితాలను అంకితం చేశారని వ్యాఖ్యానించారు. 1999లో పాక్‌పై యుద్ధంలో విజయాన్ని, అమర జవానుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ఏటా జులై 26న భారత్‌లో కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 1999 మేలో పాక్ సైనికులు ఉగ్రవాదుల వేషాల్లో భారత్‌లోకి చొరబడ్డారు. కార్గిల్ ప్రాంతంలోని ఎత్తైన భూభాగాలను తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు. పాక్ ఆట కట్టించేందుకు భారత్ ఆపరేషన్ విజయ్‌ను ప్రారంభించింది. కఠిన వాతావరణ పరిస్థితులకు ఎదురు నిలిచిన భారత జవాన్లు అద్భుత పోరాట పటిమతో పాక్ సైనికులను తరిమి కొట్టి భారత్ భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. దాదాపు రెండు నెలల పాటు– ఈ ఆపరేషన్ సాగింది. విజయం సాధించామని భారత్ జులై 26న అధికారికంగా ప్రకటించింది. ఇక ఈ ఆపరేషన్ సందర్భంగా 527 మంది సైనికులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జైపాల్ రెడ్డి పాత్ర కీలకం

మేం ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత రాజకీయాలకంటే సిద్ధాంతపరమైన రాజకీయాలు ముఖ్యమన్నారు. ప్రస్తుతం ఐడియోలాజికల్ పాలిటిక్స్ పోయి స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని.. సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసేవాళ్లు దేశ రాజకీయాల్లో తగ్గుతూ వస్తున్నారని.. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదమని అభిప్రాయపడ్డారు. యూనివర్శిల నుంచే సిద్ధాంత పరమైన రాజకీయాలు తయారు అవుతాయని పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఇవాళ రాజకీయాలు ప్రమాదకరమైన దిశలో వెళ్తున్నాయి. ప్రజాస్వామిక విలువలు తగ్గి.. పొలిటికల్ మెనేజ్‌మెంట్ పెరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన చెందారు.. దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీరోల్ ప్లే చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోందన్నారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్ కు ప్రమాదకరమన్న రేవంత్.. యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలు సహేతుకమైన సూచన చేస్తే తీసుకోవడానికి మాకు ఇబ్బంది లేదని రేవంత్ స్పష్టం చేశారు. అందుకే తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు.

జైపాల్‌రెడ్డి లేకుంటే ప్రత్యేక తెలంగాణ సాకారం అయ్యేదే కాదు

కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం జైపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు తర్వాత అంత పేరు తెచ్చుకున్నది జైపాల్‌రెడ్డి మాత్రమేనని రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయాల్లో ధనప్రవాహం తగ్గాలని జైపాల్‌రెడ్డి చెప్తుండే వారని గుర్తు చేశారు. జైపాల్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని తాము ముందుకు తీసుకెళ్తామని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌రెడ్డి పాత్ర ఎన్నటికి మరువలేనిదని, జైపాల్‌రెడ్డి లేకుంటే ప్రత్యేక తెలంగాణ సాకారం అయ్యేది కూడా కాదని వెల్లడించారు.” సమాచారహక్కు చట్టం రావడంలో జైపాల్‌రెడ్డి కృషి ఎంతో ఉంది. సంస్కరణల అమలుకు కూడా ఆయన ఎంతో తాపత్రయపడేవారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం ఎంతో కృషి చేశారు. తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు తర్వాత అంతపేరు తెచ్చుకున్నది



జైపాల్ రెడ్డి మాత్రమే. రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గాలని ఆయన చెబుతుండేవారు. తెలంగాణ కోసం జైపాల్‌రెడ్డి ఎంతో చొరవ చూపారని సోనియాగాంధీ కూడా ఓసారి చెప్పారు. ఇవాళ ఐడియాలజీ పాలిటిక్స్ కనుమరుగై.. స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయి. ఇవాళ రాజకీయాలు ప్రమాదకరమైన దిశలో వెళుతున్నాయి. ప్రజాస్వామిక విలువలు తగ్గి.. పొలిటికల్ మెనేజ్‌మెంట్ పెరిగింది” అని రేవంత్‌రెడ్డి అన్నారు.

### తెలంగాణలో ఉపాధ్యాయుల

## పదోన్నతులకు పచ్చజెండా

తర్వాత పీఈటీ, భాష పండితులకు కూడా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉంది. వీరు దాదాపు 800 మంది ఉన్నారు. వారి పదోన్నతికి కూడా ప్రభుత్వం అనుమతించినట్లు సమాచారం. ఇలా దాదాపు 2 వేల మంది పదోన్నతులు పొందే అవకాశం ఉంది. జూన్ 30 వరకు ఉన్న ఖాళీలను ఆధారంగా తీసుకుని ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే చాలా పాఠశాలల్లో రెగ్యులర్ హెడ్‌మాస్టర్లు లేకపోవడం వల్ల.. ఈ కొరత తీర్చేందుకు ప్రభుత్వం వేగంగా ఈ ప్రక్రియను పూర్తిచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## చేనేత రంగంలో తెలంగాణది ప్రత్యేక స్థానం

7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేనేత రంగంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందన్న తుమ్మల.. రాష్ట్రానికి చెందిన వివిధ రకాల చేనేత వస్త్రాలను జాతీయ చేనేత దినోత్సవం రోజు ఏర్పాటు చేసే ప్రదర్శనలో ఆయా సంఘాల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యతతో వస్త్రాలను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేనేత రుణ మాఫీ పథకం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి.. ఖాతాల్లో నిధులు జమచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నేతన్న పొదుపు, భరోసా పథకాలను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

## శత్రుమూకల ఆట కట్టించే ‘రుద్ర’

- భారత సైన్యంలో కొత్తగా ఏర్పాటైన శక్తిమంతమైన దళం
- భవిష్యత్ ముప్పును ఎదుర్కొనేలా వ్యూహం
- దళాలతో కలిపి ప్రత్యేకంగా విభాగం
- సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పాక్‌తో యుద్ధం, చైనాతో సరిహద్దు వివాదాల నేపథ్యంలో భారత సైన్యం ఎప్పటికప్పుడు వ్యూహాలను మారుస్తూ బలోపేతం అవుతోంది. ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో మన బలగాల సత్తా చాటాయి. అయితే దీనిని మరింత ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో శత్రుమూకల ఆట కట్టించేలా భారత సైన్యంలో ఓ శక్తిమంతమైన దళం



ఏర్పాటైంది. భవిష్యత్తు ముప్పును ఎదుర్కొనేలా ’ఆల్ ఆర్మ్స్ బ్రిగేడ్’ను ఏర్పాటుచేసినట్లు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది వెల్లడించారు. దీనికి ’రుద్ర’ అని పేరు పెట్టినట్లు తెలిపారు. శనివారం ’కార్గిల్ విజయ్ దివస్ ’ సందర్భంగా ఆయన అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రుద్ర ఏర్పాటును ప్రస్తావించారు. భారత సైన్యం ప్రస్తుత సవాళ్లను విజయవంతంగా ఎదుర్కోవడంతో పాటు– భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉండేలా ఈ యూనిట్‌ను ఏర్పాటు చేసినట్లు– జనరల్ ద్వివేది వెల్లడించారు. పదాతిదళం, యాంత్రిక పదాతిదళం, సాయుధ యూనిట్లు– ఫిరంగిదళం, ప్రత్యేక దళాలు, మానవరహిత వైమానిక వ్యవస్థలు వంటి వ్యవస్థలతో కూడిన దళం ఇదని వెల్లడించారు. అన్ని దళాలకు ఇందులో భాగస్వామ్యం ఉంటుంది. సరిహద్దులోని శత్రువుల వెన్నులో వణుకు పుట్టించేందుకు భైరవ్ అనే లైట్ కమాండో బెటాలియన్ యూనిట్లను కూడా ఏర్పాటు– చేసినట్లు– తెలిపారు. కాగా.. ఇప్పటికే రెండు పదాతిదళ బ్రిగేడ్‌లు రుద్రలో భాగమైనట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈసందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి దేశం మొత్తాన్ని కలచివేసిందన్నారు. దీనికి ప్రతిస్పందనగా ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాదాన్ని సహించేది లేదనే గట్టి సందేశాన్ని పాకిస్థాన్‌కు ఇచ్చామన్నారు. దేశ ప్రజల విశ్వాసం, ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛ కారణంగా ఇది సాధ్యమైందన్నారు. మన ఐక్యత, సార్వభౌమత్వాన్ని సవాలు చేయడంతో పాటు– ప్రజలకు హాని చేయాలని చూసేవారికి ఇది సరైన సమాధానం చెప్పిందన్నారు. పాక్‌లోని ఉగ్రమూకల సదుపాయాలను నేలమట్టం చేయడంతో పాటు– ఆ దేశ దుందుడుకు చర్యలను కూడా అరికట్టామన్నారు. భారత్ నిర్ణయాత్మకమైన విజయం సాధించిందని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా అమరవీరులకు భారత వాయుసేన ఘనంగా నివాళులర్పించింది. కార్గిల్ యుద్ధం నాటి చిత్రాలతో ప్రత్యేక వీడియోను రూపొం దించింది. ఆ వీడియోను వాయుసేన తమ అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకుంది. అమరవీరుల ధైర్యం, త్యా గం దేశ ప్రజలకు స్ఫూర్తి నిస్తూనే ఉంటుందని పేర్కొంది. కార్గిల్ యుద్ధం జరిగిన విషయం తెలిసిందే. ముజాహిదీన్ల ముసుగులో నియంత్రణ రేఖ దాటి భారత భూభా గంలోకి చొచ్చుకు వచ్చిన శత్రు సైన్యాలు కార్గిల్‌లో ఖాళీగా ఉన్న కీలక స్థావరాలను వశం చేసుకున్నాయి. వీరి ఆక్రమణను తెలుసుకున్న భారత సైన్యం ’ఆపరేషన్ విజయ్’ను ప్రారంభించి.. ఎదురుదాడి చేసి స్థావరాలను తిరిగి సొంతం చేసుకుంది.


## చర్చల విషయంలో భారత్‌దే తుది నిర్ణయం

పరిణామాలతో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గతంలో భారత్‌తో శాంతి చర్చల విషయాన్ని ప్రస్తావించారు. చర్చలకు సిద్ధమంటూనే కశ్మీర్, ఉగ్రవాదం, వాణిజ్యం, జల వివాదం సహా అన్ని సమస్యలపై ఇరు దేశాలు చర్చించాలంటూ షరతు విధించారు.

**టీఆర్‌ఎఫ్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించిన అమెరికా**

## మాకు అభ్యంతరం లేదు: పాక్

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడిన ‘ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌ను అమెరికా ఇటీవల ఉగ్రసంస్థగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయంపై తాజాగా పాకిస్థాన్ స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. టీఆర్‌ఎఫ్‌ను ఉగ్ర సంస్థగా ప్రకటించడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో పాక్ విదేశాంగ శాఖ మంత్రి మహమ్మద్ ఇషాక్ దార్ భేటీ అయ్యారు. ఈసందర్భంగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో దార్ మాట్లాడుతూ.. ‘టీఆర్‌ఎఫ్‌ను ఉగ్రసంస్థగా ప్రకటించే సార్వభౌమాధికారం అమెరికాకు ఉంది. దీనిపై మాకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. వారి ప్రమేయం ఉందనే ఆధారాలు ఉంటే అలా చేయొచ్చు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం’ అని పేర్కొన్నారు. అయితే, టీఆర్‌ఎఫ్‌ను లష్కరే తయిబా అనుబంధ సంస్థ అని పేర్కొనడాన్ని ఆయన తప్పుబట్టారు. ఆ సంస్థను తాము కొన్ని సంవత్సరాల క్రితమే కూల్చేశామన్నారు. వారిని విచారించి, అరెస్టు చేసి జైల్లో పెట్టామన్నారు. ఇటీవల ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో పహల్గాంలో ఉగ్రదాడిని ఖండించే తీర్మానంలో టీఆర్‌ఎఫ్‌ను ప్రస్తావించడాన్ని దార్ వ్యతిరేకించారు. దాని కార్యకలాపాలకు సంబంధించి పాక్‌కు మరిన్ని ఆధారాలు అవసరమని పేర్కొన్నారు. టీఆర్‌ఎఫ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థగా, ప్రత్యేకంగా ముద్ర పడిన అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ఇటీవల ప్రకటించింది. తమ జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడటం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, పహల్గాం దాడికి న్యాయం చేయడం కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. ఈ ప్రకటనను భారత్ స్వాగతించగా.. పాక్ తప్పుబట్టింది. పాక్‌లో నిష్ఫలంగా ఉన్న నిషేధిత లష్కరే తయిబాతో పహల్గాం దాడికి ముడిపెట్టడం వాస్తవాలను తప్పుదారి పట్టించడమే అవుతుందని వాదించింది. ఆ ఉగ్రసంస్థను తాము ఇప్పటికే ధ్వంసం చేశామని తెలిపింది. ఈ చర్యతో పాక్‌ను ప్రపంచం ముందు అవమానపరచడమేనని పేర్కొంది. ఏప్రిల్‌లో జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా విరుచుకుపడిన సంగతి తెలిసిందే.



# వదలని వాన

దీంతో పర్యాటకులను ఆపివేశారు. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు కూడా భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నది. ఈ నేపథ్యంలో లోతట్టు– ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు– చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిర్మల్ జిల్లాలోని కడెం జలాశయం జలకళను సంతరించుకుంది. ఈ వరద నీరు చేరడంతో కడెం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా.. ప్రస్తుతం 695.150 అడుగులకు చేరుకుంది. అధికారులు జలాశయం గేట్లు ఎత్తడంతో పాలనురుగులా వరద నీరు దిగువకు ప్రవహించిందిఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిసే సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగ్లాదేశ్– పశ్చిమ బెంగాల్ తీరాల మధ్యన ఏర్పడిన వాయుగుండం భూ ఉపరితలంలోకి ప్రవేశించింది. ఇది ప్రస్తుతం ఝార్ఖండ్ ప్రాంతంపై కేంద్రీకృత మయ్యింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం .... ఈ వాయుగుండం మరికొద్ది గంటలపాటు– ఉత్తర భారతదేశంపై కొనసాగుతూ బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. ఇక, ఈ వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. మరి కొన్ని జిల్లాల్లో ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది. అయితే, గంటకు 50 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావం కారణంగా పోర్ట్ అధికారులు 3 వ నెంబర్ ప్రమాద హెచ్చరికలను కొనసాగిస్తున్నారు. తీర ప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు, వచ్చే వారం బంగాళాఖాతంలో మళ్లీ అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు– వాతావరణ శాఖ తెలిపింది. దీని వల్ల రానున్న వారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ప్రజలు అధికారుల సూచనలను పాటించాలి, తీరప్రాంతాల వారు అలర్టుగా ఉండాలని ఐఎండీ తెలిపింది.

**తెలంగాణలో ఇవాళ భారీ నుంచి అతి భారీ వర్షాలు**

హైదరాబాద్: తెలంగాణలో ఇవాళ భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున్న ఆ రెండు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్టు తెలిపింది.

## కృష్ణా,గోదావరి జలాలపై మళ్లీ ఉద్యమిస్తాం

నేతలకు హరీశ్‌రావు దిశానిర్దేశం చేశారు. రేవంత్‌రెడ్డి ఏనాడూ జై తెలంగాణ అనలేదు. ఉద్యమ గుర్తులు, చరిత్ర చెరిపేసే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో నీళ్లు ఆంధ్రాకు, నిధులు ఢిల్లీకి వెళ్తున్నాయి. కాంగ్రెస్, భాజపా, చంద్రబాబు కలిసి రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని.. కృష్ణా, గోదావరి జలాల్లో వాటాను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గురు శిష్యులు కలిసి తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. గోదావరి జలాలను ఏపీకి తరలించే కుట్ర చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి నిలదీసే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్ నేతృత్వంలో మరో ఉద్యమానికి శ్రీకారం చుడతామని, అవసరమైతే భారత రాష్ట్రసమితి తరఫున సుప్రీంకోర్టుకు వెళ్తాం అని హరీశ్‌రావు తెలిపారు. గోదావరిలో తెలంగాణకు 967 టీ–ఎంసీలు, ఏపీకి 513 టీ–ఎంసీలు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణ చర్చ సందర్భంగా ఇవి కూడా చర్చకు వచ్చాయని అన్నారు. కానీ తెలంగాణకు రావాల్సిన 967 టీ–ఎంసీలను కూడా ఏపీ వ్యతిరేకిస్తుందని మండిపడ్డారు. తెలంగాణ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ రాసిన లేఖలను ఏపీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరద జలాలు అంటున్నాడని.. లెక్క తేలకుండా వాటిని ఎలా తీసుకెళ్తావని చంద్రబాబుపై హరీశ్‌రావు మండిపడ్డారు. నీళ్లు నిండుగా ఉంటే గోదావరిపై తెలంగాణ ప్రాజెక్టులను ఎందుకు వ్యతిరేకించావని చంద్రబాబును హరీశ్‌రావు నిలదీశారు. చంద్రబాబు ఉమ్మడి ఏపీలోనే కేటాయించిన నీళ్లనే అడ్డుకుంటున్నాడని మండిపడ్డారు. కచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కేసీఆర్ 2020లోనే కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు లేఖ రాశారని.. సముద్రంలో కలుస్తున్న 3000 టీఎంసీల గోదావరి జలాల్లో తెలంగాణకు 1950 టీ–ఎంసీలు కేటాయించాలని కోరారని హరీశ్‌రావు తెలిపారు. హైదరాబాద్ నీటి అవసరాలు, పరిశ్రమల కోసం వాటిని వినియోగించుంటామని లేఖలో పేర్కొన్నారని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు 400 టీ–ఎంసీలు వినియోగించుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ లెక్క తేలకుండా బనకచర్ల ప్రాజెక్టు ఎట్లా కడుతావని రేవంత్ రెడ్డి అడుగాలి కదా అని ఆయన ప్రశ్నించారు. గోదావరి నీళ్ల లెక్క తేలకుండా, వాటా తేలకుండా రాత్రికి రాత్రి ప్రాజెక్టు కడితే తెలంగాణ ఊరుకోదని హరీశ్‌రావు స్పష్టం చేశారు. దీనికి రేవంత్ రెడ్డి ఒప్పుకున్నా తెలంగాణ సమాజం ఒప్పుకోదని అన్నారు. నీళ్ల కోసం మరోసారి తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తుందని.. మరోసారి యూనివర్సిటీలు ఉద్యమ వేదికలు అవుతాయని హెచ్చరించారు. బనకచర్ల ప్రాజెక్టు కోసం రేవంత్ రెడ్డి సంతకాలు పెడితే కేసీఆర్ ఊరుకోడు.. రైతులు ఊరుకోరని అన్నారు. సుప్రీంకోర్టుకైనా వెళ్తాం.. రోడ్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ వాటాలో చుక్క నీటిని వదలుకోమని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందని హరీశ్‌రావు అన్నారు. పోలవరం ప్రాజెక్టును కట్టి కృష్ణా పరివాహక ప్రాంతానికి నీటిని తీసుకెళ్తామని చెప్పారని తెలిపారు. 1980లో బచావత్ ట్రిబ్యునల్ 80 టీఎంసీలను కృష్ణా నదికి తరలిస్తే, నాగార్జునసాగర్ మీద ఉన్న 45 టీఎంసీలు తెలంగాణకు ఇవ్వాలని చెప్పారని అన్నారు. ఆ 45 టీ–ఎంసీలు మాకు ఇవ్వడానికి చంద్రబాబు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. నదీ పరివాహక ప్రాంతంలో నాగరికత ఉంటు–ందని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటా మనం దక్కించుకోవాలని పిలుపునిచ్చారు. గోదావరి బనకచర్ల ద్వారా తెలంగాణకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు.

## అత్యంత విశ్వసనీయ నేతగా మోడీ

**గ్లోబర్ లీడర్ సర్వేలో ప్రధాని టాప్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని మోదీ మరోసారి టాప్‌లో నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ గ్లోబల్ లీడర్ సర్వేలో మరోసారి తన ఆధిక్యాన్ని నిలుపుకున్నారు. సర్వేలో ప్రధాని మోదీకి అత్యధిక శాతం మంది మద్దతు ప్రకటించడంలో అప్రూవల్ రేటింగ్స్ ఏకంగా 75 శాతానికి చేరాయి. ఈ ఏడాది జులై 4 నుంచి 10 తేదీల మధ్య సర్వేను నిర్వహించారు. ఈ సర్వేలో ప్రధాని నెం.1గా నిలవడంపై బీజేపీ సీనియర్ నేత అమిత్ మాల్వీయ సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారతీయులతో పాటు– ప్రపంచవ్యాప్తంగా మిలియన్‌ల మంది ప్రజల గౌరవాభిమానాలు చూరగొన్న నేతగా ప్రధాని నిలిచారని అన్నారు. అత్యధిక అనుకూల రేటింగ్స్ కలిగిన నేతగా ఉన్నారంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. బలమైన నాయకత్వం, ప్రపంచవ్యాప్తంగా గౌరవాభిమానాలు పొందే నేత సారథ్యంలో భారత్ భద్రంగా ఉందని కామెంట్ చేశారు. మార్నింగ్ కన్సల్ట్ నిర్వహిస్తున్న సర్వేల్లో మోదీ 2021 నుంచి ప్రథమ స్థానంలోనే కొనసాగుతున్నారు. సర్వేల్లో ప్రధానికి మద్దతుగా నిలుస్తున్న వారి సంఖ్య 70 శాతానికి పైగానే ఉంటోంది. 2022 సర్వేలో కూడా 13 ప్రపంచ నేతల్లో జనాదరణ పరంగా ప్రధాని టాప్‌లో నిలిచారు. ఇక 2023 నాటి సర్వేలో ఆయన అప్రూవల్ రేటింగ్స్ 76 శాతానికి ఎగబాకాయి. గతేడాది ఫిబ్రవరిలో జరిగిన సర్వేలో విశ్వసనీయత రేటింగ్స్ గరిష్ఠంగా 78 శాతాన్ని తాకాయి. ఇక తాజా సర్వేలో ప్రధాని తర్వాతి స్థానంలో దక్షిణ కొరియా నేత లీ జే మ్యూంగ్ ఉన్నారు. 59 శాతం అప్రూవల్ రేటింగ్స్‌తో రెండో స్థానంలో నిలిచారు.

# ఒక అభ్యర్థి.. ఒకే నామినేషన్!

## ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీకి పోటీ చేయటానికి నో చాన్స్

- కుటుంబంలోని ఓటర్లు అందరికీ ఒకే పోలింగ్‌బూత్‌లో ఓటుహక్కు
- ఎంపీటీసీకి గులాబీ, జడ్పీటీసీ ఎన్నికకు తెలుపు బ్యాలెట్ పేపర్లు
- స్థానిక ఎన్నికల్లోనూ నోటా!
- జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు




**ములుగు ప్రతినిధి, జులై 26(జనంసాక్షి) :** గతంలో ఒక అభ్యర్థి అనేక పదవులకు పోటీచేసే అవకాశం కల్పించారు. ఇప్పుడు ఒక అభ్యర్థి ఒక్క పదవికే పోటీపడాలనే నిబంధనను తీసుకురానున్నట్టు సమాచారం. ఒక అభ్యర్థి ఒకేసారి జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులకు పోటీచేసే అవకాశమూ ఈసారి ఉండబోదని తెలుస్తున్నది. ఇలా ఈసారి స్థానిక ఎన్నికల్లో అనేక కొత్త నిబంధనలను అమలు చేయనున్నారని తెలుస్తున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల చిక్కుముడి వీడకపోయినా, షెడ్యూల్ ఎప్పుడొచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను విభజించారు. చనిపోయినవారి పేర్లను తొలగించి, కొత్తగా ఓటర్లను చేర్చి నూతన జాబితాను రూపొందించారు.

కొత్తగా నోటాను తీసుకొస్తున్నారు. 2004 నుంచి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో మాత్రమే అమలులో ఉన్న నోటా ఇప్పుడు స్థానిక ఎన్నికల్లోనూ అమలు చేయనున్నారు. ఈ మేరకు బ్యాలెట్ పేపర్లలో నోటాను ముద్రించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఎన్నికల అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు. ఎంపీటీసీ పోలింగ్ కోసం గులాబీ, జడ్పీటీసీ ఎన్నిక కోసం తెలుపు రంగు బ్యాలెట్ల పేపర్లను సిద్ధం చేస్తున్నారు. గతంలో మండలం యూనిట్ తీసుకున్నందున ఒక కుటుంబంలో నలుగురు ఓటర్లు ఉంటే కొన్నిసార్లు వారి ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండేవి. ఈసారి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుంటున్నందున కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఓటు వేసేలా చర్యలు తీసుకోనున్నారు. కుటుంబ సభ్యుల ఓట్లన్నీ ఒకే వార్డులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

### ఎన్నికల నాటికి కొత్త ఓటర్లకు చాన్స్..


ఎన్నికల నాటికి కొత్త ఓటర్ల చేరిక, ఉన్నవారిలో మార్పులు, చేర్పులకు దరఖాస్తులను ఆహ్వానిస్తే వారి వివరాలతో వార్డుల వారీగా అనుబంధ జాబితానూ రూపొందిస్తారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పత్రాలను అధికారులు సిద్ధం చేసే పనిలో ఉన్నారు. గతంలో ఉన్న బ్యాలెట్లు, సీళ్లను పరిశీలించాలని ఇప్పటికే పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఆదేశించారు. ఎంతమంది ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఆర్వోలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్వోలు), పోలింగ్ సిబ్బంది అవసరమని గుర్తించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఒక్కో పోలింగ్ స్టేషన్‌కు ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు నలుగురు అధికారులను నియమించనున్నారు.

### కలెక్టర్లకు ఎస్ఈసీ ఆదేశాలు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదేశాలను జారీచేసింది. ఎన్నికల కోసం జిల్లా స్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించింది. ఈ మేరకు తాజాగా జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులను జారీచేసింది. బ్యాలెట్ బ్యాక్సులు, పోలింగ్ సిబ్బంది, కావాల్సిన సామగ్రి, ఇతర సమాచారాన్ని నిర్ణీత ఫార్మాట్‌లో పంపించాలని ఆదేశాల్లో పేర్కొన్నది.

# 30న నిసార్ ప్రయోగం

- రాకెట్ క్రయోజనిక్ ఇంజన్ సాంకేతికతలో భారత్ విజయం
- అమెరికాతో సంయుక్తంగా తయారీ



**బెంగులూరు (జనంసాక్షి) :** భారత్, అమెరికా కలిసి సంయుక్తంగా తయారు చేసిన 'ఎర్త్ ఇమేజింగ్ శాటిలైట్ అయిన సింథటిక్ ఎపర్చర్ రాడార్ శాటిలైట్ ప్రయోగానికి సిద్ధంగా ఉంది. ఇది ఒక సాంకేతిక అద్భుతం, గేమ్ ఛేంజర్‌గా మారుతుందని చెబుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు నుంచి ప్రాణాలను కాపాడేందుకు ఈ శాటిలైట్ ఉపయోగపడుతుంది. 1.3 బిలియన్ డాలర్ల పైగా ఖర్చుతో భారత్, అమెరికాలు కలిసి ఈ శాటిలైట్‌ని రూపొందించాయి. భారత్ లోని శ్రీహరికోట లాంచింగ్ సెంటర్ నుంచి ఈ ఉపగ్రహ ప్రయోగం జరుగుతుంది. భారతీయ రాకెట్ ద్వారా నిసార్‌ని కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. ఒకప్పుడు, 90లలో అమెరికన్లు ఈ రాకెట్ అభివృద్ధిని దెబ్బతీయాలని చూశారు, ఇప్పుడు అదే రాకెట్ ద్వారా నిసార్ అంతరిక్షంలోకి ప్రవేశపెట్టబడుతుంది. జూల్కై 30న ఈ రాకెట్ శ్రీహరికోట నుంచి లాంచ్ చేయబడుతుంది.ఇస్రో చెబుతున్న దాని ప్రకారం.. నిసార్ ఉపగ్రహం 2392 కిలోల బరువు ఉంటుంది. 12 రోజుల వ్యవధిలో ఇది మొత్తం భూమిని అన్ని వాతావరణాలు, పగలు, రాత్రుల్ని స్కాన్ చేసి డేటా ఇస్తుంది. నిసార్ భూమి ఉపరితలంపై మార్పులను, మంచు పలకల కదలికలు, వృక్ష సంపద మార్పులు చేర్పులను గుర్తించగలదు. దీనిని జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ మార్క్ 2 రాకెట్ ఉపయోగించి ప్రయోగిస్తారు. ఇది దేశీయంగా అభివృద్ధి చేసిన క్రయోజనిక్ ఇంజన్‌తో పనిచేసే రాకెట్. 90లలో ఈ సాంకేతికత భారత్‌కు రష్యా నుంచి అందకుండా అమెరికా అడ్డుకుంది. ఎక్కువ బరువు ఉండే, ఎర్త్ సింక్రోనస్ ఆర్బిట్‌లో ఉపగ్రహాలను ప్రవేశపెట్టడానికి భారీ రాకెట్లు- అవసరం అవుతాయి. ఇది క్రయోజనిక్ టెక్నాలజీ ఉపయోగించుకుంటుంది. భారత్ సొంతగా తన క్రయోజనిక్ టెక్నాలజీని అభివృద్ధి చేసుకునేందుకు 20 ఏళు కష్టపడిరది. అమెరికా తిరస్కణలు భారత్‌ని మరింత సమర్థంగా పనిచేసేలా చేసింది. ఈ టెక్నాలజీ పొందకుండా భారత్‌పై ఆంక్షలు, ఒత్తిడిని కూడా ప్రయోగించింది. భారత శాస్త్రవేత్తలు ఎంతో కష్టపడి ఈ టెక్నాలజీని అభివృద్ధి చేశారు. ప్రస్తుతం, ఈ నిసార్ శాటిలైట్‌ని జీఎస్ఎల్వీ మార్క్ -2 రాకెట్ ద్వారా ప్రయోగిస్తున్నారు. దీనికి స్వదేశీ క్రయోజనిక్ ఇంజన్లను వాడుతున్నారు. చివరకు అమెరికా అహంకారాన్ని భారత్ సవాల్ చేసి ఈ టెక్నాలజీని సాధించింది. నిసార్ నాసా, ఇస్రోల 50:50 శాతం భాగస్వామ్యంతో తయారవుతోంది. నిసార్ ప్రాజెక్ట్ కోసం భారత్ ఏకంగా రూ. 800 కోట్లు- ఖర్చు చేసింది.ఈ శాటిలైట్ భూమి, మంచు ఉపరితలాలను ప్రతీ 12 రోజులకు రెండుసార్లు స్కాన్ చేస్తుంది. భారత్ ఎస్-బ్యాండ్ రాడార్‌ను అందించడమే కాకుండా, రాకెట్ లాంచింగ్, ప్రయోగ సేవలను కూడా అందిస్తోంది. నిసార్ నిర్మాణానికి దాదాపుగా 11 ఏళ్లు పట్టింది.

# హాస్పిటల్ శుభ్రంగా ఉంటే సరిపోదు!

### రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి

### కొమరం భీమ్ ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో జులై 26 (జనం సాక్షి) :** హాస్పిటల్ శుభ్రంగా ఉంటే .. మాత్రమే సరిపోదని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ అన్నారు. శనివారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ ఎల్లా గౌడ్ తోటలో గల ప్రభుత్వ సివిల్ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్లోని రోగుల వార్డు, ఫార్మసీ, ల్యాబ్ , డాక్టర్స్ గదులు, ఆపరేషన్ థియేటర్ తదితరాలను సందర్శించారు. హాస్పిటల్లో సరిపడ మందులు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో బురదమయం కావడం తో పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ కాగజ్ నగర్ మండల ఎంపీడీవో కోట ప్రసాద్ ను మరమతు చేయించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో రోగులు ఆరోగ్యం జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్, తాహ సిల్దార్ మధుకర్, ఎంపీడీవో కోట ప్రసాద్, హాస్పిటల్ సూపర్ ఇండెంట్ కేశవరావు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# నితీశ్‌కు మద్దతు ఇచ్చి తప్పుచేశా

### కేంద్ర మంత్రి, లోక్ జన్‌శక్తి పార్టీ నేత చిరాగ్ పాశ్వాన్

**పాట్నా, జూలై26 (జనంసాక్షి) :** ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగునున్న తరుణంలో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కు కేంద్ర మంత్రి, లోక్ జన్‌శక్తి పార్టీ నేత చిరాగ్ పాశ్వాన్ గట్టి షాక్ ఇచ్చారు. రాష్ట్రంలో నేరాలు అదుపు చేసే సామర్థం లేని నితీష్ సారథ్యంలోని ఎన్డీయే సర్కార్‌కు మద్దతిచ్చినందుకు చింతిస్తున్నానని అన్నారు. బిహార్‌లో హోం గార్డ్ రిక్రూట్‌మెంట్‌కు హాజరైన 26 ఏళ్ల మహిళ స్పృహ తప్పిపోవడం, అంబులెన్స్‌లోనే ఆమెపై అత్యాచారం జరిగిన ఘటన తీవ్ర సంచలనం సృష్టించిన నేపథ్యంలో పాశ్వాన్ తాజా వ్యాఖ్యలు చేశారు. హత్యలు, అపహరణలు, దొంగతనాలు, అత్యాచారాలను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పాశ్వాన్ విమర్శించారు. ఇలాంటి వారికి మద్దతు ఇచ్చినందుకు బాధపడుతున్నానని అన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై ఎక్కడైనా చర్చకు సిద్ధమే..

### కాంగ్రెస్ పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారం

### మంత్రివర్గంలో బిసిలకు పెద్దపీట వేయాలి

### బిజెపి మెదక్ ఎంపి రఘునంద్ రావు డిమాండ్



**హైదరాబాద్, జూలై26 (జనంసాక్షి) :** బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారంపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లకు ఆయన బహిరంగ సవాల్ విసిరారు. గత మూడు రోజులుగా ఎక్కడ చూసినా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ నేతలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రఘునందన్ రావు ధ్వజమెత్తారు.

నాలుగున్నర దశాబ్దాలలో బీజేపీ బీసీలకు ఏం చేసిందో నేను చెబుతా. మరి బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో పీసీసీ చీఫ్, విప్ ఆది శ్రీనివాస్ చెబుతారా అని రఘునందన్ రావు సవాల్ విసిరారు. తాను గణాంకాలతో చర్చకు వస్తానని, ఎక్కడ రమ్మంటే అక్కడ వస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్గం మళ్ళీ ఏర్పాటు చేయాలని, బిసిలకు పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉంటే ముగ్గురికి మంత్రి పదవులు ఇవ్వడం కరెక్టేనా ఆది సీనన్నా అని ప్రశ్నించారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ 250 మందిని ముఖ్యమంత్రులను చేస్తే అందులో 43 మంది మాత్రమే ఓబీసీలు ఉన్నారని తెలిపారు. అదే బీజేపీ 68 మంది ముఖ్యమంత్రులను చేస్తే అందులో 21 మంది ఓబీసీలు ఉన్నారని పేర్కొన్నారు. అంటే, బీజేపీ 31 శాతం ఓబీసీలను సీఎంలుగా చేసింది, కాంగ్రెస్ పార్టీ 17 శాతం మందిని మాత్రమే సీఎం చేసిందని వివరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మణ్ ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నారని గుర్తు చేశారు. బీజేపీకి బండి సంజయ్ ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్‌డీఏ కూటమిలో 20 మంది ముఖ్యమంత్రులు ఉంటే ఐదుగురు ఓబీసీలు, ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు మైనార్టీలు ముఖ్యమంత్రులుగా ఉన్నారని తెలిపారు. మన్మోహన్ సింగ్ క్యాబినెట్‌లో కేవలం ఇద్దరు ఓబీసీలు మంత్రులుగా ఉంటే, మోడీ క్యాబినెట్‌లో 21 మంది ఓబీసీలు మంత్రులుగా ఉన్నారని గణాంకాలు చెప్పారు. దేశానికి రాష్ట్రపతిగా దళితులను, గిరిజనులను చేసిన ఘనత బీజేపీదని రఘునందన్ రావు అన్నారు. తెలంగాణకు రెండు కేంద్ర మంత్రి పదవులు ఇస్తే, అందులో ఒక బీసీకి మంత్రి పదవి ఇచ్చామని గుర్తుచేశారు. ఇకపోతే కేటీఆర్, ఎంపీ సీఎం రమేష్ ఎపిసోడ్ పై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. హెచ్‌సీయూ భూముల విషయంలో కేటీఆర్ బీజేపీ ఎంపీలపై బట్ట కాల్చి మీద వేశాడని మండిపడ్డారు. హెచ్‌సీయూ విషయంలో కేటీఆర్ మొదట కొండా విశ్వేశ్వర్ రెడ్డి, తనపై ఆరోపణలు చేశారని రఘునందన్ రావు గుర్తుచేశారు.

# ప్రయోగాత్మక విద్యను అందించాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ బ్యూరో, జులై 26 (జనంసాక్షి) :** జిల్లాలో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంపై దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం కడెం మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అకస్మాత్తుగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం, తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగది వంటి ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. సందర్శనలో భాగంగా కలెక్టర్ స్వయంగా ఏడవ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్రంలోని దర్పణాలు పాఠాన్ని బోధించి, పటాలు గీయించారు. విద్యార్థుల దగ్గరుండి జవాబులు తెలుసుకున్నారు. తద్వారా సృజనాత్మకత పెరిగేందుకు ప్రయోగాత్మక విద్య ఎంతో అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతిరోజూ అన్ని తరగతుల్లో కనీసం 15 నిమిషాల పాటు చదవడం నేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే, కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు, యూనిఫార్ములు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ సిలబస్ ప్రగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోర్డు పరీక్షలకు లక్ష్యంగా ఇప్పటి నుంచే చదువులకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, ఇతర వసతులపై విద్యార్థులే స్పందించేలా ప్రశ్నలు అడిగారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ఈ తనిఖీలో ఎంపీడీవో అరుణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# న్యాయం కోసం మృతదేహంతో రోడ్డెక్కిన కుటుంబం

- కూతురు మరణానికి కారకుడిని కఠినంగా శిక్షించాలని తల్లి డిమాండ్
- అటు భర్తను, ఇటు కూతురును కోల్పోయిన ఓ తల్లి ఆవేదన




**రామకృష్ణాపూర్, జులై 26(జనంసాక్షి):** తన కూతురు మరణంతో న్యాయం చేయాలని ఓ తల్లి కుటుంబంతో సహా రోడ్డెక్కింది. వివరాల్లోకి వెళ్లితే ఇటీవల రామకృష్ణాపూర్ పట్టణం శివాజీ నగర్ చెందిన సింగరేణి ఎస్ అండ్ పిసి ఉద్యోగి గాండ్ల సత్యం తన కూతురు ముద్దసాని లావణ్య తో సహా ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుండి రామకృష్ణాపూర్ కి వస్తుండగా, పెద్దపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాండ్ల సత్యం అక్కడికక్కడే మరణించగా శుక్రవారం తన కూతురు ముద్దసాని లావణ్య కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. లావణ్యకు ఇదే పట్టణానికి చెందిన ముద్దసాని సురేష్ తో సుమారు నాలుగు సంవత్సరాల క్రితం వివాహం జరగగా కుటుంబ కలహాలతో గత కొంత కాలంగా స్థానిక శివాజీ నగర్ లోని తల్లితండ్రుల ఇంటి వద్దనే ఉంటుంది. భర్త ప్రవర్తన సరిగా లేకపోవడంతో కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకోగా, అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో లావణ్య మృతి చెందగా తల్లి లక్ష్మి సహా కుటుంబ సభ్యులతో మృత దేహాన్ని లావణ్య భర్త ఇంటికి తీసుకొచ్చి ఆందోళన చేసే ప్రయత్నంలో సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద అడ్డుకోగా, కొంత ఉద్రిక్తత నెలకొంది. తన కూతురును అదనపు కట్నం కోసం అల్లుడి తో సహా కుటుంబ సభ్యులు మానసికంగా వేధించే వారని, కోర్టు వ్యవహారాల విషయంలో పెద్దపల్లి కి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదంలో భర్తతో పాటు కూతురును పోగొట్టుకున్నానని తల్లడిల్లింది. కూతురును మానసిక వేదనకు కారకుడైన ముద్దసాని సురేష్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. అలాగే వివాహ సమయంలో యాభై లక్షల రూపాయల కట్నంతో పాటు ముప్పై తులాలా బంగారం ముట్ట చెప్పామని తన కూతురు మరణానానికి నష్ట పరిహారంగా కోటి రూపాయలు ఇవ్వాలని తల్లి డిమాండ్ చేయగా పెద్ద మనుషుల జోక్యంతో ఇరవై లక్షల రూపాయలు మృతురాలు తల్లికి ఇస్తామని లావణ్య భర్త, కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో తిరిగి లావణ్య మృత దేహాన్ని వారి స్వగ్రామమైన ఓదెలకు దహన సంస్కారాలకు తీసుకెళ్ళారు. మృత దేహంతో ఎలాంటి ఆందోళనలు జరగకుండా మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి పర్యవేక్షణలో, రామకృష్ణాపూర్, మందమర్రి ఎస్సై రాజశేఖర్ లు పహారా నిర్వహించారు.

# కక్షసాధింపులో భాగంగానే రోడ్ల రద్దు

- పార్టీలకు అతీతంగా ప్రజలు పోరాడాలి
- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



నల్లబెల్లి, జులై 26 (జనంసాక్షి): కక్ష సాధింపు చర్యలో బాగాగానే నియోజకవర్గంలో మంజూరైన రోడ్ల ను రద్దు చేయాలని ప్రస్తుత ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చూస్తున్నాడాని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి కెసిఆర్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి తండాకు బీటి రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఎస్టి ఎస్టిఎఫ్ జీవో నెంబర్ 242, 260 ద్వారా 53 కోట్ల నిధులతో 74 తండాలకు 37 రోడ్లను మంజూరు చేయించానని తెలిపారు. అట్టి రోడ్లను మాధవరెడ్డి తన సొంత లాభం కోసం రద్దుచేసి గిరిజన ప్రజలకు అన్యాయం చేస్తున్నాడని అన్నారు. పార్టీలకతీతంగా ప్రజలందరూ కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకొచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న నియోజకవర్గానికి తెచ్చిన నిధులు ఎన్నో చెప్పాలని ప్రశ్నించారు. తెచ్చిన నిధుల కన్నా రద్దు చేసిన నిధుల ఎక్కువ తెలిపారు. టెండర్లు పూర్తిచేసుకుని పురోగతిలో ఉన్న పనులను కూడా రద్దు చేయాలని లిఖితపూర్వకంగా రాసిస్తూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నాడని తెలిపారు. తన సొంత ఏజెన్సీ పేరు మీద రోడ్లను మార్చుకొని నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా రోడ్ల నిర్మాణాలను చేపడుతున్నారని ఆరోపించారు. మండలానికి తీసుకొచ్చిన అభివృద్ధి పనులను యధావిధిగా కొనసాగించకపోతే ప్రజలతో కలిసి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పిఎసిఎస్ చైర్మన్ చెట్టుపెల్లి మురళీధర్ రావు, మాజీ ఎంపీప కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు ఊడుగుల ప్రవీణ్ గౌడ్,మండల నాయకులు రాజారాం, గందే శ్రీనివాస గుప్తా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# థాయిలాండ్-కాంబోడియా సరిహద్దు ఘర్షణ




దక్షిణాసియాలో శాంతి,సమృద్ధి యొక్క ఆశలను మబ్బులు కమ్ముకుంటున్నాయి. థాయిలాండ్- కాంబోడియాల మధ్య సరిహద్దు వివాదం 2025 జులైలో హఠాత్తుగా ఒక హింసాత్మక ఘర్షణగా మారింది. ఇది అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేసింది. ఈ యుద్ధం యొక్క మూలాలు శతాబ్దాల నాటి చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ అంశాలలో లోతుగా దాగి ఉన్నాయి. ముఖ్యంగా "ప్రీహ్ విహార్" ఆలయం చుట్టూ ఉన్న ప్రాదేశిక వివాదం ఈ ఘర్షణకు మూల కేంద్ర బిందువుగా నిలిచింది. థాయిలాండ్, కాంబోడియా మధ్య వివాదం యొక్క మూలాలు "వలసవాద" యుగంలోని సరిహద్దు నిర్ణయాలలో ఉన్నాయి. 19వ శతాబ్దంలో ఫ్రెంచ్ వలసవాద పాలకులు కాంబోడియాను తమ ఆధీనంలోకి తీసుకున్నప్పుడు, థాయిలాండ్ (అప్పటి సియామ్)తో సరిహద్దు గీతలు అస్పష్టంగా నిర్ణయించారు. 508 మైళ్ల సరిహద్దు రేఖలోని పలు భాగాలు, ముఖ్యంగా ప్రీహ్ విహార్ ఆలయం చుట్టూ ఉన్న 4.6 చదరపు కిలోమీటర్ల ప్రాంతం, ఈ రెండు దేశాల మధ్య వివాదాస్పదంగా మిగిలిపోయింది. 11వ శతాబ్దంలో" ఖైమర్"రాజు" సూర్యవర్మన్" నిర్మించిన ఈ శివాలయం కాంబోడియాలోని "ప్రీహ్ విహార్ ప్రావిన్స్" మరియు థాయిలాండ్‌లోని" సిసాకెట్ ప్రావిన్స్" సరిహద్దులో ఉంది. 1962లో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) ఈ ఆలయం కాంబోడియా ఆధీనంలో ఉందని తీర్పునిచ్చినప్పటికీ, ఆలయం చుట్టూ ఉన్న భూమి యొక్క యాజమాన్యం గురించి స్పష్టత లేకపోవడం వల్ల ఈ వివాదం కొనసాగుతూ వచ్చింది. ఈ తీర్పును థాయిలాండ్ అంగీకరించినప్పటికీ, స్థానిక జాతీయవాద భావాలు, రాజకీయ ఒత్తిళ్ల ఈ విషయాన్ని పదేపదే తెరపైకి తీసుకువస్తున్నాయి. ఈ చారిత్రక అసంతృప్తి, సాంస్కృతిక వారసత్వంపై జాతీయవాద పోటీతో కలిసి, ఈ ఘర్షణకు పునాదిగా నిలిచింది.

**ఇటీవలి ఘర్షణ యొక్క తక్షణ కారణాలు:**
2025 మే నెలలో ఈ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఒక చిన్న ఘర్షణ, ఒక కాంబోడియా సైనికుడి మరణంతో ముగిసింది. ఇది రెండు దేశాలలో జాతీయవాద భావాలను రెచ్చగొట్టింది. ఈ సంఘటన తర్వాత, రెండు దేశాలు తమ సైనిక బలగాలను సరిహద్దులో మోహరించాయి. జులై 24, 2025 నాటికి, ఈ ఉద్రిక్తతలు హింసాత్మక సంఘర్షణలు గా మారాయి. ఇందులో డ్రోన్లు, రాకెట్లు, ఫిరంగులు, అలాగే థాయిలాండ్ యొక్క ఎఫ్-16 యుద్ధ విమానాలను ఉపయోగించాయి. ఈ దాడుల్లో కనీసం 11 నుండి 16 మంది మరణించినట్లు నివేదికలు తెలిపాయి. ఎక్కువగా థాయిలాండ్ పౌరులు, సైనికులు మరణించారు. ఇంకా కాంబోడియా హతమైన వారి వివరాలను ఆ ప్రభుత్వం ఇంకా ధృవీకరించలేదు. ఈ ఘర్షణలకు ల్యాండ్‌మైన్ ల వినియోగం గురించిన ఆరోపణలు మరింత రెచ్చగొట్టాయి. దశాబ్దాల నాటి అంతర్యుద్ధం నుండి మిగిలిపోయిన లక్షలాది ల్యాండ్‌మైన్ లు ఈ ప్రాంతంలో ఇప్పటికీ ముప్పుగా ఉన్నాయి.దీనికి తోడు కొత్త గనుల మోహరింపు ఆరోపణలు పరిస్థితిని మరింత జటిలం చేశాయి.


**సాంస్కృతిక - రాజకీయ గతిశీలత (డైనమిక్స్) :**
ఈ ఘర్షణ కేవలం భూమి వివాదం మాత్రమే కాదు. ఇది రెండు దేశాల మధ్య ఉమ్మడి సాంస్కృతిక వారసత్వం, జాతీయవాద పోటీ కూడా కారణంగా కనపడుతున్నాయి. ప్రీహ్ విహార్ ఆలయం, ఖైమర్ సామ్రాజ్యం యొక్క గొప్పతనాన్ని సూచిస్తుంది. ఇది కాంబోడియన్లకు జాతీయ గర్వానికి చిహ్నంగా ఉంటూ వచ్చింది. అదే సమయంలో, థాయిలాండ్ ఈ ఆలయం తమ సరిహద్దు ప్రాంతంలో ఉందని, ఖైమర్ రాజుల పరిపాలనలో భాగంగా తమకు ఈ ఆలయం ప్రాంగణంలో హక్కు ఉందని వాదిస్తుంది. ఈ సాంస్కృతిక యాజమాన్యం గురించిన పరస్పర వాద, వివాదాలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో తీవ్రమైన జాతీయవాద చర్చలకు దారితీశాయి. ఇరు ప్రాంతాల ప్రజల్లో భావోద్వేగాలు పెంచాయి.అది క్రమంగా సాయుధ ఘర్షణలకు దారితీసింది. క్రమంగా ఈ వివాదం రాజకీయ ఘర్షణ కు రెండు దేశాల లోని దేశీయ రాజకీయ ఒత్తిళ్లతో ముడిపడి ఉంది. థాయిలాండ్ లో, జాతీయవాద భావనలు రాజకీయ నాయకులకు ప్రజల మద్దతును సమీకరించడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతున్నాయి. కాంబోడియా లో, ప్రభుత్వం ఈ వివాదాన్ని దేశీయ సమస్యల నుండి దృష్టిని మళ్లించడానికి ఉపయోగిస్తుంది నే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ రెండు దేశాలలోని ప్రభుత్వాలు ఇంకా అధికారికంగా యుద్ధాన్ని ప్రకటించనప్పటి కీ, సైనిక చర్యలు, అక్కడక్కడా చెదురుమదురుగా కాల్పులు, దౌత్యపరమైన విరామాలు ఈ ఘర్షణ యొక్క తీవ్రతను పెంచాయి.

**యుద్ధం యొక్క పరిణామాలు:**
ఈ ఘర్షణ యొక్క తక్షణ పరిణామాలు ఇప్పటికే ఆందోళనకరంగా ఉన్నాయి. థాయిలాండ్ తమ రాయబారిని కాంబోడియా నుండి వెనక్కి పిలిచింది.అలాగే కాంబోడియా రాయబారిని దేశం నుండి బహిష్కరించింది. రెండు దేశాల మధ్య సరిహద్దు క్రాసింగ్‌లు మూసివేశారు. ఇది వాణిజ్యం,ఇతర ప్రయాణ సౌకర్యాలపై తీవ్ర ప్రభావం చూపింది. సరిహద్దు ప్రాంతాలలో నివసించే పౌరులు విపరీతమైన భయాందోళనలో ఉన్నారు. ఎందుకంటే ... ఈ దాడుల్లో ఎక్కువగా పౌరులే హతమయ్యారు. 28 మంది గాయపడినట్లు ప్రస్తుత నివేదికలు తెలిపాయి. పూర్తి సమాచారం అందితే ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.
అంతర్జాతీయ సమాజం ఈ ఘర్షణను శాంతియుతంగా పరిష్కరించాలని పిలుపునిచ్చింది. చైనా సమస్యను స్నేహపూర్వక సంభాషణ ద్వారా పరిష్కరించమని రెండు దేశాలను కోరింది, అయితే థాయిలాండ్ అంతర్జాతీయ మధ్యవర్తిత్వాన్ని తిరస్కరించింది. ఐక్యరాజ్యసమితి శాంతి ప్రయత్నాలు ఇంకా ఫలప్రదం కాలేదు, ఈ ప్రాంతంలో సైనిక బలగాల పెంపు కొనసాగుతోంది.
దీర్ఘకాలంలో, ఈ ఘర్షణ దక్షిణాసియా ప్రాంతంలో స్థిరత్వాన్ని దెబ్బతీసే అవకాశం ఉంది. ఆర్థికంగా, సరిహద్దు మూసివేతలు వాణిజ్యాన్ని అడ్డుకున్నాయి. ఈ రెండు దేశాలు కూడా పర్యాటక ఆదాయంపై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. ఈ సాయుధ ఘర్షణల మూలంగా రెండు దేశాలలో ఆదాయం తీవ్రంగా దెబ్బతింటుంది. మానవీయంగా, ఈ సంఘర్షణ ల్యాండ్‌మైన్‌ల వల్ల ఇప్పటికే అధిక రిస్క్‌లో ఉన్న పౌరుల జీవనాన్ని మరింత దిగజార్చవచ్చు. అంతేకాకుండా, ఈ ఘర్షణ యొక్క తీవ్రత పెరిగితే, ఇది ఆసియా ప్రాంతీయ సహకారాన్ని బలహీనపరచవచ్చు. ఇది ఈ ప్రాంతంలో శాంతి కోసం అలాగే ఆర్థిక సమీకరణకు కీలకమైనది.
చివరిగా....థాయిలాండ్ - కాంబోడియా మధ్య ఘర్షణ ఒక చారిత్రక వివాదం యొక్క ఆధునిక రూపంగా మరోసారి తలెత్తింది. ఇది జాతీయవాదం, రాజకీయ ఒత్తిళ్ల వల్ల మరింత తీవ్రమైంది. ప్రీహ్ విహార్ ఆలయం చుట్టూ ఉన్న సరిహద్దు వివాదం ఈ ఘర్షణకు కేంద్ర బిందువుగా నిలిచినప్పటికీ, దీని వెనుక ఉన్న సాంస్కృతిక, చారిత్రక, రాజకీయ అంశాలు ఈ సమస్యను మరింత సంక్లిష్టం చేశాయి. ఈ ఘర్షణ యొక్క తక్షణ పరిణామాలను చూస్తే మానవ నష్టం, దౌత్యపరమైన విరామం, సరిహద్దు మూసివేత ఇప్పటికే ఆందోళనకరంగా ఉన్నాయి. దీర్ఘకాలంలో ఈ ప్రాంతంలో స్థిరత్వంతో పాటు ఆర్థికాభివృద్ధి కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడానికి రెండు దేశాలు సంభాషణలను త్వరగా ప్రారంభించి దౌత్యపరమైన మార్గాలను అనుసరించాలి. అంతర్జాతీయ సమాజం, ముఖ్యంగా ఆసియా తీరంలోని సభ్య దేశాలు కూడా, ఈ ఘర్షణను శాంతియుతంగా పరిష్కరించడానికి సహకరించాలి. చరిత్ర నుండి గుణపాఠాలు నేర్చుకుని, ఈ రెండు దేశాలు సాయుధ ఘర్షణలను వదిలేసి తమ ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టుకోవాలి. ఘర్షణలకు తావులేని, శాంతి, సహకారానికి పునాదిగా మార్చుకోవాలి.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# హక్కులకై ఉద్యమిస్తే... హత్యాకాండే మిగులుతుంది



6 నెలల మంగ్లీ సోడితో మొదలైన కగార్ హత్యాకాండ మారెడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి, అరుణ, అంజులను చంపే వరకు కొనసాగింది. చరిత్రలోకి వెళితే ఇప్పటికి 18 నెలలుగా 57 ఎన్‌కౌంటర్లు జరిగాయి. మారెడుమిల్లి ఎన్‌కౌంటర్ జరగడానికి ముందు వారం రోజులుగా వాళ్ళు ఉన్న స్థలాన్ని వాళ్ళని బంధీలుగా చేసుకొని ప్రభుత్వం సరెండర్ ప్రక్రియ కోసం తీవ్రమైన ప్రయత్నాలు చేసింది. వీళు ళ్ళ ముగ్గురిని చంపక ముందే అరుణ, గాజర్ల రవి కుటుంబ సభ్యులను కలిసి మీ వాళ్ళు ఎక్కడ ఉన్నారో మాకు తెలుసు మిమ్మల్ని తీసుకెళ్తాం వాళ్లని సరెండర్ చేయించాలని ఒత్తిడి తీసుకువచ్చారు. కానీ ఏ కుటుంబమూ సహకరించని నేపథ్యం లో నిర్దాక్షిణ్యంగా చంపేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించడం జరిగింది. కగార్ హత్యాకాండలన్ని బూటకం అని చెప్పడానికి ఇంత కన్నా సజీవ సాక్ష్యం మరొకటి అవసరం లేదు. 1973లో పౌరహక్కుల సంఘం ఆవిర్భావానికి ఎలాగైతే నక్సల్బరీ ఉద్యమంపై జరిగిన హత్యాకాండ దోహదపడిందో ఆనాటి నుండి ఈనాటి వరకు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పౌరహక్కుల సంఘం న్యాయస్థాన పోరాటం ప్రజాపోరాటాల్లో ఉండి ప్రజలతో మమేకమవుతూ ఎన్‌కౌంటర్ అంటేనే ప్రభుత్వ హత్య అనే సత్యాన్ని ప్రజలందరికి అర్థం చేయించింది. ఇప్పుడు ఆదివాసీ చట్టాలు 1996 పేసా చట్టం 2006 అటవీ హక్కుల చట్టం అమలు కాని నేపథ్యంలో కొనసాగిన ఆదివాసీ ఉద్యమాలపై కొనసాగుతున్న నిర్బంధమే రెండున్నర దశాబ్దాల తరువాత ఆపరేషన్ కగార్ రూపాన్ని తీసుకుంది. మధ్యభారతంలో ఆదివాసీలను అమానవీయంగా వేటాడుతూ హత్య చేస్తూ కార్పొరేట్ల అభివృద్ధినే దేశ అభివృద్ధిగా ప్రకటించే దీనస్థితికి భారత ప్రభుత్వం దిగజారిపోయింది. దీనికి వ్యతిరేకంగా ప్రజాసంఘాలు, ప్రజాస్వామిక వాదులు గొంతెత్తి ప్రభుత్వం నుండి చట్టబద్ధ పాలన కోసం బలమైన ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉంది. ఉద్యమాలు లేకపోతే చట్టబద్ధ పాలన పూర్తిగా కరువైపోయి పూర్తిగా నియంతృత్వంలోకి దేశ ప్రజాస్వామ్యం వెళ్ళిపోతుంది. దీన్ని నిలువరించడానికైనా ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా బలమైన ప్రజాస్వామిక ఉద్యమాన్ని నిర్మించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉన్నది.

నేడు రాష్ట్రంలో, దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా ఆదివాసుల అస్థిత్వపు అంచులో కొట్టుమిట్టడుతున్నారు. తరతరాలుగా దట్టమైన అడవులు, కొండలతో, జంతువులతో గడిపే ఆదివాసీల సాంస్కృతిక జీవన వ్యవస్థ వారసత్వం ధ్వంసం చేయబడుతున్నది. వారి స్వయంపాలన, స్వయం నిర్ణయ హక్కు హరించబడటమే గాక సామ్రాజ్యవాద ముసుగులో జరిగే విధ్వంసకర అభివృద్ధిలో దుర్భరమైన జీవనాన్ని గడుపుతున్నారు. ఆదివాసీల జీవించే హక్కు నిరంతరాయంగా వేటాడబడుతున్నది. రాజ్యాంగం పేర్కొన్న ప్రాథమిక హక్కుగా ఉన్నటువంటి జీవించే హక్కు కూడా జరుగుతున్న ఆపరేషన్ కగార్‌లో పూర్తిగా అణచివేతకు గురవుతున్నది. ఈ నేపథ్యంలో ఆదివాసీల సాంప్రదాయక పోరాటాలను గుర్తించిన "ఐక్యరాజ్య సమితి" ఆదివాసీల వారసత్వపు హక్కులు, అటవీ వనరులు, హక్కులు తదితర సమస్యలపై 1982 ఆగస్టు 9న జెనివాలో 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూపుల సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కమిటీ 1993 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యాయనం చేసి, 1994 నుండి 2014 వరకు ఆదివాసీల అభివృద్ధి కాలంగా ప్రకటించి, ఆగస్టు - 9న ఆదివాసీల తెగల దినోత్సవంగా ప్రకటించింది. ఐక్యరాజ్య సమితి అంచనా ప్రకారం ప్రపంచంలో 100 దేశాలలో 5 వేల తెగలకు చెందిన 50 కోట్ల ఆదివాసీలు 6700 భాషలను మాట్లాడుతున్నారు. మన దేశంలో 461 ఆదివాసీల తెగలుండగా 92% మంది ఆదివాసీలు నేటికీ అడవి పైనే ఆధారపడి జీవిస్తున్నారు. దేశంలో 'అభివృద్ధి', 'వృద్ధిరేటు పెరుగుదల' పేరిట భూసేకరణ విచ్చల విడిగా జరుగుతున్నది. ఇందుకు పంట పొలాలు, సాగుకు అనుకూలమైన భూములంటూ మినహాయింపు ఏమీ లేదు. 'అభివృద్ధి', 'వృద్ధిరేటు పెరుగుదల' తదితర పేర్లతో సెజ్లు, కారిడార్లు, ఇతర రవాణా మార్గాలు, భారీ ప్రాజెక్టులు, వనసంరక్షణ పార్కుల నిర్మాణాలు, రిజర్వ్ ఫారెస్టు, పర్యావరణ పరిరక్షణ, హరిత హారం, అభయారణ్యాలు మొదలైన వాటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా, అందులో భాగంగానే భూ సేకరణ జరుపు తున్నట్లుగా ప్రభుత్వాలు చెబుతూ వస్తున్నాయి. అభివృద్ధి జరగాలంటే ప్రజలు కొంత ఇబ్బందులను ఎదుర్కొనక తప్పదని చెబుతున్నాయి. వాస్తవాచరణలో ఇవన్నీ ప్రజా వ్యతిరేక చర్యలే. ప్రధానంగా ఆదివాసుల జీవన విధ్వంస చర్యలేనన్నది గుర్తించాలి.

బ్రిటిష్ వలస పాలనకు పూర్వం భారత సమాజంలోని ఆదివాసుల ప్రాంతాలలో అక్కడ వారికే (ఆదివాసులు, గిరిజన తెగలకు) సర్వ హక్కులు ఉండేవి. వలస పాలకుల తమ ఆర్థిక, రాజకీయ, పాలన ప్రయోజనాల దృష్ట్యా ఆదివాసులు అప్పటి వరకు కలిగి ఉండి అనుభవిస్తూ వచ్చిన సర్వ హక్కులను వలస పాలకులు రద్దు చేశారు. అప్పటి వరకు తమకు తామే రాజులుగా పాలనాధికారం కలిగి స్వేచ్ఛగా ఉండే ఆదివాసుల తెగలను బ్రిటిష్ పాలకులు ప్రభుత్వ పాలన పేరిట చట్టాల పరిధిలోకి తెచ్చారు. చట్టాల చట్రంలో వారిని బందీలను చేయడం ద్వారా బ్రిటిష్ వలస పాలకులు తమ పాలనా వ్యవహారాలను, అడవులపైన, అటవీ ఉత్పత్తులపైన అధికారాలను సులభంగా చలాయించవచ్చునని భావించి, తలపెట్టిన ఆ ప్రక్రియకు ఆనాడు దేశంలోని స్థానిక కులాధారిత భూస్వామ్య వ్యవస్థ ఆధిపత్య శక్తులు, సంస్థానాధీశులు పూర్తిగా సహకారాన్ని అందించారు. వారి



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం

## కలల్లో ఉండి పోకలా..!

కలల్లో ఊరేగిపోకు -
అవి నిన్ను
ఆకాశం వైపు లాగుతాయి,
కానీ నేల నుంచి
జారగొట్టి పడేస్తాయి.

చూడుచి
నిన్ను మేలుకొలుపుతున్న గాలి కూడా
కలల మబ్బుల్లో
ముంచేయగలదు.

మెలకువగా ఉండు ఉ
నీ కళ్ళు తెరిచి ఉంచు,
కలలు కన్నా ముందుగా
నడిచే నేలని గుర్తించు.

అప్పుడు మాత్రమే
నీ కలలు
నిన్ను గాయపరచవుచి
నిన్ను గెలిపిస్తాయి.

-బాలాజీ పోతుల
8179283830



## నాయకుడు!


గతం గతః
తెలుసుకో-కాని
భవిష్యత్ నిర్మించు!
గతాన్ని తవ్వి
సోదరబంధాలను
ఉద్రిక్త పరచకు!
మానవులంతా
సమానమని
చెప్పటం గొప్ప!
కులమతాలతో
ఉద్రేకాలను
రెచ్చగొట్టటం
ముప్పు!

చరిత్ర మార్చకు
కొత్త చరిత్రను
ప్రేమతోసృష్టించు!
హింస ద్వేషం కాదు
అహింసను ప్రేమను
అందరికి అందించు!
దండయాత్రల
ప్రత్యక్షవలసల
కాలం కాదిది!

ఇది సైన్స్ కాలం
సమాజ వృద్ధికి
సైన్స్‌ను వాడు!
వ్యక్తి లాభం కాదు
సమాజ లాభం
పెంపొందించు!
ఉద్రిక్తతలు లేని
సమాజమే
ఆరోగ్య సమాజం!
ప్రపంచాన్ని
ప్రశాంతంగాఉంచు!
వాడు నాయకుడు!

తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# సంఘ సంస్కర్త, సామాజిక విప్లవకారుడు యుగకర్త డా॥ కత్తి పద్మారావు



మహాకవి డా॥ కత్తి పద్మారావు తొలిదశలో హేతువాది. కుల నిర్మూలన వారి జీవిత లక్ష్యం. హేతువాదులు వందేళ్ళుగా కుల నిర్మూలన గురించి, కుల వివక్ష గురించి పట్టించుకోలేదు. పైగా 1985లో ముందుకు వచ్చిన దళిత ఉద్యమాన్ని వ్యతిరేకించారు. హేతువాదంలో భాగంగా కుల నిర్మూలన ఎంత ఆవశ్యకమో డా॥ బి.ఆర్. అంబేద్కర్, పెరియార్ రామస్వామి నాయకర్, కత్తి పద్మారావు అనేక సిద్ధాంత చర్చలు చేశారు. 1985 జులై 17న కారంచేడులో మాదిగలపై కమ్మవారి దౌర్జన్యం, హత్యాకాండకు వ్యతిరేకంగా రాష్ట్రమంతటా పెద్ద ఎత్తున ఆందోళన ప్రారంభమైంది. అది ఒక ఉద్యమంగా రూపిదిద్దుకున్నది. దళిత మహాసభ ఏర్పడింది. దళిత మహాసభ కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కత్తి పద్మారావు మలుపు తీసుకున్నారు. చార్వాకం నుండి బౌద్ధం వైపు మలుపు తిరిగిన అవగాహన ఇక అప్పటినుండి చార్వాకం, హేతువాదం నుండి మలుపు తిరిగి బౌద్ధం మానవతావాదం, స్త్రీవాదం అన్నీ దళితవాదంలో భాగంగా సంశ్లేషించి, విశ్లేషించి వందల, వేల ప్రసంగాలు, వ్యాసాలు వెలువరిస్తు న్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కుల వ్యవస్థ భారత దేశ సామాజిక వ్యవస్థ లో మౌలిక అంశమని, సమానత్వం సాధించాలంటే, సమస మాజం రావాలంటే, మొట్టమొదట కుల వివక్ష, కుల అణచివేత, కుల అంతరాలు తొలిగిపోవాలని ప్రబోధిస్తూ, విశ్లేషిస్తూ వస్తున్నారు. 90 దాకా విభిన్న రంగాల గురించిన గ్రంథాలను వెలువరించారు. నాలుగు దశాబ్దాల్లో డా॥ కత్తి పద్మారావు జాతీయ స్థాయిలో ఒక లెజెండ్‌గా, మార్గదర్శిగా, యుగకర్తగా, మహాకవిగా ఎదుగుతూ వచ్చారు. కోట్లాది ప్రజలకు స్ఫూర్తినిచ్చారు. వేలాది కార్యకర్తలకు, విద్యావంతులకు, బుద్ధి జీవులకు, సాహితీవేత్తలకు, మార్గదర్శనం చేశారు. రాష్ట్రంలో తెలుగు సాహిత్యంలో, సామాజిక ఉద్యమాల్లో ట్రెండ్ సెట్టర్‌గా ఒక ఐకాన్‌గా నిలిచిపోయారు.

27 జులై 1953లో జన్మించిన కత్తి పద్మారావుగారికి ఇప్పుడు 72 ఏండ్లు. జీవితంలో, ఉద్యమాల్లో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. శత్రు భయంకర తీవ్రవాద దళితవాదం నుండి క్రమంగా బుద్దిస్ట్ శాంతియుత పరివర్తన శత్రువును కూడా ఒప్పించి, మెప్పించే తాత్విక సంపదను, సామాజిక విశ్లేషణను అందిస్తూ, భారతీయ చరిత్ర మూలాలను, తాత్విక మూలాలను, చరిత్ర పరిణామాన్ని విశ్లేషిస్తూ, వామపక్ష చరిత్రకారులకు, సాహితీవేత్తలకు, సిద్ధాంత కర్తలకు కండ్లు తెరిపించారు. మార్గదర్శనం చేశారు. అంతదాకా వర్గదృక్పథంతో, ధనిక, బేద వ్యత్యాసాలు తొలగిస్తే కులం పోతుంది అని వాదించేవాళ్ళకు కనువిప్పు కలిగించారు. పెట్టుబడిదారి సమాజం పోయి, మరో సమాజం వచ్చినా, పురుషాధిపత్యం, పితృస్వామిక వ్యవస్థ, అందుకు పునాదిగా కొనసాగుతున్న కుల వ్యవస్థ, కుల వివక్ష పోదని, మహాత్మా జ్యోతిబా ఫూలే, నారాయణగురు, పెరియార్ రామస్వామి నాయకర్, కబీర్‌దాస్, గురు రవిదాస్ వేసిన మార్గంలో ముందుకు సాగి కత్తి పద్మారావు సమాజాన్ని మలుపు తిప్పారు. ఇప్పుడు అన్ని ఉద్యమాలు, పార్టీలు, అన్నిరకాల సాహిత్య సంఘాలవాళ్ళు స్త్రీ, పురుష సమానత్వాన్ని, అన్ని కులాలు సమానమే అని, అందుకు ప్రత్యేకంగా అసమానతల నిర్మూలన కోసం కృషి చేయాలని, తమ కార్యక్రమాలను విస్తృతం చేసుకున్నారు.

**దశాబ్దాలుగా నాయకత్వం వహించి**
అలా రాష్ట్రంలో దళిత మహాసభ, కత్తి పద్మారావు సంఘసంస్కరణను, సామాజిక విప్లవాన్ని ముందుకు తెచ్చారు. నాయకత్వం వహించారు. అందులో భాగంగా ఆయన జన్మదినాన్ని కుల నిర్మూలన దినోత్సవంగా ప్రకటించి ప్రతియేటా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ క్రమంలో 1984లో దేశ వ్యాప్తంగా ప్రారంభమైన కాన్షీరామ్ బహుజన సమాజ్‌వాది పార్టీ, బామ్సెఫ్ ఉద్యమం, 1988-89లో రాష్ట్రంలో పెద్ద ఎత్తున సంచలనం సృష్టించింది. ఒకవైపు రాజకీయాలు, బిఎస్పీ చేస్తున్న సైద్ధాంతిక పోరాటం, మరోవైపు దళిత ఉద్యమం రెండూ కలిసి సామాజిక, రాజకీయ చైతన్యంగా మలుపు తిరిగాయి. కారంచేడు ఉద్యమ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ అట్రాసిటీ నిరోధక చట్టం తీసుకువచ్చింది. అంటరానివారిగా ఎవరిని కించపరిచినా, సంబోధించినా నాన్‌బెయిలబుల్ అరెస్ట్ వారెంట్‌తో డైరెక్టుగా జైలుకే పంపిస్తారు. రాష్ట్రపతిని కలవడా నికి దేశంలోని ఎస్సీ పార్లమెంటు సభ్యులు అన్నీ పార్టీలవాళ్ళు కలిసి బయలుదేరారు. రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ కలవడానికి నిరాకరించారు. అప్పుడు దళితుడే రాష్ట్రపతి కావాలి. అనే నినాదం ఇవ్వడం జరిగింది. అలా కె.ఆర్. నారాయణ్ రాష్ట్రపతిగా ఎన్నుకోవడం జరిగింది. ఇలా సామాజిక, రాజకీయ రంగాల్లో పెనుమార్పులకు కత్తి పద్మారావు, దళితమహాసభ కృషి కారణమైంది.

**సాహిత్యంలో పెను మార్పులు**
సాహిత్య రంగంలో, తాత్విక రంగంలో దళిత మహాసభలు, బహుజన సమాజ్‌వాది పార్టీ తెచ్చిన చైతన్యం ఇంతా అంతా కాదు. అదే సమయంలో వామపక్ష పార్టీల్లో 1985 నుండి కుల సమస్యపై చర్చలు కొనసాగుతూ వస్తున్నాయి. కారంచేడు ఉద్యమం ఈ చర్చలను వేగవంతం చేసింది. దాంతో ఆయా వామపక్ష కమ్యూనిస్టు, నక్సలైట్ ఉద్యమాల్లో పొలరైజేషన్ పెరిగింది. వర్గ దృక్పథం ఒక్కటే చాలదు. ఫెమినిస్టు దృక్పథం, దళిత బహుజన దృక్పథం కూడా అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్ళాలి అనేవాళ్ళు తీవ్రమైన చర్చలు చేశారు. అట్లా కంచ ఐలయ్య, ఉ. సాంబశివరావు, కె.జి. సత్యమూర్తి, గద్దర్, బి.ఎస్. రాములు, మాస్టార్జీ, వి.జి.ఆర్. నారగోని, గూడ అంజయ్య ఉషా. ఎస్. డానీ అనేక చర్చలు చేశారు. 1989 నాటికి అన్ని ఉద్యమాల్లో రెండు శిబిరాలుగా, వర్గాలుగా చీలిపోయారు. అలా దళిత మహాసభ, బహుజన సమాజ్‌వాది పార్టీ ఉద్యమాల నేపథ్యంలో వందల, వేల రచయితలు, కళాకారులు, విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు మేల్కొన్నారు. 1990 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. వామపక్ష నక్సలైట్ల ఉద్యమాల్లోని లోపాలను అవగాహన రాహిత్యాన్ని, ఆధిపత్య కులాల అధికారాన్ని ప్రశ్నించారు. రచయితలారా, కళాకారులారా మీరు ఎటువైపు అని ప్రశ్నించి 1991 నుండి ఉట్నూరులో, 1982 డిసెంబర్ 6వ తేదీన కరీంనగర్‌లో పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించారు. 1993 ఫిబ్రవరి రెండవ వారంలో హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్ కింద గల అంబేద్కర్ భవన్‌లో దళిత రచయితల, కళాకారుల, మేధావుల ఐక్యవేదిక రాష్ట్ర మహాసభలు 2000 మందితో విజయవంతమయ్యాయి. ఇది దళిత బహుజన ఉద్యమాల్లో సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప మలుపు. దీనికి వ్యవస్థాపక అధ్యక్షులుగా బి.ఎస్. రాములు, ప్రధాన కార్యదర్శిగా మాస్టార్జీ, కార్యదర్శిగా నారగోని, ఉపాధ్యక్షులుగా ఇంగిలాల, గూడ అంజయ్య తదితరులతో ఉద్యమ నిర్మాణం విస్తృతంగా ముందుకు సాగింది. 230 గ్రంథాలు వెలువడ్డాయి. అఖిలభారత స్థాయిలో సదస్సులు నిర్వహించారు. ఇలా కత్తి పద్మారావు, బొజ్జా తారకం, కాన్షీరామ్, కె.జి. సత్యమూర్తి, గద్దర్, కంచ ఐలయ్య, బి.ఎస్. రాములు, ఉ. సాంబశివరావు, గూడ అంజయ్య, కె.ఎస్. చలం, ఖాదర్ మొహియుద్దీన్, బి.ఎం. లీలాకుమారి, దుర్గం సుబ్బారావు, ఇంగిలాల బోధి తదితరులు అనేక సంస్థలను నిర్మిస్తూ, కలిసి పనిచేస్తూ ముందుకు సాగారు. ఈ చైతన్యాన్ని మరింత ముందుకు తీసుకుపోతూ, స్త్రీవాద ఉద్యమాలు, బీసీ ఉద్యమాలు, వర్గీకరణ ఉద్యమాలు, మైనారిటీ సాహిత్య ఉద్యమాలు ముందుకు వచ్చాయి.

కారంచేడుతో మొదలై ఇవన్నీ ఒక సామాజిక పరిణామం క్రమంలో ముందుకు సాగడానికి కారంచేడు, చుండూరు, బహుజన సమాజ్‌పార్టీకి వాటికి నేతృత్వం వహించిన కత్తి పద్మారావు పాత్ర ప్రధానమైనది. నేటికీ ఆ బ్యానర్‌ని మోసుకొని, తీసుకొని దక్షిణ ఆఫ్రికాలో 2001లో డర్బన్‌లో, లండన్ పార్లమెంట్‌లో, ఢిల్లీలో ఇలా అనేక పార్లమెంటరీ పార్టీలలో, ఉద్యమాలలో కీలకపాత్ర నిర్వహించారు.
ఉత్తరాదిలో రాంవిలాస్ పాశ్వాన్ మొదలుకొని కాన్షీరామ్, మాయావతితో సహా అనేక పార్టీలలోని దళిత ప్రజాప్రతినిధులను, సాహితీవేత్తలను కదిలించడంలో కత్తి పద్మారావు ప్రసంగాలు, చర్చలు, సైద్ధాంతిక గ్రంథాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

**నోబుల్ పురస్కారానికి అన్నివిధాల అర్హులు**
కత్తి పద్మారావుగారిని అనేక పురస్కారాలు, సత్కారాలు, అవార్డులు వరించాయి. 1992లో అంబేద్కర్ అవార్డు. 2003లో సినారె సాహిత్య పురస్కారం, 2006లో తెలుగు యూనివర్శిటీ పురస్కారం, అలాగే భోయ భీమన్న ట్రస్ట్ పురస్కారం, 2008లో ఆచార్య నాగార్జున యూనివర్శిటీ నుండి గౌరవ డాక్టరేట్, 2010లో మహాకవి బిరుదు ప్రధానం, 2021లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ చేతుల మీదుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతుల మీదుగా వై.ఎస్.ఆర్. జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. కె. బాలగోపాల్ పౌరహక్కుల సంఘం ఉద్యమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సుప్రసిద్ధులు. అంతకన్నా ఎన్నోరెట్లు కృషి చేస్తూ ఉద్యమ నిర్మాణాలు, గ్రంథ రచన, సాహిత్య రచన చేస్తూ నేటికీ స్ఫూర్తినిస్తున్న డా॥ కత్తి పద్మారావు గారికి ఏ. అవార్డు ఇచ్చినా తక్కువే. నోబుల్ శాంతి బహుమతికి, నోబుల్ సాహిత్య పురస్కారానికి అన్నివిధాలుగా అర్హులు డా॥ కత్తి పద్మారావుగారు.

**యుగకర్తగా కత్తి పద్మారావు**
ఐదు దశాబ్దాలుగా సాహితీవేత్తగా, సిద్ధాంతకర్తగా కత్తి పద్మారావు చేసిన కృషి ఆయనని ఒక యుగకర్తగా నిలిపింది. నేను రాసిన అనేక పీఠికలను, వ్యాసాలను కలిపి 'యుగకర్త కత్తి పద్మారావు' అనే గ్రంథాన్ని వెలువరించాను. విప్లవోద్యమం నుండి నేను 1990లో బహిరంగ జీవితంలోకి వచ్చిన్నుండి దళిత మహాసభ, బహుజన సమాజ్ వాది పార్టీ, కత్తి పద్మారావు, బొజ్జా తారకం, ఉ. సాంబశివరావు, కంచ ఐలయ్య, గద్దర్ తదితరులతో కలిసి పని చేస్తున్నాం. ఇది అంతా ఒక సమిష్ఠి భావజాల చైతన్యం. సంస్థాగత నిర్మాణాలు ఎన్ని ఉన్నప్పటికీ, బౌద్ధం, చార్వాకం, గురు రవిదాస్, భక్త కబీర్ దాస్, మహాత్మా జ్యోతిరావు పూలే, నారాయణగురు, పెరియార్ రామస్వామి నాయకర్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ భావజాల వారసత్వాన్ని, చారిత్రక వారసత్వాన్ని స్వీకరించి, ముందుకు సాగుతున్న సమాంతర, ప్రత్యామ్నాయ బహుజన ఉద్యమ వ్యాప్తిని తెలియజేస్తుంది. ఇలా సమస్త, వర్ణ, వర్గ, కుల, లింగ, జాతి, మత, భాష, దేశ, ప్రాంత, విచక్షణలకు, అసమానతలకు వ్యతిరేకంగా మనుషులందరూ సమానమే. ఏ కులమూ గొప్పది కాదు, ఏ కులమూ చిన్నది కాదు అనే సమగ్ర సామాజిక దృక్పథంతో, సమగ్ర సామాజిక వికాసం కోసం కృషి చేయడం జరుగుతున్నది. కుల నిర్మూలన అంటే చాలామంది అదేదో పెద్ద భూతం అన్నట్టుగా భయపడుతుంటారు. కుల నిర్మూలన అంటే మరేమిటో కాదు. అన్ని కులాలు కలిసిపోవడమే. కుల వివక్ష తొలిగిపోవడమే కుల నిర్మూలనకు తొలిమెట్టు. ఇటీవల ముందుకు వచ్చిన తెలంగాణ సామెత కంచం పొత్తు, మంచం పొత్తు అన్ని కులాల మధ్యన ఏర్పడి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో కలిసిపోయి ఒకే సమాజంగా మారడమే కుల నిర్మూలన. ఈ దేశానికి సమస్త కులాలు కలిసిపోయి ఒక్కటి కావడం అనేది ఒక చారిత్రక అవసరం. వేల యేళ్ళుగా కుల, మతాలవారీగా చీలిపోయిన సమాజం ఒక్కటిగా మారి అన్ని రంగాల్లో ప్రపంచంలో మహోన్నతంగా ఎదగడానికి కుల నిర్మూలన అత్యవసరం. డా॥ కత్తి పద్మారావుగారి జన్మదినాన్ని ఇలా కులనిర్మూలన దినోత్సవంగా జరుపుకోవడం ఎంతో సమంజసం.



యుగకర్త, సామాజిక తత్వవేత్త
- బి.ఎస్. రాములు
శతాధిక గ్రంథకర్త,
తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ ఛైర్మన్
సెల్: 8331966987

# కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదు

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ విమర్శలు

**కూకట్‌పల్లి, జూలై 26 (జనంసాక్షి) :** మూడుసార్లు ఎమ్మెల్యే అని చెప్పుకునే కృష్ణారావు ప్రజలకు రోజుకు రెండు గంటలు మినహా అందుబాటులో ఉండరని , ఆయన ప్రభుత్వంపై చేసే విమర్శలు హాస్యాస్పదంగా మారాయని" టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ మండిపడ్డారు. శనివారం మూసాపేట్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయాంలో ఫోన్ ట్యాపింగ్, అధికారుల బెదిరింపులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు సర్వసాధారణమైపోయాయన్నారు. నాతో పాటు నా అసిస్టెంట్ నంబర్, మా పార్టీలో కీలక నాయకుల నంబర్లు కూడా ట్యాప్ చేయించారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. చెరువులు, కుంటలపై ఎమ్మెల్యే అనుచరుల దోపిడీ ఇప్పటికీ కొనసాగుతోందని బండి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. "చెరువుల సుందరీకరణ పేరుతో పబ్లిక్ ప్రాపర్టీని దోచుకునేందుకు నేతలే మార్గం వేసారు" అన్నారు. హౌసింగ్ బోర్డ్‌ను ఏర్పాటు చేసినది కాంగ్రెస్ ప్రభుత్వమే అని, ఇప్పుడు ఆ స్థలాలను కాపాడేందుకు రక్షణ చర్యలు చేపడుతున్నదీ కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. "టీఆర్‌ఎస్ హయాంలో రేషన్ కార్డులు లేవు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందలేదు. కానీ మా ప్రభుత్వం నెలలోనే రూ.10 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు ప్రారంభించింది" అని తెలిపారు. రాష్ట్రం మొత్తం రైతులకు రూ. 23 వేల కోట్లు రుణమాఫీ చేసినట్లు గుర్తుచేసిన రమేష్, "మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ?500 గ్యాస్, ఉచిత కరెంట్, శాది ముబారక్ వంటి పథకాలతో కాంగ్రెస్ పేదల పక్షంగా నిలుస్తోంది" అని తెలిపారు.

**ఎన్నికల ముందు 90 శాతం పనులు పూర్తి**

ఎన్నికల ముందు 90 శాతం అభివృద్ధి చేశామని చెప్పిన కృష్ణారావు, ఇప్పుడు పనులు సాగడంలేదంటూ డ్రామాలు చేస్తోన్నారని ధ్వజమెత్తారు. "కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి నైతికంగా అర్హత లేని నాయకుడి విమర్శలు సామాన్యుల్ని మభ్యపెట్టలేవు" అని అన్నారు. ఈ సమావేశంలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్



ప్రభుత్వం ప్రజారంజక పాలన చేస్తోందని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలతో పాటు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతో%శీ%దన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా 200 కోట్ల మంది మహిళామణులు ప్రయాణం చేశారన్నారు. రూ. 500 కే గ్యాస్ 25 యూనిట్ల వరకు ఉచిత కరెంటు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ మహిళా సాధికారత దిశగా ఎన్నో కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వరి వేస్తే ఒరేయ్ అన్న నాటి టిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు తీరని ద్రోహం చేసిందన్నారు రైతు క్షేమంగా ఉంటే దేశం సుభిక్షంగా ఉంటుందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.23 వేల కోట్ల రుణమాఫీ చేసిందని రైతు భరోసా కింద రూ.9,000 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం అందించింది అన్నారు. ఇక కుకట్పల్లి నియోజకవర్గం విషయానికి వస్తే ఎమ్మెల్యే కృష్ణారావు సాంకేతికంగా గెలిచినా నైతికంగా ఓడిపోయాడని, అతని గెలుపును తాను అంగీకరించడం లేదని రమేష్ పేర్కొన్నారు కృష్ణారావు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరగడం లేదంటూ నానాయాగి చేసే కృష్ణారావు ఎమ్మెల్యేగా గత 11 ఏళ్లుగా నియోజకవర్గానికి ఏం చేశాడంటూ రమేష్ గారు ప్రశ్నించారు. ప్రత్యర్థి వర్గాల ఫోన్లు ట్యాప్ చేయించడం అధికారులను బెదిరించడం ప్రశ్నించిన వారి మీద కేసులు పెట్టడం, బెదిరించడం తప్ప అతను నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని రమేష్ ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాప్ అయిన వారి పేర్లను ఆయన మీడియాకు వెల్లడించారు రోజుకు రెండు గంటలు మించి ప్రజలకు అందుబాటులో ఉండని ఎమ్మెల్యే ప్రభుత్వంపై తరచూ పనికిరాని, పసలేని విమర్శలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అసలు హౌసింగ్ బోర్డ్ ను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని హౌసింగ్ బోర్డ్ స్థలాలను కాపాడేందుకు ప్రభుత్వం పలు రక్షణ చర్యలు తీసుకుంటుంది అన్నారు టిఆర్ఎస్ హయంలోనే హౌసింగ్ బోర్డ్ స్థలాలను ప్రభుత్వ స్థలాలను చెరువులు కుంటలు ఆక్రమించి నాయకులు కార్యకర్తలు దోచుకుతిన్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రోడ్లు కబ్జా చేసి డబ్బాలు వేయించి వారి నుంచి డబ్బులు వసూలు చేసేది నీ అనుచరులే అని విమర్శించారు. చెరువుల సుందరీకరణ పేరుతో టిఆర్ఎస్ నాయకులు దోచుకోవడానికి దారి చూపారన్నారు. నియోజకవర్గంలోని చెరువులు కబ్జా అయితే వాటిని రక్షించేందుకు హైడ్రా తీసుకువస్తే దానిమీద విష%శీ% చిమ్ముతున్నారని పేర్కొన్నారు. డబల్ బెడ్రూంలో కోసం 31 వేలు అప్లికేషన్లు వస్తే 900 మందికి మాత్రమే ఇచ్చారని కైతలాపూర్ లో నిర్మించిన ఇళ్లు ఇప్పటికీ లబ్ధిదారులకు ఇవ్వకుండా అలాగే ఉన్నాయన్నారు. గత 15 ఏళ్లలో పేదలకు ఒక్క రేషన్ కార్డు సైతం ఇవ్వలేదని తమ ప్రభుత్వం 28,000 మందికి త్వరలో రేషన్ కార్డు ఇవ్వడం ఉన్నట్లు ప్రకటించారు దేశంలోనే మొట్టమొదటిగా రేవంత్ రెడ్డి ఆయంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తుందన్నారు తమ ప్రభుత్వం వచ్చిన నెలలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ 10 కోట్లు కేటాయించడంతోపాటు మరెన్నో నిధులను మున్సిపాలిటీకి జిహెచ్ఎంసికి ఇవ్వడం జరిగిందన్నారు. పదేళ్ల టిఆర్ఎస్ ప్రభుత్వం లో అభివృద్ధి ఏం జరగలేదని హౌసింగ్ బోర్డ్ లో ఇంకా ఎల్ఐజీ ఇళ్లు రిజిస్టర్ కాలేదని ట్రాఫిక్ సమస్య అలాగే ఉందని, అయితే అభివృద్ధి 90 శాతం పూర్తి అయిందని 26 కులాలను బీసీల్లో కలుపుతామని ఎన్నికల ముందు పెద్ద డ్రామా ఆడాడనీ రమేష్ విమర్శించారు. మూసాపేట వై జంక్షన్, జేఎన్టీయూ చౌరస్తా వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కూకట్పల్లిలో పీజీ కాలేజీ ఏర్పాటుకు హౌసింగ్ బోర్డ్ లో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఎస్సీ వర్గీకరణకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు సమావేశంలో ఏ, బి బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, తూము వేణు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీట

- ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, జూలై 26 (జనం సాక్షి) :** మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపేట వేసిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం 100 రోజుల ప్రణాళిక ఒక్క మార్పు అభివృద్ధికి మలుపులు కార్యక్రమంలో భాగంగా బండ్లగూడ జాగీర్ నగర పాలక సంస్థ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్లో మహిళ సంఘాల సభ్యులకు వడ్డీ లేని రూ.5.50 కోట్ల రుణాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మహిళ సంఘాల సభ్యుల స్వయం ఉత్పత్తుల ప్రదర్శన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ లను ఎమ్మెల్యే ప్రత్యేక అధికారి పి. శ్రీధర్, కమిషనర్ శరత్ చంద్రులతో కలిసి ప్రారంభించి వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక బృందాలకు, మహిళ సంఘాలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు వడ్డీ లేని రుణాలను అందించే ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనని మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే సమాజం అభివృద్ధిలో ముందుంటుందని ఆయన అన్నారు. ఈ వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం వీధి విక్రయదారుల యొక్క చిరు వ్యాపారులు అభివృద్ధి పరుచుకొనే దిశగా ముందడుగు వేయాలని, ఆర్థిక పరిపుష్టి వారి కుంటుంబ పోషణ మెరుగుపర్చుకోవాలని, వారికి కావాల్సిన ఆర్థిక సహాయం ప్రభుత్వం ద్వార బ్యాంకుల ద్వారా అందించే విదంగా వీది విక్రేయ దారులను ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళ సంఘాల సభ్యుల స్వయం ఉత్పత్తులు వివిధ తినుబండారాలు ప్రదర్శనను పరిశీలించి, ఆరోగ్యమైన ఆర్గానిక్ ఫుడ్ తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చెర్మెన్ రాందాస్, ఎఎండి చంద్రశేఖర్ రెడ్డి, పి.డి మేప్మ రంగా రెడ్డి జి. వెంకట నారాయణ , మేనేజర్ టి. పర్వతాలు, టిఎంఎస్. శ్రీలత, బిజీఎంసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పి. కృష్ణారెడ్డి,మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ పి. రాజేందర్ రెడ్డి, నేతలు గోకరి సురేష్ గౌడ్, సుమన్ గౌడ్, నరేష్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో భారీ వర్షం

- పాఠశాలలకు సెలవు
- వరద నీట మునిగిన పంటలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు వంకలు
- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో, జూలై 26 (జనం సాక్షి) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వికారాబాద్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం కారణంగా వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే విద్యాశాఖ శనివారం నాడు ఒక పూట బడికి సెలవు ప్రకటించింది. ఆదివారం సెలవు కావడంతో జిల్లాలోని అన్ని పాఠశాలలు మూతపడతాయి. జిల్లాలో భారీగా వర్షం కురుస్తున్న కారణంగా వివిధ గ్రామాల నుంచి సమీప పాఠశాలలకు విద్యార్థిని విద్యార్థులు చదువుకోడానికి వస్తున్న కారణంగా వాగులను వంకలను దృష్టిలో పెట్టుకొని శనివారం సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ గ్రామాల నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు విద్యార్థులు వచ్చి చదువుకొని వెళ్తూ ఉంటారు. గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సౌకర్యం సరిగ్గా లేని కారణంగా విద్యార్థులంతా నడుచుకుంటూ గ్రామాలకు వెళుతూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని విద్యాశాఖ సెలవు ప్రకటించింది. కాగా నాలుగు రోజులకు కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో జిల్లాలోని ప్రధాన రిజర్వాయర్ లోకి భారీగా వచ్చి నీరు చేరుతుంది. లక్నాపూర్ కోట్ పల్లి సర్ప న్ పల్లి మోమిన్ పేట కొంషేద్పల్లి ప్రాజెక్టులు వరద నీరుతో నిండిపోయాయి. అలాగే జిల్లాలోని పెద్ద తరహా చిన్న తరహా ప్రాజెక్టులన్ని నిండుకొని కళకళలాడుతున్నాయి. కొన్ని ప్రాజెక్టుల్లో అలుగు దాటి నీరు ప్రవహిస్తుండడంతో దిగువన ఉన్న వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టు దిగువన ఉన్న గ్రామాల ప్రజలను రైతులను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రాజెక్టుల్లోకి నీరు చేరి అలుగు ద్వారా ప్రవహిస్తుండడంతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని పొలాలకు వెళ్లే రైతులు పశువుల కాపర్లు ప్రజలు ఎవ్వరు వాగుల వైపు వెళ్ళకూడదని హెచ్చరికలు జారీ చేశారు. అలాగే ప్రమాద స్థాయిని దాటి ప్రవహించే వాగులను ముందుగానే గుర్తించి అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పోలీస్ శాఖ బందోబస్తు నిర్వహిస్తుంది. వాగులు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలను నిలిపివేయడానికి చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగా పొలాల్లో పంటలు నీట మునిగాయి. వాగులకు ఇరువైపులా పంట పొలాల నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఫలితంగా మొక్కజొన్న పత్తి సోయాబీన్ కంది పెసర వంటి పంటలు నీట మునిగాయి. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎవరు శిధిలవస్థకు చెందిన ఇండ్లలో నివసించకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు హెచ్చరించారు. అలాగే చెట్ల కింద నిల్చో వద్దని విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల దగ్గరకు వెళ్లవద్దని సూచించారు. చిన్నపిల్లలను వరద ఉధృతంగా ఉండే ప్రాంతానికి వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లావ్యాప్తంగా మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

## స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**శామీర్‌పేట్, జూలై 26 (జనంసాక్షి) :** స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక అభి వృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని అదనపు కలెక్టర్ రాధిక గుప్తా తెలిపారు. శనివారం తూముకుంట మున్సిపాలిటీ పరిధిలో మహిళ శక్తి గ్రూపులచే ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ స్టాళ్లను మునిసిపల్ కమిషనర్ జ్యోతితో కలిసి ఆమె సందర్శించి,స్టాళ్లలో ఏర్పాటు చేసిన పలు వంటకాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం చేయుటకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు అందిస్తుందని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా మహిళా శక్తి గ్రూపులకు క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్లను ఆమె పంపిణీ చేశారు వర్షాకాలం అయి నందున



పరిశుద్ధ కార్మికులు వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ ఆథారిటీ మెంబర్ జైపాల్ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్లు స్వయం సహాయక సంఘాల సభ్యులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌కు నిధుల వరద

- ఉప్పల్ డివిజన్‌కు మరోసారి భారీగా నిధులు
- అభివృద్ధి పనులకు రూ.7.39 కోట్లు మంజూరు

**ఉప్పల్, జూలై 26 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ డివిజన్‌కు భారీగా నిధులను మంజూరు చేస్తున్నారు. నాడు మల్కాజిగి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంత సమస్యలు తెలిసిన వ్యక్తిగా నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి రూ.7.39 కోట్ల నిధులను మరోసారి కేటాయించారు అని కొనియాడారు. ఉప్పల్ డివిజన్‌లోని



న్యూ విజయపురికాలనీ, సరస్వతికాలనీ, సెవెన్‌హిల్స్‌కాలనీ, గణేష్‌నగర్, శాంతినగర్, పద్మావతికాలనీలలో సీసీ రోడ్ల పనులకు రూ.1.82 కోట్లు.ఉప్పల్‌హిల్స్‌లో ఆర్‌సీసీ పైపులైను నిర్మాణానికి రూ.65 లక్షలు. శ్రీరమణపురంలో ఆర్‌సీసీ పైపులైను నిర్మాణానికి రూ. 98 లక్షలు.సౌత్ స్వరూప్‌నగర్‌లో ఆర్‌సీసీ పైపులైను నిర్మాణానికి రూ. 96 లక్షలు. మాలబస్తీలో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.32 లక్షలు.సత్యనగర్‌లో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.20 లక్షలు. విజయపురికాలనీలో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.20 లక్షలు.శాంతినగర్‌లో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.15 లక్షలు. గణేష్‌నగర్‌లోని ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.90 లక్షలు. హనుమాన్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.90 లక్షలు. వెంకటేశ్వరకాలనీలోని ముదిరాజ్ శ్మశాన వాటికలో వివిధ రకాల పనులకు రూ.31 లక్షలు.ఇన్ని నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి ఉప్పల్ ప్రజల గుండెలో ఉంటారు అని తెలిపారు.

## నూతన ఆస్పత్రిని ప్రారంభించిన ఈటల కేపీ వివేకానంద, చామకూర మల్లారెడ్డి

**కుత్బుల్లాపూర్, జూలై 26 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కొంపల్లి లోని జాతీయ రహదారిపై జెడ్ స్పెషాలిటీ ఆసుపత్రిని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. రోబోటిక్స్ వంటి అత్యధిక సాంకేతికత చికిత్సను అందజేసే ఉద్దేశంతో ప్రారంభించిన జెడ్ స్పెషాలిటీ ఆసుపత్రి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. పూర్తిగా వ్యాపార ధోరణిలో కాకుండా కొంత సామాజిక సేవ లక్ష్యంగా చికిత్సను అందించాలని సూచించారు. సామాన్యులకు అందుబాటు లో ఫీజులను ఉండేలా ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్,



మాజీ కౌన్సిలర్లు చింతల దేవేందర్ యాదవ్, సువర్ణ, నాయకులు లక్ష్మణ్ గౌడ్, కృష్ణ సాగర్, ఎండి ఖాదర్, ఎర్రోళ్ల లక్ష్మణ్, డాక్టర్లు శైలజ, శ్రీ హర్ష, ప్రియదర్శిని, కౌసర్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందివ్వాలి

- తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, జూలై 26 (జనం సాక్షి) :** నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందివ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం డిమాండ్ చేశారు.శనివారం భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నారాయణపేట మండల తాహాసిల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా భూనిర్వాశితులకు బేసిక్ ధర నిర్ణయించి 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ ఆపాలని రైతులను ప్రలోభలకు గురి చేసే పని పద్ధతులను మానుకోవాలని హితవు పలికారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందివ్వకుండా అరకొర సహాయం అందించి ప్రలోభాలతో మోసంతో బలవంతంతో భూసేకరణకు ముందుకు వెళితే భూ నిర్వాసితులు ఐక్యంగా ఉండి పోరాటం చేస్తారని తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేసిన వారిలో భూనిర్వశితుల సంఘం జిల్లా నాయకులు సింగారం హనుమంతు, లక్ష్మీకాంత్,రాఘవేంధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## దైవభక్తి కన్నా దేశభక్తి గొప్పది

- వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ అధ్యక్షులు రవీందర్

**తాండూరు, జూలై 26 (జనంసాక్షి) :** దైవభక్తి కన్నా దేశభక్తి గొప్పదని వందేమాతరం ఫౌండేషన్ ఫౌండర్ అధ్యక్షులు రవీందర్ అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణ సమీపంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన అమర జవాన్ లను స్మరించుకొని కవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించి సెల్యూట్ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ పాల్గొని మాట్లాడుతూ అమర సైనికులని స్మరించుకొని కార్గిల్ డే కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.5 కార్గిల్లో అమరులైనటువంటి 527 వీర జవాన్లు 1999లో విజయం సాధించారు .దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో వీరొచితంగా పోరాడి వీర మరణం పొందిన అమర జవాన్ లను స్మరించుకొని కవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించి సెల్యూట్ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ పాల్గొని మాట్లాడుతూ అమర సైనికులని స్మరించుకొని కార్గిల్ డే నిర్వహించడం అభినందనీయ మన్నారు.కార్గిల్ విజయ్ దివస్ ప్రతి 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ సైన్యంపై భారతదేశం సాధించిన చారిత్రక విజయాన్ని గుర్తుచేస్తుంది.కార్గిల్ యుద్ధం ఒక సంక్షిప్త చరిత్ర 1999 మే 3న జమ్మూ కాశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాలో, నియంత్రణ రేఖ (ఎఓసీ) వెంబడి పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు భారత భూభాగంలోకి చొరబడటంతో ఈ యుద్ధం మొదలైంది. భారత సైన్యం ఆపరేషన్ విజయ్ పేరుతో ఈ చొరబాట్లను తిప్పికొట్టడానికి ప్రతీకారం తీర్చుకుంది. దాదాపు 60-73 రోజుల పాటు సాగిన ఈ యుద్ధంలో భారత సైన్యం అద్భుతమైన ధైర్యాన్ని, తెగువను ప్రదర్శించి, మంచుతో కప్పబడిన ఎత్తైన పర్వత శిఖరాలపై తిష్టవేసిన శత్రువులను తరిమికొట్టింది. చివరికి, జూలై 26, 1999న భారత సైన్యం పూర్తి విజయం సాధించి, తమ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకుంది. ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు తమ ప్రాణాలను దేశం కోసం త్యాగం చేశారు.కార్గిల్ విజయ్ దివస్ అనేది కేవలం ఒక సైనిక విజయానికి గుర్తు మాత్రమే కాదు, ఇది మన దేశాన్ని రక్షించడానికి తమ ప్రాణాలను పణంగా పెట్టిన వీర సైనికుల ధైర్యసాహసాలు, త్యాగాలను స్మరించుకునే రోజు. ఈ రోజున, భారతదేశం నలుమూలల నుండి ప్రజలు కార్గిల్ వీరులకు నివాళులు అర్పిస్తారు. ఈ దినోత్సవం భారత సాయుధ దళాల అజేయమైన స్ఫూర్తిని, పరాక్రమాన్ని ప్రదర్శిస్తుంది మరియు దేశభక్తిని పెంపొందిస్తుంది.కార్గిల్ యుద్ధం భారత సైన్యం యొక్క



దృఢ సంకల్పం, నిస్వార్థ సేవ మరియు అపారమైన ధైర్యానికి పర్యాయపదంగా మారింది.ఆపరేషన్ సింధూర్ లో అపర కాళీమాతగా సోఫియా ఖురేషి ప్రదర్శించిన భారత శౌర్యం పునికిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. దేశ సరిహద్దుల్లో పనిచేస్తున్న సైనికుల శాస ధోరణి జాతీయ జెండా ఎగురుతుందని మాతృభూమి భారతమాత రక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామా రిటైర్డ్ అన్నమయ్య సైనికునికి ఘనంగా సన్మానించారు. పాఠశాల పూర్వ విద్యార్థిని హారిక ఎంబిబిఎస్ సీటు సంపాదించిన సందర్భంగా విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు కార్గిల్ డే సందర్భంగా వ్యాసరచన డ్రాయింగ్ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్గిల్ డే ప్రోగ్రాం నిర్వాహకులు కవయిత్రి మొల్ల కళావేదిక ఫౌండర్ అధ్యక్షులు కే.వి.యం. వెంకట్,ఆర్ బిచ్చప్ప,రిటైర్డ్ టీచర్ శ్రీ రామకృష్ణ సేవ సమితి అధ్యక్షులు బాలకృష్ణ, ప్రిన్సిపల్ ప్రవీణారెడ్డి,ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
27 జూలై 2025

# ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, జూలై 26 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులలో మాతృ మరణాలు సంభవించకుండ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో గట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇటిక్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో జరిగిన మాతృ మరణాలపై, వైద్య సిబ్బందికితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలో ఎక్కడా కూడా మాతృ మరణాలు జరగకుండా వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పని చేయాలని లేనిచో శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మాతృ మరణాలు సంభవించకుండా వైద్యాధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశలు, సమన్వయం చేసుకుంటూ గర్భిణీ స్త్రీలను,బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఆర్ఎంపి లు ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు



ఇవ్వరాదని ఒకవేళ ఇచ్చినచో అటువంటి ఆర్.ఎం.పి. లపై క్రిమినల్ కేసు నమోదు చేయమని జిల్లా వైద్యాధికారిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బింగిదొడ్డి గ్రామంలో బాలింతకు,డాక్టర్ ప్రెస్క్రిప్షన్ లేకుండా ఆర్.ఎం.పి. వైద్యుడు ఇంటిదగ్గర ఇంజక్షన్ వేయడం ద్వారా బాలింత మృతి చెందడం జరిగిందని,ఆ బాలింత మృతికి కారణమైన ఆర్ఎంపిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కలెక్టర్ జిల్లా వైద్య అధికారికి ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే వైద్యాధికారులు ఫీల్డ్ సూపర్వైజర్లు,ఆరోగ్య కార్యకర్తలు,ఆశాలు, హై రిస్క్ లక్షణాలు ఉన్న గర్భిణీ స్త్రీలను, బాలింతలను ప్రతిరోజు తప్పనిసరిగా గృహ సందర్శన చేసి మాతృ మరణాలను అరికట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా వైద్యాధికారులు, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ బృందం జిల్లాల్లోని అన్ని ప్రైవేట్ ఆసపత్రులను సందర్శించి ప్రైవేట్ ఆసుపత్రులలో యాజమాన్యం వారు స్టైరైజ్ ఆపరేషన్ మెజర్స్ పాటిస్తున్నారా లేదా అని చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య అధికారి సిద్దప్ప, మాతా శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ప్రసూన రాణి, ఇటిక్యాల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డా.రాధిక, గట్టు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డా. రమేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్య సిబ్బంది, తిరుమలేష్ రెడ్డి ,నరసయ్య, హెల్త్ అసిస్టెంట్, సూపర్వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఆశాలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోస్టర్ల విడుదల



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 26 (జనంసాక్షి) :** బిఏస్ఎఫ్ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్ లలో అవగాహన సదస్సుల పోస్టర్స్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారుల తో విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి. ఎస్. ఏఫ్. రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ మాట్లాడుతూ, నాగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని పాఠశాల లు ఇంటర్ మీడియేట్, డిగ్రీ కళాశాల లు మరియు హాస్టల్ లలో ఆగస్టు 01 వ తేదీ నుండి అక్టోబర్ 01వ తేదీ వరకు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా బి. ఎస్. ఏఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అన్నారు. చాలా మంది విద్యార్థులు మత్తుకు బానిసయ్యి విద్యార్థులు చెడిపోతున్నారు. కాబట్టి నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా బి. ఎస్. ఏఫ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బి. ఎస్. ఎఫ్. జిల్లా అధ్యక్షుడు సాయిబాబు, జిల్లా డివిజన్ అధ్యక్షులు రామ్ చందర్, జిల్లా నాయకులు సురేష్, సమద్ పాషా, భరత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# శతాబ్ది ఉత్సవాలను సమిష్టిగా విజయవంతం చేద్దాం

- ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బి. రవిశంకర్

**జడ్చర్ల, జూలై 26 (జనం సాక్షి) :** బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలను సమిష్టిగా విజయవంతం చేద్దామని ఉత్సవ కమిటి అధ్యక్షుడు బి.రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. కృష్ణలు పిలుపునిచ్చారు. శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నవంబర్ నెల చివరివారంలో జరిగే 3రోజుల ఉత్సవాలను జయప్రదం చేసేందుకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ ఉత్సవాల్లో పూర్తి భాగస్వామ్యం కావాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి కార్యక్రమాల నిర్వహణ, పాఠశాలలో అత్యవసరంగా కావాల్సిన వసతుల గూర్చి తెలియజేయాలని ఉపాధ్యాయులను కోరారు. స్పందించిన ఉపాధ్యాయులు పాఠశాలకు అత్యవసరంగా మరుగుదొడ్లు, విద్యార్థులకు డైనింగ్ హాల్ నిర్మించాలని వివరించారు. ఉత్సవాల నిర్వహణలో పూర్తి సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. శతాబ్ది ఉత్సవాలలో భాగస్వామ్యం కావటం మనందరి అదృష్టమన్నారు. ఉత్సవాలు చిరస్థాయిగా నిలిచిపోయి భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా చేద్దామన్నారు. టాయిలెట్స్, డైనింగ్ హాల్ నిర్మాణాల కోసం స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి మంజూరి చేయించుకుందామని



నిర్ణయించారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయురాలు చంద్రకళ, స్టాఫ్ సెక్రటరి గోపాల్, యుగంధర్ రెడ్డి, శంకర్, శశిరేఖ, భాగ్య, ఉపాధ్యాయ బృందం, శతాబ్ది ఉత్సకమిటి ఉపాధ్యక్షులు సయ్యద్బహీం, జీనురాల సత్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి కంచుకోట ఆనంద్‌లు పాల్గొన్నారు. ఉత్సవ కమిటి అధ్యక్షుడు రవిశంకర్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సత్కరించారు.

# సంగారెడ్డి జిల్లాను విద్యారంగంలో ముందు ఉంచాలి

- అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం
- జిల్లా కలెక్టరేట్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 26 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాను విద్యారంగంలో ముందు ఉంచాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య విద్యార్థులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో సంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానం సాధించి, ఐఐఐటి బాసర, మహబూబ్ నగర్‌లలో అత్యధిక సీట్లు సాధించినందుకు విద్యార్థులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం లో నిలిచి సంగారెడ్డి జిల్లా ప్రత్యేకత చాటుకుందన్నారు. పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానించి వారికి వ్యక్తిత్వ వికాసం కు సంబంధించిన తొమ్మిది పుస్తకాల సెట్ ను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. విద్యార్థులు అందరూ భవిష్యత్తులో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, వారి తల్లిదండ్రులకు, వారు చదువుకున్న పాఠశాలకు పేరు తేవాలని, సంగారెడ్డి జిల్లాను విద్యారంగంలో ముందు ఉంచాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పైర్ నామినేషన్ సంబంధించిన



కరపత్రాన్ని కూడా విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు ,సీఎంఓ వెంకటేశం, ఏ ఎం ఓ బాలయ్య , డి ఎస్ ఓ పి.సిద్ధారెడ్డి, మండల విద్యాధికారి జోగప్ప, ప్రధానోపాధ్యాయులు వెంకట రాజయ్య, యాదవ రెడ్డి, సోమశేఖర్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులన్నీ సమకూర్చాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల నడిగడ్డ, జూలై 26 (జనం సాక్షి) :** ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన వసతులన్నీ సమకూర్చాలని కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. శనివారం కేటిదొడ్డి మండలానికి చెందిన పూటన్ పల్లి గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలు, వసతుల స్థితిగతులపై కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత,ఆరోగ్యం విషయంలో రాజీ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు సూచించారు.ప్రతి తరగతిలో విద్యార్థులకు పాఠాలు స్పష్టంగా అర్థమయ్యేలా విద్యను బోధించాలనీ, భోజనం నాణ్యతపై రాజీ లేకుండా మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. విద్యతోపాటు క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలని, పాఠశాల పరిసర పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల్లో శుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు చొరవ చూపాలని,తరచూ ముఖాముఖి సంభాషణల ద్వారా వారి సమస్యలు తెలుసుకొని, ప్రోత్సహించే విధంగా ముందుండాలని కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడిన కలెక్టర్, పాఠశాలలో అందుతున్న వసతులపై వారి



అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులు నిరంతరం కష్టపడి చదివి మెరుగైన విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.భవిష్యత్ నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఇన్చార్జి ప్రిన్సిపల్ సుచరిత, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం అందివ్వాలి

**మక్తల్, జూలై 26 (జనంసాక్షి) :** మక్తల్ – కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందివ్వాలని భూ నిర్వాసితుల జిల్లా నాయకులు పుంజునూరు ఆంజనేయులు గోవింద్ రాజ్ డిమాండ్ చేశారు. మక్తల్ మండలంలోని కాట్రేపల్లి, హెర్ నాగన్ పల్లి, కాచువార్ గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి భూ నిర్వాసితుల జిల్లా నాయకులు పుంజునూరు ఆంజనేయులు, గోవింద్ రాజ్ మాట్లాడుతూ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రస్తుతం ధర 50 లక్షల నుండి కోటి వరకు ఒక ఎకరంకు కొంటున్న పరిస్థితి ఉన్నది దీనికి విరుద్ధంగా ప్రభుత్వం 14 లక్షలు ఇస్తామనడం



విడ్డూరంగా ఉందని అన్నారు. 2013 భూ చట్టం ప్రకారము న్యాయమైన పరిహారం అందివ్వాలని డిమాండ్ చేశారు. బలవంతంగా భూసేకరణ ఆపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కేశవులు, రవీందర్ రెడ్డి, రాజు, రవికుమార్, నరసప్ప, శ్రీశైలం, వెంకటప్ప, బీరప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఒత్తిడి నియంత్రణపై విద్యార్థులకు అవగాహన

- గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మీ ప్రియాంక




**సంగారెడ్డి, జూలై 26 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన మునిపల్లి మోడల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఒత్తిడి నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "పాఠశాలలో మానసిక శ్రేయస్సు" అనే అంశంపై "చెలిమి' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గీతం యూనివర్సిటికి చెందిన సైకాలజి విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీ ప్రియాంక విద్యార్థులు ఒత్తిడి లేకుండా, ఆత్మవిశ్వాసంతో, ఆనందంగా, మానసికంగా స్థిరంగా ఎలా ఉండాలో అవగాహన కల్పించారు. విద్యలో మంచి ఫలితాలు, స్నేహసంబంధాలు, స్వయం నియత్రణ, సామాజిక నైపుణ్యాలు పెంపొందించుకోవడం, ఒత్తిడి నియంత్రణకు సంబంధించిన యోగా తదితర అంశాలపై పూర్తిస్థాయిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా అవగాహనను కల్పించారు. అవగాహన సదస్సులో విద్యార్థులందరు ప్రొఫెసర్ చెప్పింది శ్రద్ధగా విన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. మల్లిక , ఉపాధ్యాయురాలు అనిత, రజిని, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



**కృష్ణ, జూలై 26 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాల్సిన అవసరాన్ని గుర్తిస్తూ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ (సిజిఆర్) సంస్థ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కున్సి ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాల ఆవరణలో వృక్షార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిజిఆర్ ప్రతినిధులు బాలాంజనేయులు, జగన్ పాల్గొని విద్యార్థులకు మొక్కల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఖాసీం అలీ, నరేందర్, ఉష, నరసింహులు, తాయప్ప పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు. నాటిన మొక్కలలో మర్రి, ఉసిరి, చింత, కుంకుడు, వేప, నారవేపవంటి ఆరోగ్యానికి, పర్యావరణానికి ఉపయోగకరమైన స్థానిక జాతుల చెట్లు ఉన్నాయి.ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైతం ఉత్సాహంగా పాల్గొన్నారు. మొక్కల సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని వారికి ఉపన్యాసాలు ఇచ్చారు. పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందని ఉపాధ్యాయులు సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ఆక్సిజన్ సరఫరా, హరితహారంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం పాఠశాల ఆవరణను పచ్చదనంతో నింపుతుంది.అని అన్నారు.

# జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేయాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 26 (జనం సాక్షి) :** జిల్లాలో జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేసేందుకు వైద్య శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ సూచించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్లో వైద్యశాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..జీవో 54 ప్రకారం ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి, జనరిక్ మందుల ప్రమోట్ చేసేలా చూడాలని చెప్పారు.ప్రతీ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు చేయించేందుకు వైద్య శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్ని జనరిక్ మెడికల్ స్టోర్ లు ఉన్నాయని అదనపు కలెక్టర్ ప్రశ్నించగా జిల్లాలో మక్తల్, కోస్గి, నారాయణపేట పట్టణంలో మొత్తం మూడు ఉన్నాయని పీవో బిక్షపతి తెలిపారు. అయితే ఆ మూడింటితో పాటు మరికొన్ని జనరిక్ మెడికల్ స్టోర్స్ ఏర్పాటు చేసేందుకు వారం రోజులలో ప్రణాళిక ను తయారు చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అప్పక్ పల్లి వద్ద ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జనరిక్ మెడికల్ స్టోర్ ను వీలైనంత తొందరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.జనరిక్ మెడికల్ స్టోర్ ను డీఆర్ డీ ఏ ద్వారా మహిళా సంఘాల సభ్యులు, లేదా స్వచ్ఛంద సంస్థ సభ్యులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులలో ( బీ ఫార్మసీ చేసిన వారు) ఎవరైనా ఏర్పాటు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.



మద్దూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెప్పారు.కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వైద్యులు జనరిక్ మందులనే రాయాలని ఆయన స్పష్టం చేశారు.వారం రోజుల్లో జనరిక్ మెడికల్ స్టోర్ లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ మొగులప్ప, వైద్య విధాన పరిషత్ నుంచి ఏ వో గంగాధర్, జిల్లా ఆస్పత్రి వైద్యులు శైలజ, ఆదిత్య, ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్)జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఫార్మసిస్ట్ తుల్జారాం తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణే షీటీమ్స్ ప్రధాన లక్ష్యం

- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 26 (జనం సాక్షి) :** మహిళలు,యువతులు,బాలికలు ఆకతాయిల వలన గానీ,మరే విధమైన వేధింపుల గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్,యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు.విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థినులు బస్టాండ్ల దగ్గర, గ్రామాలలో, కాలనీలలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లకు గురైనా, ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల వద్ద వేధింపులకు గురైనా,బాలికలపై ఎవరైనా లైంగిక వేధింపులకు పాల్పడినా వెంటనే నిర్భయంగా షీ టీమ్ పోలీసులను ఆశ్రయిస్తే సత్వర న్యాయం చేకూరుస్తామని ఎస్పీ తెలిపారు.షీటీమ్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా షీటీమ్స్ ద్వారా మహిళలు సామాజిక మాధ్యమాలైన ఫేస్బుక్,వాట్సాప్,ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫొటోలు,వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు



సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు షి టీమ్ 8712670398 ఫోన్ నంబరుకు లేదా డయల్ 100కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని అ వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

- విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేసిన మంచిర్యాల కలెక్టర్



మంచిర్యాల ప్రతినిధి, జూలై 26 (జనంసాక్షి) : ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, వసతి గృహ పరిసరాలను పరిశీలించి, మెస్ కమిటీ సభ్యులతో రోజువారి ఆహార పట్టిక అమలుపై వివరాలు అడిగి తెలుసుకుని, విద్యార్థినులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర అన్ని సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడం జరుగుతుందని, ఆహారం తయారీలో తాజా కూరగాయలు, నిత్యవసర సరుకులు వినియోగించాలని, విద్యార్థులకు వేడి భోజనం, శుద్ధమైన త్రాగునీరు అందించాలని తెలిపారు. వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థినుల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సరైన మార్గ నిర్దేశం చేసి వారిలో మనోధైర్యాన్ని కల్పించాలని సంక్షేమ అధికారిని ఆదేశించారు. వసతి గృహ సంక్షేమ అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు. వసతి గృహంలో నెలకొన్న నీటి సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకురాగా బోర్ వెల్ మంజూరు చేసి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మంచిర్యాల పట్టణంలోని సాయికుంటలో గల ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం అయినందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు పాటించవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు సిహెచ్. దుర్గాప్రసాద్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం. రవీందర్, వసతి గృహ సంక్షేమ అధికారి డి. చందన సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ నూతన రేషన్ కార్డులు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్ బ్యూరో/ కడెం, జూలై 26 (జనంసాక్షి) : ప్రభుత్వం పేద ప్రజలకు నూతనంగా అందిస్తున్న రేషన్ కార్డులతో అర్హులందరికీ ఉచిత సన్న బియ్యం అందుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శనివారం కడెం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మా బొజ్జు పటేల్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రత్యేక అధికారి హరికిరణ్ తో కలిసి కలెక్టర్ అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అన్నింటికి రేషన్ కార్డులే ప్రామాణికమని, గత కొద్ది రోజులుగా నూతన రేషన్ కార్డులు అందకపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారని అన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన రేషన్ కార్డుల ద్వారా ప్రజలందరికీ ఆరు కిలోల చొప్పున రేషన్ దుకాణాల ద్వారా ఉచిత సన్న బియ్యం అందుతాయని చెప్పారు. కడెం మండలంలో 966 నూతన రేషన్ కార్డులు మంజూరయ్యాయని అన్నారు. 2 వేలకు పైగా రేషన్ కార్డులలో పేర్లు చేర్చడం జరిగిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మాట్లాడుతూ, గత కొన్నేళ్లుగా ప్రజలకు నూతన రేషన్ కార్డులు లేక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గంలో దాదాపు 20 వేల కుటుంబాలకు లబ్ధిచేకూరిందని తెలిపారు. ప్రజలకు నూతన రేషన్ కార్డులు అందించడం ద్వారా ప్రభుత్వం అందించు అన్ని పథకాల ఫలాలు పొందుతారని అన్నారు. పేద ప్రజలందరూ పస్తులు ఉండకుండా నాణ్యమైన ఆహారాన్ని మూడు పూటలా కడుపునిండా తినాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మెన్ పడిగెల భూమన్న భూషణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేందర్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, రేషన్ కార్డుల లబ్ధిదారులు, రేషన్ డీలర్లు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మండల సమస్యలపై సీఎంకు వినతి



బెల్లంపల్లి, జులై 26, (జనంసాక్షి) : బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తో కలిసి గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్ గౌడ్ వినతిపత్రం అందజేశారు. నెన్నెల మండల ప్రజలు గత 30 సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న పోడు భూములను ఫారెస్ట్ అధికారులు తీవ్ర ఇబ్బంది పెడుతున్నారని అర్హులైన రైతులకి పట్టాలు ఇప్పించాలని, మారుమూల గ్రామంలో ఫారెస్ట్ పరిధిలోని రోడ్ల సమస్యల గురించి వివరించారు. నెన్నెల టి రోడ్డు నుండి ఎల్లమ్మ గుడి వెళ్ళే మార్గంలో వాగు బ్రిడ్జి నిర్మించాలని, నెన్నెల కుమ్మరి వాగు బ్రిడ్జి 20 ఏండ్లు క్రిందట నిర్మించారని, ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నందున నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, నెన్నెల గ్రామం కొత్తగూడెం నుండి కన్నెపల్లి మండలం ఎల్లారం గ్రామానికి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలని, ఖర్జీ, జంగల్ పెట్ గ్రామంలోని వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, నెన్నెల మండల కేంద్రం నుంచి అవడం గ్రామానికి సింగిల్ రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు ఉన్నందున డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చెయ్యాలని, నెన్నెల మండలంలోని కుమ్మరి వాగు ప్రాజెక్టులో పూడిక తీపించాలని, పంట పొలాలకి నీరు అందించే కాలువలు పూడిక తీయటానికి నిధులు మంజూరు చెయ్యాలని వినతి పత్రంలో కోరారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, రైతులకు పోడు భూముల పట్టాలు అందించే కార్యక్రమానికి శ్రీకారం చెయ్యబోతున్నామని, మండల అభివృద్ధి తోడ్పడుతామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

# పసివాన్ని లాలించిన కలెక్టర్ సతీమణి

- భావోద్వేగానికి గురైన కలెక్టర్ దంపతులు
- వదిలేసిన నవజాత శిశువు ఆరోగ్యంపై సమీక్ష
- ఎక్కడ పడితే అక్కడ వదిలేయొద్దు
- అవసరం లేకపోతే ఊయలలో ఉంచండి
- శిశువులను అధికారులు అక్కున చేర్చుకుంటారు
- ప్రతీ జీవికి జీవించే హక్కు ఉంది
- మానవత్వంగా వ్యవహరించాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ ప్రతినిధి,జూలై 26 (జనంసాక్షి): కళ్ళు తెరవని పసిబిడ్డ ను మానవత్వం, కనికరం లేని ఓ తల్లి వదిలి వెళ్ళిపోతే.... విషయం తెలిసిన ఓ అమ్మ మనసు ఆ బిడ్డ పైకి లాగింది. బిడ్డ ఆరోగ్యం ఎలా ఉందో... ఒక్కసారి ఆ బిడ్డను చూడాలని... ఒక్కసారి తన వొడిలోకి తీసుకోవాలని అనుకున్నది ఆ అమ్మ. ఆ అమ్మ మరెవరో కాదు.. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సతీమణి డాక్టర్ సయ్యద్ అమ్రిన్. జనగాం జిల్లా, రఘునాథపల్లి మండలంలోని కిలాశాపూర్ గ్రామంలో 9 రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్ళిన నవజాత మగ శిశువు ప్రస్తుతం మహిళా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసిహెచ్), జనగాంలో వైద్య పర్యవేక్షణలో ఉన్న విషయం తెలిసిందే... శుక్రవారం రాత్రి ఆ పసి బిడ్డ ను చూడటానికి కలెక్టర్ దంపతులు ఎంసిహెచ్ ని సందర్శించారు. ఆ బిడ్డ ను చూడాలని ఆనాడే..కలెక్టర్ దంపతులు అనుకున్నప్పటికి.... అప్పుడే పుట్టిన బిడ్డ.. అందులోను.. ఎలాంటి కనీస వైద్యం అందని ఆ బిడ్డ కి ఇన్ఫెక్షన్ లు సోకే అవకాశాలు ఉన్న నేపథ్యంలో.. మెరుగైన వైద్యం అందిన తరువాత...శుక్రవారం రాత్రి బిడ్డ ను చూడటానికి కలెక్టర్ దంపతులు ఎంసిహెచ్ కి వచ్చారు. ముందుగా శిశువును కలెక్టర్ సతీమణి.. కాసేపు తన వొడిలోకి తీసుకోని లాలించింది. తాను కూడా ఒక చిన్నారి కి తల్లి కదా.. పసి బిడ్డ కి తల్లి అవసరం ఎంత అవసరమో తెలుసుకొని... బావోద్వేగానికి లోను అయ్యింది.. ఎంతో ముద్దుగా ఉన్న ఆ బిడ్డ ను చూసి.. ఓ పక్క సంతోషం తో.. మరో పక్క బాధతోనే...బిడ్డ కు తానే స్వయం గా అమ్మ గా పాలు తాపించింది.బిడ్డలు దేవుడు ఇచ్చే వరమని.. అలాంటి బిడ్డలను అనాధ గా వదిలి వెళ్లి పోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి, చికిత్సపరమైన వివరాలను డాక్టర్లు, వైద్య సిబ్బందితో కలెక్టర్ దంపతులు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఉయాల ను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ....పిల్లలను రహస్యంగా వదిలే అవసరం ఉంటే ' లిఉయాల'లోలి వదిలి వెళ్లాలని... వారి వివరాలను గొప్యంగా పెట్టడం జరుగుతుందని... అంతేగాని ఎక్కడ పడితే అక్కడ పసి బిడ్డలను వదలడం సమంజసం కాదన్నారు. ప్రతి జీవికి జీవించే హక్కు ఉంటుందని... పిల్లలు అవసరం లేని వాళ్ళు.. నవజాత శిశువులని ఊయలలో వదిలేయలని అధికారులు అక్కున చేర్చుకొని.. ప్రభుత్వం వారికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తుందన్నారు. అలాగే, ఎవరికైనా పిల్లల్ని అప్పగించాల్సిన పరిస్థితి ఉంటే, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ని సంప్రదించవచ్చని , చైల్డ్ హెల్ప్లైన్ 1098 లేదా www.cara.wcd.gov.in ద్వారా చట్టబద్ధమైన దత్తత ప్రక్రియను అనుసరించవచ్చని తెలిపారు. పిల్లలను అనధికారికంగా దత్తత ఇవ్వడం/తీసుకోవడం జువెనైల్ జస్టిస్ (కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) చట్టం - 2015 ప్రకారం నేరమని..ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై గరిష్ఠంగా 3 సంవత్సరాల జైలుశిక్ష లేదా రూ.1,00,000 జరిమాన విధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ డి. ఫ్లోరెన్స్, డా. యశ్వంత్ పెడియాట్రిషన్, నీలిమ నర్సింగ్ ఆఫీసర్ (ఎంసిహెచ్), డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రవికాంత్, చైల్డ్ హెల్ప్లైన్ ( 1098) ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రవికుమార్, ఎంసిహెచ్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అత్యవసరం

- నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా



నిర్మల్ బ్యూరో, జులై 26 (జనంసాక్షి) : నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతైనా అవసరం ఉందని ఏఎస్పీ రాజేష్ మీనా అన్నారు. శనివారం పట్టణంలోని మహాలక్ష్మి వాడ డబుల్ బెడ్ రూమ్ కాలనిలో కాంటాక్ట్ కమ్యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించమన్నారు. అనుమతులు లేకుండా నడుపుతున్న 70 ద్విచక్రవాహనాలు, 3 ఆటోమొబైల్ వాహనాలు స్వాధీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించామని తెలిపారు. సైబర్ నేరాలు, నిషేధిత మత్తు పదార్థాల వినియోగం, మద్యం సేవనం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి సామాజిక మలినతలపై విపులంగా వివరణనిచ్చారు.అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, పోలీస్ స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజలు భాగస్వాములయ్యారు.

# టెలిగ్రామ్ యాప్‌లో సైబర్ మోసం!

- బ్యాంక్ అకౌంట్ నుండి రూ.26 వేలు డ్రా...

చెన్నారావుపేట, జూలై 26 (జనంసాక్షి) : టెలిగ్రామ్ యాప్ లో సైబర్ మోసం ద్వారా బ్యాంకు అకౌంటు నుండి రూ.26 వేలు డ్రా అయిన సంఘటన మండలంలోని గురిజాల గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన ముచ్చింపుల అజయ్ కి టెలిగ్రామ్ యాప్ నుండి ఒక లింక్ మెసేజ్ వచ్చింది. రూ. 10వేలు పంపిస్తే అదనంగా రూ. 3వేలు కలిపి రూ. 13 వేలు పంపిస్తామని వచ్చింది. దీంతో అతను రూ.10 వేలు పంపించాడు. రూ.3 వేలు కలిపి రూ.13 వేలను సైబర్ నేరగాడు పంపించాడు. అరే అదనంగా రూ.3 వేలు వచ్చాయని మళ్లీ రూ.13 వేలు పంపిస్తే రూ.26 వేలు వస్తాయని మెసేజ్ పంపాడు. దీంతో మళ్లీ రూ.13 వేలు పంపాడు. పంపిన 13వేలతో పాటు అదనంగా మరో 13 వేలు మొత్తం రూ. 26 వేలు బ్యాంక్ అకౌంట్ నుండి కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో చేసేది ఏమీ లేక లబోదిబో అంటూ చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు వచ్చి బాధితుడు అజయ్ ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ రెడ్డి తెలిపారు.

# ఇలా అయితే ప్రయాణమెలా?



నూగూర్ వెంకటాపురం జూలై 26(జనం సాక్షి): మండలంలో ఇసుక లారీల వల్ల రోజు రోజుకు ప్రజలకు ప్రయాణం అంటేనే ప్రాణ సంకటంగా మారింది. ఇసుక కోసం క్వారీలకు వెళ్లె లారీల కోసమే రోడ్లు అన్నట్లుగా మారిపోతున్నాయి. లోడ్‌తో ఇసుక లారీలు వెళ్లడంతో రోడ్లపై భారీ గుంతలు ఏర్పడీ ప్రయాణం చేయడానికి తీవ్ర అంతరాయం కలుగుతుంది. దీనికి తోడు మరో వైపు ఏక్కడ పడితే అక్కడ లారీ డ్రైవర్లు లారీలను రోడ్ల మధ్యలో నిబందనలకు విరుద్ధంగా నిలిపి వేసి ప్రయాణికుల ప్రాణలతో చెలగాటం అడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం..

నిత్యం ఇసుక లారీల రాకపోకలతో రోడ్లపై ప్రయాణం చేయాలి అంటేనే భయంగా ఉంటుదని ప్రయాణికులు అంటున్నారు. తెలంగాణం రోడ్డుపై వెలుతున్న ఒక ప్రయాణికుడిని ప్రశ్నించగా.. రోడ్లపై లారీలు ఏక్కడ పడితే నిలిపివేయడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేయాలన్న ఇబ్బందిగా భయంగా ఉంటుదని తెలిపాడు. ఒక పక్క ఇసుక లారీలతో రోడ్లపై ఏర్పడిన భారీ గుంతలతోనే ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది కలుగుతుంటు మరో పక్క లారీలు రోడ్లపై నిలపడం అదీ కాక అధీక వేగంతో వస్తున్న ఇసుక లారీలను దాటి వెళ్లడం అంటేనే ప్రాణాలు అరచేతిలో పెట్టకోవాలసి వస్తుందని అవేదన వ్యక్తం చేశాడు.పదిటైర్లు, పన్నెండు టైర్ల ఇసుక లారీలు అధిక లోడుతో వెంకటాపురం మండలం నుండి వివిధ ప్రాంతాలకు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి.వీటి దెబ్బకు కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు, వంతెనలు ధ్వంసమైపోతున్నాయి. ఇసుక లారీలను చూసి ప్రజలు, ప్రయాణికులు భయపడిపోతున్నారాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

# సరిపడా మందుల నిల్వలు ఉంచుకోండి

- జిల్లా వైద్యాధికారి డాక్టర్ గోపాలరావు



ములుగు ప్రతినిధి, జులై 26(జనంసాక్షి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బండారుపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల చికిత్సకు సరిపడే మందులను నిల్వ ఉండేటట్లు చూసుకోవాలని, జ్వరంతో బాధపడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రతి వ్యక్తికి మలేరియా, డెంగ్యూ ఆర్డిటి టెస్టులతో పాటు రక్తపూత నమూనాలను కూడా తీసుకొని పరీక్షించాలని, నీటి నిల్వలలో దోమల లార్వాను గుర్తించి ఆ నీటిని తొలగించాలని, నీటి నిలువలపై మూతలు పెట్టుకోవాలని ఇంటి సందర్శన గావించి నప్పుడు ఆ ఇంటి యజమానికి అవగాహన కల్పించాలని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్



స్టేషన్ ఘన్ పూర్, జూలై 26 (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో వస్తున్న సాంకేతిక సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివా రం పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో వస్తున్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో జాబ్ కార్డు లేని లబ్ధిదారులు ఉన్నట్లయితే ఆయా కుటుంబాల నివేదిక అందజేయాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఇల్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించేందుకు ఈ డి ఎం వెళ్లాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో ఈ కేవైసీ సమస్యలు తోపాటు బ్యాంక్ అకౌంట్స్, ఉపాధి హామీ జాబ్ కార్డ్స్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకు రావాలని పరిష్కరించడం జరుగుతుందన్నారు.ఇండ్ల నిర్మాణాలలో క్లియరెన్స్ ఉన్న లబ్ధిదారులు ఇండ్ల ను నిర్ణీత వ్యవధిలో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా పూర్తి చేయాలని, అధికారులు కూడా క్షేత్రస్థాయిలో పర్యటిం చి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయశ్రీ, సూపరిండెంట్ కృష్ణ, ఎంపీఓ నర్సింగరావు, అధికారులు, గ్రామపంచాయతీ కార్య దర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలతో తాడిచర్ల ఓసిపీలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

- 30 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



మల్హర్, జూలై 26(జనంసాక్షి) : భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల కేంద్రమైన తాడిచర్ల లోని ఓసిపిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఓసి పనులు నిలిచిపోయాయి. రోజుకు 6000 మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, లక్ష క్యూబిక్ మీటర్ల ఓబి వెలికితీత పనులు సాగుతాయని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఓసీపీలోకి వరద నీరు వచ్చి చేరడంతో మైన్ ఆవరణ మొత్తం బురదమయం కావడంతో వాహనాలు కదలని పరిస్థితి నెలకొందని ఆరు రోజుల పాటు కురుస్తున్న వర్షాలకు 30వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని ప్రాజెక్టు వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ కెఎస్ఎన్ మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వేలికితీత పనులు సైతం నిలిచిపోయినట్లు వెల్లడించారు.

# సెక్రటేరియట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా సమీక్ష

- హాజరైన భూపాలపల్లి ఎమ్మెల్యే జీఎస్సార్



భూపాలపల్లి, జూలై 26 (జనం సాక్షి): హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి(ప్రజా వ్యవహారాల) సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వరంగల్ సీపీ, కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ. భూపాలపల్లి నియోజకవర్గంలో సింగరేణి, జెన్కో సంస్థల సీఎస్ఆర్ నిధులను విద్యాభివృద్ధి కోసమే కేటాయించాలని కోరారు. అదేవిధంగా, అనేక ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, టాయిలెట్స్ తదితర అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక విద్యతో పాటు ఇతర నైపుణ్యాలను విద్యార్థులకు పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
27 జూలై 2025

# న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి

- కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్‌ను బలోపేతం చేయాలి
- న్యాయవాదులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి.
- కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్
- కాంగ్రెస్ కార్యకర్తలకు లీగల్ సెల్ న్యాయ సహాయం అందించాలి
- నల్గొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి



**నల్గొండ బ్యూరో, జూలై 26 (జనం సాక్షి) :** న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ లీగల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అన్నారు. శనివారం నల్గొండ లోని రెవెన్యూ అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి నరసింహ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా పదవులు పొందిన న్యాయవాదులు పార్టీ కార్యకర్తలకు తప్పనిసరిగా న్యాయ సహాయం అందించాలని కోరారు. పదవి పూర్తయిన తర్వాత పార్టీని విస్మరించడం సరైన విధానం కాదన్నారు. అదేవిధంగా పార్టీలో పని చేసిన న్యాయవాదులకే పార్టీ పరంగా వచ్చే పదవులలో అవకాశం కల్పించాలని అన్నారు. త్వరలో జరగబోయే రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో అడ్వకేట్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ బిల్లు పాస్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది న్యాయవాదులంతా హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో సంవత్సరాల నుంచి న్యాయవాదులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి రావడంలో న్యాయవాదుల పాత్ర కూడా ఎంతో ఉందని తెలిపారు. న్యాయవాద వృత్తిలో ఎన్నో కష్టనష్టాలు ఉన్నాయని, వారి సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత పరంగా చేస్తున్న కార్యక్రమాలన్నింటికీ న్యాయవాదులంతా మద్దతుగా ఉన్నారని తెలిపారు. న్యాయ వాదుల రక్షణకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకోవాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ నల్గొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సహకారంతో పీపీలు అయిన వారు తర్వాత కార్యకర్తలకు సమస్యలు వచ్చినప్పుడు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టులలో పార్టీ పరంగా పదవి వచ్చినంత సేపు పార్టీలో ఉండి ఆ తర్వాత పార్టీని, కార్యకర్తలను పట్టించుకోకపోవడం సరైన విధానం కాదని సూచించారు. పార్టీ కార్యకర్తలు కోర్టు కేసులు ఎదుర్కొంటున్నప్పుడు వారికి న్యాయ సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, న్యాయవాది నాంపల్లి భాగ్య, ఏజీపీలు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, వీరయ్య, న్యాయవాదులు నామిరెడ్డి మోహన్ రెడ్డి, మెమీన్ రోషన్ జమీర్, ఉమా శంకర్, మేడ మోహన్ రెడ్డి, నఫీస్ ఫాతిమా, చక్రవర్తి ,పాశం నరేష్ రెడ్డి, మామిడి శ్రీను, వెంకటేశ్వర్ రెడ్డి ,ఈ.దేవా, బిక్షపతి గౌడ్, రాజకుమార్, పొన్నం రవీందర్ ,రత్నారెడ్డి, లుక్మాన్ అలీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం లీగల్ సెల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌ను జిల్లా లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## సీజనల్ వ్యాధుల చికిత్సలకు ముందస్తు ఏర్పాట్లు చేయాలి



**సూర్యాపేట ప్రతినిధి, జూలై 26 (జనంసాక్షి) :** సీజనల్ వ్యాధులకు సంబంధించి చేసే చికిత్సలకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులకు ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి అనిత రామచంద్రన్ ఆదేశించారు.సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా ఫార్మసీ స్టోర్ నందు డయేరియా మందులు, కుక్కలు, ఎలుకలు,పాములు కరిస్తే వేసే రేబిస్ లాంటి వాక్సిన్స్ ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.మందులు కావాలంటే ఎలా తెచ్చుకుంటారని అడగగా ఇంతకు ముందు నల్గొండ నుంచి వచ్చేవి అని, ఇటీవల సూర్యాపేట హాస్పిటల్ లో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుండి ఏర్పాటు చేసారని అక్కడ నుండి తెచ్చుకుంటామని సిబ్బంది వివరించారు.అనంతరం అత్యవసర వార్డు, ఫీవర్ వార్డు, మెడికల్ వార్డులకి వెళ్ళి పెషేంట్స్ కి అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు.సీజనల్ వ్యాధులకి సంబంధించిన ప్రత్యేక ఏర్పాట్లపై ఆర్ఎంఓ ప్రశాంతి ప్రత్యేక అధికారికి వివరించారు.టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓలు విజయ్, ప్రశాంతి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ యూరియాను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్గొండ బ్యూరో, జూలై 26 (జనంసాక్షి) :** సబ్సిడీ యూరియాను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు సంయుక్తంగా హెచ్చరించారు. శనివారం జిల్లా కలెక్టర్, ఎస్పీలు హైదరాబాద్ – విజయవాడ రహదారిపై నల్గొండ జిల్లా వెలిమినేడు వద్ద ఉన్న యాడ్ బ్లూ, డి ఇ ఎఫ్ సేల్ కౌంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ డిఇఎఫ్ లో కలుపుతున్న యూరియా ఎలా వస్తుందో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ సబ్సిడీ యూరియాను వ్యవసాయ పనులకు మాత్రమే వాడాలని, అలా కాకుండా ఇతర పనులకు వాడవద్దని, ఇండస్ట్రీలకు ఇండస్ట్రీ యూరియానే వాడాలని అన్నారు. జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముతున్న ఎరువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఎరువులను ప్రత్యేకించి యూరియాను పక్క దారి మళ్లిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ సబ్సిడీ యూరియాను రైతులు మాత్రమే వాడాలని, అలా కాకుండా పరిశ్రమలకు మళ్లించకూడదని, ఏదైనా పరిశ్రమ సబ్సిడీ యూరియాను వాడితే చట్ట పరంగా క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . యూరియాను వాడే అనుమానాస్పద ఇండస్ట్రీలన్నింటిపై పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఇండస్ట్రియల్ యూరియా కాకుండా, సబ్సిడీ యూరియాను వాడినట్లయితే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల విషయంలో జిల్లా వ్యాప్తంగా పోలీసు నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నారని, అంతేకాక చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, ఎస్పీలు సంయుక్తంగా చిట్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని ఎరువుల స్టాకును పరిశీలించారు. రికార్డులన్నింటినీ సక్రమంగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లో ఎరువులు దుర్వినియోగం కారాదని, ఒకవేళ అలా జరిగితే సంబంధిత సీఈఓ లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, చిట్యాల తహసిల్దార్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## 100 పడకల హాస్టల్ భవనాన్ని మైనార్టీలకే కేటాయించాలి

**తాండూరు, జూలై 26 (జనంసాక్షి) :** మైనార్టీ విద్యార్థులకు హైదరాబాద్ రోడ్ మార్గంలో 100 పడకల హాస్టల్ భవనాన్ని మైనార్టీలకే కేటాయించాలని సీఐటీయూ దళిత ప్రజాసంఘాల డిమాండ్ చేశారు.తాండూర్ పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహాబ్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు హైదరాబాద్ రోడ్ మార్గంలో మైనారిటీల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా నిర్మించబడిన 100 పడకల హాస్టల్ భవనాన్ని గతంలోనే కేటాయించినా, దురదృష్టవశాత్తు గత ప్రభుత్వాలు దీనిని మైనారిటీ విద్యార్థుల కోసం వినియోగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. ప్రతి ఎన్నికల సమయంలో ఈ హాస్టల్ భవనాన్ని తాత్కాలికంగా ఎన్నికల ముందు పోలీస్ శాఖకు వినియోగించేందుకు కేటాయించడం జరిగింది.ఇది మైనార్టీల పట్ల అన్యాయంగా మారింది.ఇప్పుడు మళ్ళీ తాజా ప్రభుత్వానికి వచ్చిన తర్వాత కూడా అట్టి హాస్టల్ భవనాన్ని మైనార్టీల అవసరాలను పరిగణనలోకి తీసుకోకుండా, మెడికల్ కాలేజీకి కేటాయించినట్లు సమాచారం అందుతోంది. ఇది మైనార్టీల హక్కులను పూర్తిగా విస్మరించిన చర్యగా మేము భావిస్తున్నాం.తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి తరపున మేము ప్రభుత్వాన్ని బహిరంగంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. తాండూర్ రాజీవ్ కాలనీలోని 100 పడకల హాస్టల్ భవనాన్ని మళ్లీ మైనారిటీ విద్యార్థుల అవసరాలకే కేటాయించాలి.తక్షణమే మైనారిటీ విద్యార్థులకు ఉచిత వసతి సౌకర్యం కల్పించేందుకు హాస్టల్



ప్రారంభించాలి. మైనారిటీలకు కల్పించాల్సిన విద్యా, వసతి హక్కుల్ని పరిరక్షించే చర్యలు తీసుకోవాలి.ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే, మేము తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి, సీఐటీయూ, దళిత, ప్రజాసంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, టిఎస్.ఎం.హెచ్.పి.ఎస్ తాండూర్ పట్టణ అధ్యక్షులు సాదిక్, ఎస్సీ, ఎస్టీ, బిసి, హక్కుల పోరాట సమితి అధ్యక్షులు కే. చెంద్రయ్య, మైనారిటీ నాయకులు అంజాద్, జాకీర్, యంఆర్ పిఎస్ తాండూర్ పట్టణ అధ్యక్షులు బలరాం, కార్యదర్శి రవి, దళిత నాయకుడు వై. రాములు పాల్గొన్నారు.

## అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

- 90 లక్షల విలువైన 4కార్లు 15 బైకులు స్వాధీనం చేసుకున్న పోలీసులు



**కల్లూరు, జూలై 26 (జనం సాక్షి) :** ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలో సామాన్యుల అవసరాలను ఆసరాగా చేసుకొని అక్రమంగా వాహనాలు తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలు వసూలు చేస్తూ బాధితులనుపీడిస్తున్న కల్లూరు పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ హబీబ్ అలియాస్ వడ్డీల బాబా పై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అతని వద్ద నుంచి90 లక్షల విలువైన నాలుగు కార్లు, 15 బైకులు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఏసీపి అని శెట్టి రఘు తెలిపిన వివరాలు ప్రకారం... కల్లూరు పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ యండి హబీబ్ అలియాస్ వడ్డీల బాబా ఎటువంటి అనుమతులు లేకుండా సామాన్య ప్రజల ఆర్థిక అవసరాలను అవకాశముగా మలుచుకొని అక్రమంగా వాహనాలు తాకట్టు పెట్టుకొని అధిక వడ్డీలు(పది రూపాయలు చొప్పున) తీసుకుంటూ వడ్డీ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ముందుగా మాట్లాడుకున్న నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు తాకట్టు పెట్టిన వారిని మోసగిస్తూ పీడిస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు కల్లూరు ఎస్సై డి హరిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఎండి హబీబ్ ఇంటిని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగిందన్నారు.అతడి ఇంటివద్ద తాకట్టు పెట్టుకున్న 15 ద్విచక్ర వాహనములు, 4 కార్లు 90 లక్షల విలువ కలిగిన వాటిని జప్తు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అదిక వడ్డీ లకు తాకట్టు వ్యాపారములు చేయడం నేరం కాబట్టి సదరు మహమ్మద్ హబీబ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు .కల్లూరు మండలములో ఎవరైనా ప్రబుత్వ అనుమతులు లేకుండా అదికవడ్డీలకు తాకట్టు వ్యాపారములు చేయువారు ఉంటే సమాచారం ఇవ్వాలని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడుతాయి అని తెలిపారు. అధిక వడ్డీ వ్యాపారస్తుల సమాచారం ఇచ్చిన వారి వివరములు గోప్యముగా ఉంచబడుతాయి అని కల్లూరు ఏసిపి రఘు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న వాహనాలను ఏసీపీ రఘు సీఐ ముత్తు లింగయ్య స్థానిక ఎస్సై డి హరిత, పోలీస్ సిబ్బందితో కలిసి ప్రదర్శించారు.

## విద్య ద్వారా మాత్రమే పేదరికం నిర్మూలన సాధ్యం

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- సిరిసిల్ల జిల్లా కలెక్టర్ పని తీరు ప్రశంసించిన బీసి, రవాణా శాఖ మంత్రి

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, జూలై 26 (జనం సాక్షి) :** విద్య ద్వారా మాత్రమే పేదరికంను నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.ఇల్లంతకుంట మండలం రహింఖాన్ పేట గ్రామంలో తెలంగాణ మోడల్ స్కూల్ లో ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ తరగతులను స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ప్రారంభించారు. మాడల్ స్కూల్ లో విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే మ్యాథ్స్, తెలుగు, అకౌంటింగ్ ఇంగ్లీష్ పాఠాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి నుండి సమాధానాలు రాబట్టారు.కిచెన్ షెడ్డు ను పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం రుచిగా వండి వడ్డించాలని తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఏ జిల్లాలో లేనివిధంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలెక్టర్ చొరువతో ప్రత్యేకంగా ఆన్ అకాడమీ ద్వారా ఆన్ లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారని తెలుసుకున్న బీసి రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్ సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ను ఫోన్ ద్వారా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ విద్య ద్వారా మంచి శిక్షణ ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆన్ లైన్ తరగతుల్లో దేశంలోని నిపుణులైన టీచర్లచే పిల్లలకు బోధన జరుగుతుందని, ఢీల్లీ లో విద్యార్థులకు అందే శిక్షణ నేడు సాంకేతికతను వినియోగించుకుని మన సిరిసిల్ల జిల్లాలోని పిల్లలకు కూడా అందిస్తున్నామని అన్నారు. ప్రతి రోజు కనీసం 2 గంటల పాటు ఆన్ లైన్ కోచ్చింగ్ తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ముఖ్యమైన పాఠ్యాంశాలలో బేసిక్స్ ఇంటర్ లో ప్రారంభం అవుతాయని అన్నారు. ఆన్ లైన్ తరగతులలో మన సందేహాలను నివృత్తి చేసుకునే అవకాశం ఉందని, ప్రతి విద్యార్థి తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకుని వస్తే సత్వరమే




పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఆన్ లైన్ తరగతులు శిక్షణ సౌకర్యం విద్యార్థుల సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ పేదల విద్యకై నిరంతరం కృషి చేస్తూ పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. సిరిసిల్ల జిల్లాలో పిల్లలకు ఆన్ లైన్ తరగతుల ద్వారా ప్రవేశ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందించేందుకు కలెక్టర్ ప్రత్యేక చోరువ చూపారని అన్నారు. మోడల్ స్కూల్లో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మోటర్ సమస్య ఉందని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకొని రాగా, అవసరమైన 1.5 హెచ్.పి మోటర్, ఇతర అవసరాలకు, మరమ్మతులకు, సమస్యలు పరిష్కారానికి నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం దివ్యాంగుల ఆర్థిక పునరావాసం క్రింద డి.భాగ్యలక్ష్మి , ఇల్లంతకుంట బ్యాంగిల్ స్టోర్స్ కంగన్ హాల్ పెట్టుకోవడం కోసం రూపాయలు 50,000 నాన్ బ్యాంకింగ్ 100% సబ్సిడీతో కూడిన లోన్ మంజూరు చేసి చెక్ అందచేసారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్ జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తాసిల్దార్ ఎంపీడీవో కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బైక్ దొంగల ముఠా అరెస్ట్

- 16 బైకుల స్వాధీనం

**శేరిలింగంపల్లి, జూలై 26 (జనంసాక్షి) :** జల్సాలకు అలవాటు పడి సులభమైన మార్గంలో డబ్బులు సంపాదించడానికి బైకులను దొంగిలించడాన్ని వృత్తిగా మార్చుకున్న ఏడుగురు సభ్యుల ముఠాను మియాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు మియాపూర్ ఏసిపి వివరించిన వివరాల మేరకు ప్రధాన నిందితుడైన షేక్ సోహెల్, షేక్ అహ్మద్, సల్మాన్ ఖాన్, సహాయల్ అలీ, కిస్మత్ అలీ బాధ్యతలను విస్మరించి పూర్తిగా జులాయిగా తిరుగుతూ వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఈ క్రమంలో మద్యానికి, గంజాయి సేవించడానికి కావాల్సిన డబ్బులు సులువైన మార్గంలో సంపాదించడానికి బైకు దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నారు. అయితే ఏ1 ముద్దాయి షేక్ సోహెల్ కామారెడ్డి జిల్లాలో ఇప్పటికే పాత నేరస్తుడిగా పలు బైకు దొంగతనాలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అయినా అతని ప్రవర్తనలో ఏమాత్రం మార్పు లేదని బయటకు వచ్చిన వెంటనే ఈ ముఠాలోని ఐదుగురు సభ్యులతో పాటు షేక్ అర్మాన్, అల్మాస్ షేక్ లతో కలిసి తరచుగా బైకు దొంగతనాలకు పాల్పడుతూనే ఉంటారు. కాగా గత నెల 16న పుల్యాల ఉమా శంకర్ అనే వ్యక్తి ఈ ఏడాది ఏప్రిల్ 5న తన ఇంటి ముందు టీఎస్ 07 హెచ్ఎస్ 1746 నెంబర్ గల రాయల్ ఎన్ఫీల్డ్ వాహనాన్ని పార్క్ చేయగా తెల్లవారిసరికి అది కనిపించలేదని ఎన్ని రకాలుగా ప్రయత్నించిన ఆచూకీ లభించకపోవడంతో మియాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కేసును సవాల్ గా స్వీకరించిన మియాపూర్ పోలీసులు డిసిపి డాక్టర్ జి. వినీత్ పర్యవేక్షణలో మాదాపూర్ జోన్ అడిషనల్ డిసిపి ఉదయ్ కుమార్ రెడ్డి, మియాపూర్ ఏసిపి సిహెచ్. వై శ్రీనివాస్ కుమార్ సమక్షంలో మియాపూర్ ఎస్హెచ్ఓ పి. శివప్రసాద్ బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఫిర్యాదుల తీరుతెన్నులను పరిశీలించి పక్కా ప్రణాళికతో స్కెచ్ వేసి నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ఇందులో ఏ2



సహాయల్ అలీ, ఏ5 కిస్మత్ అలీ పరారీలో ఉన్నారని మియాపూర్, కెపిహెచ్బి, కామారెడ్డి, ఆసిఫ్ నగర్, ఎల్బీనగర్, పటాన్చెరువు, చందానగర్, రామచంద్రాపురం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు బైక్ దొంగతనాలకు పాల్పడడం జరిగిందని, వారిపై అనేక కేసులు నమోదయి ఉన్నాయని తెలిపారు. నిందితుల వద్ద నుండి సమాచారాన్ని సేకరించి ఇప్పటికే 16 బైకులను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, పరారీలో ఉన్న నిందితులను సైతం త్వరలోనే అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయి విచారణను చేపట్టి కేసు నిజాలను నిగ్గు తేలుస్తామన్నారు.

## రాజాపూర్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంను సస్పెండ్ చేసిన డీఇఓ




**రాజాపూర్, జూలై 26 (జనంసాక్షి) :** రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు బాండేకర్ శ్రీనివాస్ రావు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని, గత రెండు సంవత్సరాలుగా విద్యార్థినులను ఒకలా, బాలురను ఒకలా చూసేవాడని, శ్రీనివాస్ వికృత చేష్టలు భరించలేని విద్యార్థులు ఏబీవీపీ కార్యకర్తల సహకారంతో ఎంఇఓ సుధకార్‌కు రాజాపూర్ జడ్పీహెచ్ఎస్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ను వెంటనే విధుల నుండి తొలగించి విచారణ చేపట్టాలని, అతని వికృత చేష్టలకు తగిన శిక్ష పడేల చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. శ్రీనివాస్ ను సస్పెండ్ చేయాలని పాఠశాల గేటు ముందు ఏబీవీపీ కార్యకర్తలు, విద్యార్థులు కొంత సమయం ధర్నా నిర్వహించారు. ఎంఇఓ సుధకార్ విద్యార్థుల పిర్యాదు ను మహబూబ్ నగర్ జిల్లా డీఇఓ ప్రవీణ్ కుమార్ కు వివరించడంతో వెంటనే రాజాపూర్ జడ్పీహెచ్ఎస్ ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ ను సస్పెండ్ చేసిన డీఇఓ ప్రవీణ్ కుమార్.




# రిటైల్ స్థలాల్లోనూ హైదరాబాద్ టాప్

## నగరంలో ప్రముఖ హాట్‌స్పాట్లుగా బాచుపల్లి, కొంపల్లి




**హైదరాబాద్‌లో ఇళ్లు, కార్యాలయ స్థలాలకే కాదు రిటైల్ స్పేస్‌కు కూడా డిమాండ్ అధికంగానే ఉంది. ఈ ఏడాది రెండో త్రైమాసికం (క్యూ2)లో దేశంలోనే అత్యధిక రిటైల్ స్పేస్ లీజులు మన దగ్గరే ఎక్కువగా జరిగాయి. 2025 క్యూ2లో 8 లక్షల చ.అ. స్థల లావాదేవీలు పూర్తయ్యాయని, దీంతో కలిపి ఈ ఏడాది తొలి అర్ధ సంవత్సరం (హెచ్1)లో నగరంలో 15 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లీజులు జరిగాయని కుష్మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది.**

**జనంసాక్షి:**గతేడాది హెచ్1తో పోలిస్తే ఇది 11 శాతం అధికం. 2027 నాటికి నగరంలోకి 28 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ సరఫరా అవుతుందని, ఇందులో వచ్చే రెండు త్రైమాసికాలంలో సుమారు 17 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ వినియోగంలోకి కూడా వస్తుందని అంచనా వేసింది. - సాక్షి, సిటీబ్యూరో ఫుడ్ అండ్ బేవరేజెస్(ఎఫ్అండ్‌బీ) బ్రాండ్లు ఎక్కువగా రిటైల్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నాయి. ఈ విభాగం వాటా 34 శాతంగా ఉండగా.. ఫ్యాషన్ బ్రాండ్ల వాటా 14 శాతంగా ఉంది. ఈ క్యూ2లో కొత్తగా గ్రేడ్-ఏ మాల్స్ సరఫరా జరగకపోవడంతో మాల్స్‌లో వేకన్సీ రేట్ 1.85 శాతంగా ఉంది. ఇక, హై స్ట్రీట్ ప్రాంతాలలో రిటైల్ స్పేస్ అద్దెలకు ఆదరణ ఎక్కువగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జూబ్లీహిల్స్ వంటి హై స్ట్రీట్‌లో అద్దెలు 13.6 శాతం మేర పెరిగాయి. అత్తాపూర్, మదీనాగూడ, చందానగర్ ప్రాంతాల్లోనూ రిటైల్ అద్దెలు ఆశాజనకంగానే వృద్ధి చెందుతున్నాయి. ఈ ఏడాది రెండో త్రైమాసికం(క్యూ2)లో దేశంలోని 8 ప్రధాన నగరాలలో 22.4 లక్షల చ.అ. రిటైల్ స్పేస్ లావాదేవీలు పూర్తయ్యాయి. గతేడాది క్యూ2లో జరిగిన 23.9 లక్షల చ.అ. జరిగాయి. ఈ ఏడాది క్యూ1లో 23.7 లక్షల చ.అ.లు జరిగాయి. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ వంటి హైస్ట్రీట్ ప్రాంతాలలో రిటైల్ స్పేస్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంది. 89 శాతం లీజులు ఈ ప్రాంతాల్లోనే జరిగాయి. బాచుపల్లి, కొంపల్లి ప్రాంతాలు రిటైల్ స్పేస్‌కు హాట్ స్పాట్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ క్యూ2లో ఈ ప్రాంతాలలో 57 శాతం లీజులు జరిగాయి. అమీర్‌పేట, నిజాంపేట ప్రాంతాలలో 43 శాతం రిటైల్ స్పేస్ లీజులు పూర్తయ్యాయి.

### హాట్‌కేకుల్లా అమ్ముడుపోయే ఫ్లాట్లు..

ప్రతికూల పరిస్థితుల్లోనూ హాట్‌కేకుల్లా ఫ్లాట్లు అమ్ము డుపోవాలంటే.. పునాదుల్లోనే సగానికిపైగా అమ్మకా లు జరగాలంటే.. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఏడాదిలో గృహ ప్రవేశం చేయాలంటే.. వీటిన్నింటికీ ఒకే సమాధానం చిన్న ప్రాజెక్టులు. నిజం చెప్పాలంటే చిన్న ప్రాజెక్టులు విస్తీర్ణంలోనే చిన్నవి.. వసతుల్లో మాత్రం పెద్ద ప్రాజెక్టులకు ఏమాత్రం తీసిపోవు. పైపెచ్చు అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఉండటం చిన్న ప్రాజెక్టులకు మరింత కలిసొచ్చే అంశం. బడా ప్రాజెక్టులు నిర్మించాలంటే రూ.కోట్లలో పెట్టుబడి కావాలి. అమ్మకాలు బాగుంటే పర్వాలేదు.. కానీ, సీన్ రివర్స్ అయ్యిందో ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడం కష్టం. దీంతో అటు కొనుగోలుదారులు, ఇటు నిర్మాణ సంస్థలకూ తలనొప్పే. ప్రతికూల పరిస్థితుల్లో గొప్పకు పోయి పెద్ద మొత్తంలో బ్యాంకు రుణాలు తెచ్చి ప్రాజెక్ట్‌లు ప్రారంభించి అమ్మకాలు లేక బోర్డు తిప్పేసిన సంస్థలు అనేకం. అందుకే ఎలాంటి పరిస్థితుల్లోనైనా హాట్‌కేకుల్లా ప్రాజెక్ట్ అమ్ముడుపోవాలంటే చిన్న ప్రాజెక్ట్‌లే మేలని సూచిస్తున్నారు నిపుణులు. కొద్దిపాటి పెట్టుబడితో ప్రాజెక్ట్‌ను ప్రారంభించి.. పునాదుల్లోనే సగానికి పైగా అమ్మకాలు చేసుకునే వీలుంటుంది కూడా. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లో కొద్ది పాటి స్థలంలోనే చిన్నపాటి నిర్మాణాలు చేపడుతున్నాయి నిర్మాణ సంస్థలు. అప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతం కావడం, ఆధునిక వసతులూ కల్పిస్తుండటంతో కొనుగోలుదారులూ వీటిల్లో ఫ్లాట్లు కొనేందుకు ముందుకొస్తున్నారు.





## ఈ బుల్లి కారు.. ఇక మరింత ప్రియం



**జనంసాక్షి:**బుల్లి ఎలక్ట్రిక్ కారు 'ఎంజీ కామెట్ ఈవీ' ధరలను ఎంజీ మోటార్ మరోసారి పెంచింది. ఈ ఏడాదిలో మైక్రో ఎలక్ట్రిక్ హ్యాచ్ కారు ధరల సవరణ ఇది మూడోసారి. తాజా అప్‌డేట్‌లో రూ .15,000 వరకు పెరగడంతో, కామెట్ ఈవీ ధరలు ఇప్పుడు రూ .7.50 లక్షలు (ఎక్స్-షోరూమ్, బ్యాటరీ కలిపి) నుండి ప్రారంభమవుతాయి. బ్యా టరీ యాజ్ ఎ సర్వీస్ (బీఏఎస్) మోడల్ కింద కామెట్ ఈవీ ధర రూ.4. 99 లక్షల (ఎక్స్-షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. బీఏఎస్ మాడ్యూల్ ప్రకారం బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ ధరలను కిలోమీటరుకు రూ.2.9 నుంచి రూ.3.1కి పెంచారు. ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సమయంలో కామెట్ ఈవీ బ్యాటరీ అద్దె కిలోమీటరుకు రూ.2.50గా ఉండేది. కామెట్ ఈవీ ఎగ్జిక్యూటివ్, ఎక్సైట్, ఎక్స్ క్లూజివ్, బ్లాక్ స్టార్మ్ ఎడిషన్ అనే నాలుగు వేరియంట్లలో లభిస్తుంది. ధర పెరగడం మినహా కామెట్ ఈవీలో ఇతర మార్పులేమీ లేవు. ఫీచర్ల విషయానికి వస్తే, కామెట్ ఈవీ టచ్‌స్క్రీన్ ఇన్ఫో టైన్మెంట్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌తో డ్యూయల్ 10.25-అంగుళాల స్క్రీన్లను కలిగి ఉంది. వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లే, మాన్యువల్ ఏసీ, ఎలక్ట్రికల్ ఫోల్డబుల్ అవుట్‌సైడ్ రియర్ వ్యూ మిర్రర్స్, కీలెస్ ఎంట్రీ, పవర్ విండోస్, 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్ ఉన్నాయి.
డ్యూయల్ ఫ్రంట్ ఎయిర్ బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ నాలుగు డిస్క్ బ్రేకులు, హిల్ హెల్డ్ అసిస్ట్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్, రివర్స్ పార్కింగ్ కెమెరా, సెన్సార్లు, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ వంటి ఫీచర్లు ఇందులో ఉన్నాయి. కోమెట్ ఈవీలో 17.4 కిలోవాట్ల బ్యాటరీ ప్యాక్ ఉంది. ఇది వెనుక యాక్సిల్‌పై అమర్చిన ఎలక్ట్రిక్ మోటారుకు శక్తిని అందిస్తుంది. ఇది 41 బిహెచ్‌పీ, 110 ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. ఈ కారు ఒక్కసారి ఛార్జ్ చేస్తే 230 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. గరిష్ట వేగం గంటకు 85 కిలోమీటర్లు. 7.4 కిలోవాట్, 3.3 కిలోవాట్ల ఛార్జర్లతో 0 నుండి 100 శాతం ఛార్జ్ సమయం వరుసగా 3.5 గంటలు, ఏడు గంటలు పడుతుంది.

## టెక్నాలజీ అందుబాటులోకి తీసురావడమే లక్ష్యం



**జనంసాక్షి** రిలయన్స్ రిటైల్ ఇటీవల ఎలక్ట్రోలక్స్ గ్రూప్ కన్స్యూమర్ డ్యూరబుల్స్ బ్రాండ్ కెల్వినేటర్ కొనుగోలు డీల్‌పై కంపెనీ రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ స్పందించారు. కంపెనీ ఉత్పత్తుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రతి వినియోగదారుడి విభిన్న అవసరాలను తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 'కెల్విసేటర్ కొనుగోలు కంపెనీ అభివృద్ధికి ఒక కీలక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది భారతీయ వినియోగదారులకు నమ్మకమైన ప్రపంచ ఆవిష్కరణలను అందుబాటులోకి తీసుకురావడానికిక వీలు కల్పిస్తుంది. దానికి కంపెనీ మార్కెట్ లీడింగ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఎంతో తోడ్పడుతుంది' అని ఇషా చెప్పారు. ఈ డీల్ విలువ సుమారు రూ.160 కోట్లు. దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రీమియం గృహోపకరణాల విభాగంలో కార్యకలాపాలు మరింతగా విస్తరించేందుకు రిలయన్స్ రిటైల్‌కి ఇది ఉపయోగపడనుంది. రిలయన్స్ రిటైల్ గతంలో కెల్విసేటర్ బ్రాండ్‌కి లైసెన్సు తీసుకుని, ఉపయోగించుకుంది. దీని కింద ఫ్రిజ్‌లు, ఏసీలు, వాషింగ్ మెషిన్లు మొదలైనవి అమ్ముడవుతున్నాయి.

## పొదుపే కాదు.. వీటిపైనా ఖర్చు చేయాలి: రాధికా గుప్తా సలహా



**జనంసాక్షి:**జీవితం అంటే పొదుపు చేయడమే కాదు.. ఖర్చు పెట్టడమూ అవసరమే అంటున్నారు ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా వ్యక్తిగత ఆర్థిక క్రమశిక్షణ అత్యవసరమే అయినప్పటికీ.. కొన్నిసార్లు చిన్న చిన్న ఆనందాల కోసం వెచ్చించాలని చెప్పారు. అప్పుడే జీవన ప్రయాణానికి నిజమైన అర్థం లభిస్తుందన్నారు.."నా కలను సా కారం చేసుకునేందుకు ప్రయాణం ప్రారంభించాను. ఇప్పుడు నా హృ దయం ఆనందంతో నిండిపోయింది. కష్టపడటంలో ఉండే మాధుర్యమే ప్రత్యేకం. సిప్ లు చేయండి అని చెప్పడం నా వృత్తే కాదనను.. కానీ, చిన్నాపెద్దా తేడా లేకుండా అందరికీ నేనో విషయం చెబుతాను. కష్టపడటం వల్ల మీకు అందిన ఫలాలను ఆస్వాదించడానికి సమయం కేటాయిం చుకోండి. పొదుపు చేయడం ముఖ్యమే.. కానీ ఖర్చు చేయడమూ అవసరమే. మీకు సంతోషానిచ్చే వాటిపై వెచ్చించినప్పుడే జీవిత ప్రయాణానికి అర్థం ఉంటుంది. పరిపూర్ణమైన జీవితం అనేది ఎవరు ఎక్కువ ఆస్తులు సంపాదించారని లెక్కగట్టే రేస్ కాదు. ఎవరు ఎంత ఆనందంగా జీవించారన్న దానిపై ఆధారపడి ఉంటుంది. వ్యక్తిగత ఆనందం మధ్య సమతుల్య ప్రయాణం ఎప్పటికీ మంచిదే" అని అన్నారు

# అమెరికన్ల చేతిలో మన ఫోన్లు..

### ఇన్నేళ్ల చైనా ఆధిపత్యానికి గండి!



**జనంసాక్షి** స్మార్ట్‌ఫోన్ల తయారీలో భారత్ దూసుకెళుతోంది. పీఎల్ఐ స్కీమ్ కారణంగా దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరింది. అగ్రరాజ్యం అమెరికాలోనూ నేడు మేడిన్ ఇండియా ఫోన్లు పెద్దఎత్తున దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఐదు నెలల కాలానికి ఆ దేశ స్మార్ట్‌ఫోన్ల దిగుమతుల్లో మన వాటా 36 శాతానికి చేరింది. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరి వద్ద దేశీయంగా తయారైన ఫోన్లు ఉంటున్నాయన్నమాట. గతేడాది ఈ వాటా 11 శాతంగా ఉంది. అదే సమయంలో 82 శాతంగా ఉన్న చైనా మార్కెట్ వాటా 49 శాతానికి తగ్గింది. ఆ మేర డ్రాగన్ ఆధిపత్యానికి గండి పడింది. అమెరికా ఇంటర్నేషనల్ ట్రేడ్ కమిషన్ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి- మే నెల మధ్య కాలంలో 21.3 మిలియన్ యూనిట్ల స్మార్ట్‌ఫోన్లను భారత్ అమెరికాకు ఎగుమతి చేసింది. 9.35 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను అగ్రరాజ్యానికి భారత్ ఎగుమతి చేసింది. మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల్లో విలువ పరంగా స్మార్ట్‌ఫోన్లదే అగ్రస్థా నం కావడం విశేషం. అమెరికాకు ఇప్పటికీ అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేస్తున్నది చైనానే అయి నప్పటికీ.. ఆ దేశ దిగుమతులు క్రమంగా క్షీణిస్తు న్నాయి. ఈ ఏడాది జనవరి- మే మధ్య 29.4 మిలియన్ యూనిట్లను ఆ దేశం అమెరికాకు ఎగుమతి చేసింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య 27 శాతం తగ్గడం గమనార్హం. మొత్తంగా 10 బిలియన్ డాలర్ల విలువైన స్మార్ట్‌ఫోన్లను ఎగుమతి చేసింది. ప్రస్తుతం చైనా 49 శాతం వాటాతో అగ్రస్థానంలో ఉండగా.. భారత్ 36 శాతం వాటాతో రెండో స్థానంలో ఉంది. వియత్నాం 14 శాతం మార్కెట్ వాటాతో మూడో స్థానంలో నిలిచింది. అమెరికాకు ఎగుమతి అవుతున్న స్మార్ట్‌ఫోన్లలో అత్యధికం యాపిల్‌వే. 2020 వరకు స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి విషయంలో చైనా పైనే అధికంగా ఆధారపడిన యాపిల్.. ఆ తర్వాత తన పంథాను మార్చుకుంది. భారత్ తయారీని ప్రారంభించింది. ముఖ్యంగా ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం గేమ్ ఛేంజర్‌గా నిలిచింది. తొలుత కేవలం పాత మోడళ్లు మాత్రమే ఉత్పత్తి చేసే యాపిల్.. ఇప్పుడు ప్రో మోడళ్ల తయారీనీ దేశంలోనే చేపడుతోంది. ట్రంప్ వద్దన్నా: భారత్‌లో యాపిల్ ఫోన్ల తయారీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తప్పుబడుతున్నారు. ఐఫోన్లను అమెరికాలోనే తయారుచేయాలని, లేదంటే 25 శాతం సుంకం విధిస్తానని అప్పట్లో యాపిల్ సీఈఓ టిమ్ కుక్‌ను ట్రంప్ ఓవిధంగా బెదిరించారు. అయినప్పటికీ.. యాపిల్ మాత్రం దేశీయంగా తయారీకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఫాక్స్‌కాన్ ఇప్పటికే దేశీయంగా ఐఫోన్లను తయారు చేస్తుండగా.. తమిళనాడులో ప్లాంట్ ఏర్పాటుకు మరో 1.49 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఫాక్స్‌కాన్ లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీకి ఈ ఏడాది మేలో తెలియజేసింది. తన కాంట్రాక్ట్ మానుఫ్యాక్చరర్ల ద్వారా ఇండియాలో తయారీకే యాపిల్ ఇప్పటికీ జైకొడుతోంది.



## 'దేశానికి రక్షణ కల్పించండి.. మీ సమస్యలతో మేం పోరాడుతాం'

- నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్
- 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన 2025' ప్రారంభం
- భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా సైనికుల కుటుంబాలకు న్యాయసహాయం అందించనున్నారు.

**జనంసాక్షి:**'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన 2025' పేరుతో ఈ కొత్త కార్యక్రమం ద్వారా భారతీయ సైనికులకు సాయం చేయనున్నారు. సొంత ఊళ్లకు దూరంగా దేశం కోసం సేవలందిస్తున్న సైనికులు, తమ కుటుంబ సభ్యులు కొన్నిసార్లు స్థానికంగా న్యాయపరమైన వివాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దాంతో దేశం కోసం సుదూర ప్రాంతాల్లో పోరాడుతున్న సైనికులు స్వగ్రామాలకు రావడం కష్టంగా మారుతుంది. అలాంటివారికి, తమ కుటుంబ సభ్యులకు న్యాయసేవ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ శ్రీనగర్‌లో జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ సదస్సులో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ తర్వాత ఈమేరకు నిర్ణయం తీసుకోవడం సైనికులకు ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని నమ్ముతున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో సాయుధ దళాలు చేసిన త్యాగాలను చూసి తీవ్రంగా చలించిపోయానని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. న్యాయవ్యవస్థ వారి శ్రేయస్సుకు మరింత ప్రత్యక్షంగా దోహదపడే మార్గాలను అన్వేషిస్తుందన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. సైనికులు విధుల్లో ఉన్నప్పుడు అపరిష్కృత ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఇతర చట్టపరమైన విషయాల నుంచి ఉపశమనం కలిగించేలా న్యాయసేవ అందిస్తారు. సైనికులు వృత్తిపరమైన కారణాలతో కోర్టుకు హాజరు కాలేకపోయినా, కోర్టులో కుటుంబాలకు ప్రాతినిధ్యం వహించడానికి నల్సా రంగంలోకి దిగుతుంది. ఇండియన్ ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఇతర పారామిలటరీ బలగాలు దీని పరిధిలోకి వస్తారు. ప్యానెల్ లాయర్లు, పారాలీగల్ వాలంటీర్లకు సులభంగా అందుబాటులో ఉండేలా రాష్ట్రాల్లోని సైనిక్ వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేస్తారు. కేసు పురోగతిని పర్యవేక్షించడానికి, సకాలంలో పరిష్కారాన్ని నిర్ధారించడానికి వీరు తోడ్పాటు అందిస్తారు.

## యాదాద్రి జిల్లాలో రోడ్డు ప్రమాదం..

### ఇద్దరు ఏపీ డీఎస్పీలు మృతి

**చౌటుప్పల్(జనంసాక్షి):** యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపూర్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు ఇద్దరూ ఏపీకి చెందిన డీఎస్పీలు చక్రధర్‌రావు(57), శాంతారావు(54)గా గుర్తించారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న స్కార్పియో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి.. రోడ్డు అవతలివైపు పడింది. అటుగా వస్తున్న లారీ.. స్కార్పియోను ఢీకొట్టడంతో వాహనం ముందు భాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వాహనంలో ఇరుక్కుపోయిన మృత దేహాలను బయటకు తీశారు. మృతులిద్దరూ ఇంటెలిజెన్స్ అండ్ సెక్యూరిటీ వింగ్‌లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. ప్రమాదంలో ఏఎస్పీ కోకా రామ్ ప్రసాద్, డ్రైవర్ నర్సింగరావుకు తీవ్ర గాయాలయ్యాయి. నర్సింగరావును ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదనపు ఎస్పీ రామ్‌ప్రసాద్‌కు పక్కటెముకలు, కాలు ఫ్రాక్చర్ అయింది. నర్సింగరావు భుజం ఫ్రాక్చర్ అయిందని, ఇద్దరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. డ్రైవర్ పక్కన కూర్చుని సీట్ బెల్ట్ పెట్టుకోవడంతో రామ్‌ప్రసాద్‌కు ప్రాణాపాయం తప్పింది. విధినిర్వహణలో భాగంగా విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై ఏపీ మంత్రి అనిత, రామ్‌ప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# కొనసాగుతోన్న సోదాలు..



**జనంసాక్షి:**అనిల్ అంబానీ ఆఫీసుల్లో పలు దస్త్రాలు స్వాధీనంప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీకి చెందిన కార్యాలయాల్లో వరుసగా మూడోరోజు దర్యాప్తుసంస్థ ఈడీ సోదాలు కొనసాగుతున్నాయి. ముంబయిలోని రిలయన్స్ అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు చెందిన ప్రదేశాల నుంచి పలు దస్త్రాలు, కంప్యూటర్ పరికరాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారని సంబంధిత వర్గాలు మీడియాకు వెల్లడించాయి. గురువారం నాడు ఈ తనిఖీలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈడీ ప్రాథమిక నివేదిక ప్రకారం.. 2017 నుంచి 2019 మధ్యకాలంలో యెస్ బ్యాంక్ నుంచి తీసుకున్న రూ.3 వేల కోట్ల రుణాలను కంపెనీలు అనుమానాస్పద రీతిలో దారి మళ్లించాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇదే అంశంలో యెస్ బ్యాంక్ మాజీ ఎండీ ప్రమోటర్ రాణా కపూర్‌పై దాఖలైన మనీ లాండరింగ్ కేసులో భాగంగా 2020లో అనిల్ అంబానీ ఈడీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో నేషనల్ హౌసింగ్ బ్యాంక్, సెబీ, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ, బ్యాంక్ ఆఫ్ బరోడాతో సహా పలు నియంత్రణ, ఆర్థిక సంస్థల నుంచి వచ్చిన సమాచారం, అలాగే సీబీఐ నమోదు చేసిన రెండు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ తాజాగా రంగంలోకి దిగింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని 'మోసపూరితం'గా వర్గీకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించిన వేళ.. మరో కేసులో కేసులో ఈడీ రంగంలోకి దిగడం గమనార్హం. ఇదిలా ఉంటే.. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు రిలయన్స్ పవర్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఈ సోదాల (%జుఱ ఘఱంం%) గురించి స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చాయి. వీటివల్ల తమ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం లేదని పేర్కొన్నాయి. ఇక, రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని 'మోసపూరితం'గా వర్గీకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించిన తరుణంలో రోజుల వ్యవధిలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

## చాట్‌జీపీటీతో సీక్రెట్లు చెబుతున్నారా? జాగ్రత్త..!: శామ్ ఆల్ట్‌మన్ వార్నింగ్

**జనంసాక్షి:**ఈ రోజుల్లో చాట్‌జీపీటీకి ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. ముఖ్యంగా యువత యితే ప్రతి చిన్న సందేహాన్నీ ఈ చాట్‌బాట్‌లోనే అడిగి తెలుసుకుంటున్నారు. దాన్నో ఫ్రెండ్‌లా భావించి మనసు విప్పి మాట్లాడుకుంటున్నారు. అయితే, ఈ విషయంలో కాస్త జాగ్రత్తగా ఉండాలంటున్నారు చాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్. ఈ చాట్‌బాట్‌తో యూజర్లు పంచుకునే విషయాలు రహస్యంగా ఉండవని చెప్పారు. న్యాయస్థానాలు ఉత్తర్వులు ఇస్తే తాము ఏ విషయాన్నైనా వెల్లడి చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. ఓ కమెడియన్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈ మధ్య చాలామంది యూజర్లు తమ జీవితాల్లో జరిగే వ్యక్తిగత విషయాలనుకి చెప్పేస్తున్నారు. ముఖ్యంగా యువత దీన్ని ఓ థెరపిస్ట్‌గా, లైఫ్ కోచ్‌గా భావిస్తున్నారు. కానీ, యూజర్లతో జరిపే వ్యక్తిగత సంభాషణలను భద్రంగా ఉంచే విషయంలో ఏఐ రంగం ఇంకా పురోగతి సాధించాల్సి ఉంది. ఓ డాక్టర్‌తోనో, న్యాయవాది లేదా థెరపిస్ట్‌తో జరిపిన సంభాషణకు ఉన్నంత గోప్యత ఏఐ చాట్‌లలో ఉండదు.

## రైలు ప్రయాణంలో గరిష్ఠంగా లగేజీ ఎంతంటే..?



రైల్లో దూర ప్రయాణం చేస్తున్నారా? మీ వెంట అధిక లగేజీ పట్టుకెళుతున్నారా? అయితే, ఇది మీకే. పరిమితికి మించి ఒకవేళ మీరు లగేజీ తీసుకెళ్తుంటే దానికి జరిమానా చెల్లించాల్సి రావొచ్చు. కాబట్టి రైలు ప్రయాణం చేసేవారు రైల్వే లగేజీ పాలసీ గురించి తెలుసుకోవాల్సిందే. రైలులో ప్రయాణిస్తున్న తరగతిని బట్టి ఒక్కో వ్యక్తి 35 నుంచి 70 కేజీల వరకు ఉచితంగా లగేజీని తీసుకెళ్లొచ్చు. ఆపై అదనంగా తీసుకెళ్లే లగేజీకి రుసుము చెల్లించాలి. ఫస్ట్‌క్లాస్ ఏసీలో ప్రయాణించేవారు గరిష్ఠంగా 70 కిలోల వరకు లగేజీని తమ వెంట తీసుకెళ్లొచ్చు. ఏసీ 2-టైర్‌లో ప్రయాణించేవారికి 50 కిలోల వరకు అనుమతిస్తారు. ఏసీ 3-టైర్, స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించే వారు 40 కిలోల వరకు లగేజీ ఉచితంగా తీసుకెళ్లొచ్చు. సెకండ్ క్లాస్‌లో ప్రయాణించే వారు 35 కిలోలు మాత్రమే ఉచితంగా తీసుకెళ్లేందుకు వీలుంది. 5-12 ఏళ్ల వయసున్నవారైతే అనుమతించిన పరిమితిలో సగం లగేజీని తమ వెంట తీసుకెళ్లేందుకు అనుమతి ఉంటుంది. విమాన ప్రయాణాల విషయంలో లగేజీ విషయంలో పరిమితి ఉన్నట్లే.. రైల్వేలోనూ లగేజీ విషయంలో ఎప్పటి నుంచో పరిమితి ఉంది. కానీ, తనిఖీలు జరగడం అరుదు. అయినా వీటి గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఇప్పుడిప్పుడు పెద్ద పెద్ద స్టేషన్లలో లగేజీని తనిఖీ చేస్తున్నారు. అలాంటి సమయంలో బరువు గురించి ఆరా తీయొచ్చు. ప్రయాణంలో మీ లగేజీ వల్ల ఎవరికైనా అసౌకర్యం అనిపించినా టీటీఈకి ఫిర్యాదు చేయొచ్చు. టీవీలు, పెద్ద పెద్ద సూట్‌కేసులు మీ వెంట తీసుకెళ్తున్నప్పుడు టీటీఈలు, లగేజీ ఇన్‌స్పెక్టర్లు తనిఖీ చేసి ఆ మేర అదనపు లగేజీకి ఫైన్ వేయొచ్చు. కాబట్టి అదనపు లగేజీ తీసుకెళ్లాలనుకునేవారు రైలు బయల్దేరడానికి 30 నిమిషాల ముందు లగేజీ కౌంటర్‌ను సంప్రదించడం మంచిది. చేతి కర్రలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, టిఫిన్ బాక్సులకు పరిమితి నుంచి మినహాయింపు ఉంటుంది.

# శాతవాహనలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

**బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 26 (జనంసాక్షి) :** శాతవాహన విశ్వవిద్యాలయంలో పరిపాలన భవనం మొదటి అంతస్తులో పరీక్షల విభాగం కొరకు నిర్మించిన భవనాన్ని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించిన్నారు. విశ్వవిద్యాలయంలో అంతర్గత నీటి సరఫరా పైప్ లైన్ ఏర్పాటు చేయడానికి 2.10 కోట్ల రూపాయల వ్యయంతో శంకుస్థాపనతో పాటు కొత్తగా మరమ్మతులు చేసిన సెమినార్ హాల్ ను ప్రారంభించి మంత్రి పొన్నం మాట్లాడుతూ... 2008లో దాదాపు 200 ఎకరాలు సేకరించి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించామని, పార్లమెంట్ సభ్యుడిగా ఉండి కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేశామని, కొత్త కోర్సుల కోసం, ప్రాంగణాల కోసం ప్రయత్నించామని మరలా కాంగ్రెస్ ప్రభుత్వమే హుస్నాబాద్‌లో ఇంజనీరింగ్ కాలేజి, కరీంనగర్ క్యాంపస్ లో న్యాయ కళాశాలను ఫార్మసీ కళాశాల్లో ఎంఫార్మసీ ఈ విద్యా సంవత్సరానికి తెచ్చుకొన్నామన్నారు.

పార్లమెంట్ సభ్యుడుగా ఉన్నప్పుడు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు తెచ్చామని అధికారములో ఉన్నా, ప్రతి పక్షంలో ఉన్నా కరీంనగర్ జిల్లాను విద్యలో ముందుంచటానికి ప్రయత్నం చేసానని ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్యాకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీల ఏర్పాటుతో తెలంగాణలో విద్యాపరమైన ఆవిష్కరణలు చేస్తున్నామని ఆదర్శ పాఠశాలలు అభివృద్ధికై మాతృభాష, అంతర్జాతీయ భాషైన ఇంగ్లీష్‌కి ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యముగా విద్యార్థులు స్కిల్స్ పెంచుకొని మంచి ఉద్యోగాలు సంపాదించాలని, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలని జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని శాతవాహన యూనివర్సిటీని తెలంగాణ లోనే అత్యున్నత స్థానం పొందేలా విద్యార్థులు, అధ్యాపకులు కష్టపడాలని, విద్యార్థులు పోటీ ప్రపంచంలో గమ్యాన్ని చేరేలా కష్టపడాలని, ఇప్పటికే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని మార్చ్ లోపు ఇంకో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసి లక్ష ఉద్యోగాలిస్తమన్నారు.

విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ... డిసెంబర్ 4 న ముఖ్యమంత్రి పెద్దపల్లి వచ్చినప్పుడు లా కాలేజి, ఇంజినీరింగ్ కాలేజీ ఇస్తామన్నారని, ఆరు నెలలలోనే మంత్రి సహకారముతో తెచ్చామని శాతవాహన యూనివర్సిటీ అభివృద్ధికి మంత్రి కట్టుబడ్డారని పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి ముందున్నారని విశ్వ విద్యాలయాన్ని విద్యలో, పరిశోదనలో రాష్ట్రంలో ముందుంచటానికి ప్రయత్నం చేస్తామని త్వరలో న్యాయ కళాశాలను దాదాపు 18 కోట్లతో నిర్మిస్తామని ప్రభుత్వ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తీ రవికుమార్, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత, ఓఎస్డి టు వీసీ డా. హరికాంత్, పరీక్షల నియంత్రణధికారి డా. సురేష్ కుమార్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జయంతి, వివిధ విభాగధిపతులు, జిల్లాకు చెందిన ఇతర ముఖ్యనేతలు, అధికారులు, విశ్వవిద్యాలయ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





# మన ఊరు - మన బడి పనుల అసంపూర్తిపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 26 (జనం సాక్షి) :** డిచ్పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో మన ఊరు – మన బడి కింద పనులు పాక్షికంగా చేపట్టి, అర్ధాంతరంగా నిలిపి వేయడాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర ఆగ్రహానికి గురై అసంతృప్తిని వ్యక్త పరిచారు. వాటిని వెంటనే పూర్తి చేసి తరగతి గదుల కోసం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించా రు. అంతకు ముందు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలతో పాటు, అంగన్వాడీ సెంటర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తుండడాన్ని గమనించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పక్షం రోజులకు ఒకసారి తప్పని సరిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, అవసరమైన వారికి చికిత్సలు అందేలా చూడాలని ఆదేశించారు. గురుకులంలో 640 మంది విద్యార్థిను లు ఉండగా, వారికి నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించా లని కలెక్ట ర్ సూచించారు. మెనూను పరిశీలించి, తదనుగుణంగా ఆహార పదార్థాలు ఉన్నాయా లేవా అని తనిఖీ చేశారు. అనంతరం ఒకే ప్రాంగణం లో కొన సాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్వాడీలో చిన్నారుల హాజరు, వారికి అందిస్తు న్న పౌష్టికాహారం, నేర్పిస్తున్న ఆటపాటల గురించి వివరాలు తెలుసుకు న్నారు. ప్రతిరోజు కోడిగుడ్డు అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని, విద్యార్థుల నమోదుతో పాటు క్రమం తప్ప కుండా వారు బడికి వచ్చేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు.

# కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

- కౌశిక్ రెడ్డికి మతిభ్రమిస్తే మెంటల్ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలి
- ముఖ్యమంత్రిపై నిరాధార ఆరోపణలు : పలువురు కాంగ్రెస్ నేతలు



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 26 (జనంసాక్షి) :** హుజురాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన నిరాధార ఆరోపణలను ఖండిస్తూ, ఆయ నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం మానకొండూ రు ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహా పలువురు కాంగ్రెస్ నేతలు కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహి ంచారు. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి ముఖ్యమంత్రి పై చేసిన ఆరోపణలను జిల్లా కాంగ్రెస్ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వమే పాల్పడిందని, రాజకీయ నాయకులు, మంత్రులు, సినీ నటులు, కాంట్రాక్టర్లు, హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్‌లను ట్యాప్ చేసిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని ఆరోపించారు. టెర్రరిస్టుల నెపంతో ఫోన్ ట్యాపింగ్ చేసి, ఆధారాలను ధ్వంసం చేశారని, వార్తల్లో నిలవాలనే దురుద్దేశంతో కౌశిక్ రెడ్డి ఈ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సొంత భార్య ఫోన్‌ను ట్యాప్ చేసిన నీచ చరిత్ర బీఆర్ఎస్‌దేనని, కౌశిక్ రెడ్డికి మతిభ్రమిస్తే మానసిక ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలని, పిచ్చి ముదిరితే ప్రజలే తరిమి కొడతారని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకొని జైలుకు పంపడం ఖాయమన్నారు. రేవంత్ రెడ్డి సామాన్య కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి స్థాయికి 26 సంవత్సరాల ప్రస్థానంలో గొప్ప వ్యక్తిత్వంతో ఎదిగారని, కౌశిక్ లాంటి లుచ్చా రాజకీయా లు చేయలేదని, ఆరోపణలకు ఆధారాలు చూపాలని డిమాండ్ చేశారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కౌశిక్ రెడ్డి పిచ్చి కుక్క కరిచినట్లు మాట్లాడు తున్నారని, ఎమ్మెల్యే స్థాయికి తగని విధంగా వీధి రౌడీలా, చిల్లర వెధవలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కౌశిక్ రెడ్డి వ్యవహారంపై శాసనసభ స్పీకర్ జోక్యం చేసుకొని ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. స్పీకర్ స్పందించకపోతే, అసెంబ్లీ ఎదుట గాంధీ విగ్రహం సాక్షిగా నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు 4 కోట్ల తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని, బీఆర్ఎస్‌కు భవిష్యత్తులో తెలంగాణలో చోటు లేదని, నిరాధార ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కౌశిక్ రెడ్డి పద్ధతి మార్చుకోకపోతే ప్రజలే తగిన శిక్ష విధిస్తారని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కాంగ్రెస్ నాయకులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. రాజకీయంలో హుందాగా ఉండాలని కేసీఆర్ చెప్పినట్లు, బీఆర్ఎస్ ఇలాంటి రాజకీయాలను ప్రోత్సహించకూడదని, కౌశిక్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకారపు భాస్కర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, బోనాల శ్రీనివాస్, కర్ర రాజశేఖర్, బొబ్బిలి విక్టర్, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, జవ్వాజి హరీష్, గోపు మల్లారెడ్డి, మునిగంటి అనిల్, నందగిరి రవీంద్ర చారి, కొల గాని అనిల్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

## గర్గుల్ రామారెడ్డి రహదారి తాతకాలికంగా మూసివేత

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 26 (జనం సాక్షి) :**





కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రానికి సమీపంలో గల గంగమ్మ వాగు వంతెన నిర్మాణం వద్ద నీటి ప్రవాహం పెరుగడంతో గర్గుల్–రామారెడ్డి రహదారి తాత్కాలికంగా శనివారం మూసివేశారు.

రామారెడ్డి మరియు గర్గుల్ గ్రామాలను కలిపే ప్రధాన రహదారిలో గంగమ్మ వాగుపై వంతెన నిర్మాణం కొనసాగుతోంది. ఈ వంతెన పూర్తికాకపోవడంతో వాహనాలు తాత్కాలిక డైవర్షన్ రోడ్డుపై ప్రయాణిస్తునాయి. అయితే కురుస్తున్న వర్షాల వల్ల వాగులో నీటి ప్రవాహం తీవ్రమవడంతో ఈ మార్గం కూడా ప్రమాదకరంగా మారింది.నీటి ఉధృతి పెరగడం వల్ల ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని అధికారులు డైవర్షన్ రోడ్డుపై ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేశారు. ప్రజలు అనవసరంగా ఈ మార్గంలో ప్రయాణించవద్దని, అత్యవసర ప్రయాణాల కోసం మాత్రమే వేరే మార్గాలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.ప్రస్తుతం పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు, వంతెన నిర్మాణాన్ని అత్యంత వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికే పనులు వేగవంతం చేయాలని చర్యలు చేపట్టారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో, మరోవైపు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరం అని తెలిపారు.వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం, అని ఆర్అండ్‌బీ శాఖ అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ హాస్టల్స్‌లను తనిఖీ చేసిన జిల్లా సంక్షేమ అధికారి

**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బాలుర కళాశాల హాస్టల్, ఇంటిగ్రెటెడ్ హాస్టల్, బాలికల హాస్టల్‌లను జిల్లా సంక్షేమ అధికారి వినోద్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల బాలుర కళాశాల హాస్టల్‌లో సమస్యలు ఉత్పన్నమైన సందర్భంగా సూచించిన సలహాలను పాటిస్తున్నారా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డెన్‌లు సాదుల రమేష్, ప్రవీణ్, రమ్య విద్యార్థులకు అందుబాటులో స్థానికంగా నివాసం ఉంటూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఇకనుండి వారానికి రెండుసార్లు ఉన్నతాధికారులు హాస్టల్‌ను తనిఖీ చేస్తారని వార్డెన్లు అందుబాటులో ఉంటూ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, పరిష్కరించ లేని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

## ముంపు ప్రాంతాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు**



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూలై 26 (జనం సాక్షి) :** భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాలపై అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, సీనియర్ ఐఏఎస్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. శనివారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయంలో కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డితో కలిసి భారీ వర్షాలు, సీజనల్ వ్యాధులు, యూరియా ఎరువుల నిల్వలపై సమీక్ష నిర్వహించారు. ప్రాణనష్టం, అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెరువులు, కాలువలలో చేపలు పట్టడానికి ఎవరూ వెళ్లకుండా నిషేధించాలని ఆదేశించారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సన్నద్ధంగా ఉండాలని, వరద ప్రాంతాల్లో రాకపోకలు నిషేధించాలని, జలదిగ్బంధం సంఘటనలను నివారించాలని సూచించారు. అత్యవసర సహాయ బృందాలు సిద్ధంగా ఉంచాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. శిథిల ఇళ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, కంటేశ్వర్ రైల్వే కమాన్, ముబారక్ నగర్‌లో నీటి నిల్వలను పర్యవేక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఆసుపత్రుల్లో ఔషధ నిల్వలు, యూరియా ఎరువుల సరఫరా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08462–220183) ఏర్పాటు చేసినట్లు, వాతావరణ సూచనలను ప్రజలకు చేరవేస్తున్నట్లు, పునరావాస కేంద్రాలు, సహాయ బృందాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. నిజామాబాద్‌లో 167 శిథిల ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు, కాల్పోల్ తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విష జ్వరాలను అదుపు చేసినట్లు, యూరియా స్టాక్ వివరాలను ప్రదర్శిస్తున్నట్లు వివరించారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో..

## ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు

**స్టాట్యూ కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా ఎస్పీ**



**గంభీరావుపేట, జూలై 26 (జనం సాక్షి):** గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటు పై నిర్వహించిన స్టాట్యూ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ జిల్లా ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ,ప్రభుత్వ పాఠశాలలో ఆచార్య జయ శంకర్ చిత్రపటం ఉందని, అవకాశం ఉన్నచోట విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గంభీర్ రావు పేట మండలం నమాజ్ చెరువు వద్ద ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ విగ్రహ ఏర్పాటు గురించి చర్చించి ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చెరువు ఎఫ్.టి.ఎల్ లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలు లేనందున జయశంకర్ విగ్రహం ఏర్పాటు కుదరదని కలెక్టర్ తెలిపారు. స్టాట్యూ కమిటీ సభ్యులు అంగీకారం మేరకు గంభీరావుపేట మండలంలో ఉన్న కేజీ టూ పీజీ పాఠశాల ఆవరణలో ఆచార్య జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు, దీనికి సంబంధించి అవసరమైన తదుపరి చర్యలను రోడ్లు భవనాల శాఖ అధికారులు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ఎంబిఈ నరసింహ చారి, ఈఈపిఆర్. సుదర్శన్ రెడ్డి, ఈఈ ఇరిగేషన్ కిషోర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### తోపులాటలో హౌసింగ్ బోర్డు ఉద్యోగి మృతి

**మెహదీపట్నం :** మెహదీపట్నం ఆర్టీసీ డిపో ముందు ఉన్న ఓ ఫంక్షన్ హాల్ యాజమాన్యంతో జరిగిన తోపులాటలో తెలంగాణ హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఉద్యోగి మృతిచెందారు. గత ఎనిమిదేండ్లుగా ఫంక్షన్‌హాల్ యాజమాన్యం హౌసింగ్ బోర్డుకు లీజు డబ్బులు చెల్లించడం లేదు. దీంతో దాదాపు రూ.1.50 కోట్ల బకాయి ఉండటంతో కోర్టు ఆదేశాలతో ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేసేందుకు సిబ్బందితో కలిసి అధికారులు వెళ్లారు. ఈ క్రమంలో యాజమాన్యం, కార్పొరేషన్ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది.




## ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారి

- మంథని మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్‌కు ఫిర్యాదు

మంథని, (జనంసాక్షి) : ఇటీవల బదిలీపై మంథనికి వచ్చిన మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయటం కానీ, సమస్య మీద కానీ స్పందించటం లేదు, కార్యాలయంలో సమస్యలపై పిర్యాదు చేస్తే స్పందించడం లేదు.. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌కు బోయిన్‌పేటకు చెందిన నాయిని సంతోష్ ఫిర్యాదు చేశారు. అసలే వర్షకాలం.. శానిటేషన్, పారిశుద్ధ పనులను పర్యవేక్షించడం లేదు. ప్లాస్టిక్ వ్యర్థాలు ప్లాస్టిక్ కవర్లు గురించి మంథని పట్టణంలో ప్రజలకు వ్యాపారస్తులకు అవగాహన కల్పించడం లేదు. వాటర్ ట్యాంక్ ల్లో శానిటేషన్ సరిగ్గా లేక ఇండ్లల్లోకి వచ్చే త్రాగునీరు మురికి నీళ్లు వస్తున్నాయి. ఎప్పుడో ఒక్కసారి చుట్టం చూపుల కార్యాలయానికి వస్తునాడు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా వారి పట్ల కమిషనర్ మాట్లాడే విధానం వైఖరి బాగాలేదు.. ప్రజలను చులకనగా చూస్తూ, మునిసిపల్ లో కమిషనర్ పర్యవేక్షణ లేకపోవడంతో ఎలాంటి పర్మిషన్ లేకుండా పట్టణంలో నిర్మాణం చేపడుతూ మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారు. మంథని మున్సిపల్ లో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ కూడా లేదు టౌన్ ప్లానింగ్ కు సంబంధించిన నియమ నిబంధనలు కూడా కరెక్ట్ గా పట్టించుకోవడం లేదు. పట్టణ అభివృద్ధిపై కమిషనర్ దృష్టి పెట్టడం లేదు. కేవలం తన సొంత ప్రయోజనం కోసమే పనిచేస్తున్నాడు. తమరు మున్సిపల్ కమిషనర్‌పై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని పట్టణ అభివృద్ధికి, పట్టణ ప్రజలకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# మంత్రి తుమ్మల ది గ్రేట్

## 34 చెరువులకు నీరు విడుదల



**రఘునాథపాలెం(జనంసాక్షి) :** మంత్రి తుమ్మల నాగేశ్వర రావుకి రఘునాథపాలెం మండలం రైతాంగం జేజేలు పలుకుతున్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి తుమ్మల ఉన్నప్పుడు కరువు ప్రాంతం అయిన వేంసూరు మండలానికి బేతుపల్లి వరద కాలువ ద్వారా ఆ ప్రాంత రైతులను ఆదుకున్నారు. పాలేరు నియోజకవర్గంలో ఉన్నప్పుడు భక్త రామరాజు ప్రాజెక్టు నిర్మించి ఆ ప్రాంత రైతాంగం గుండెల్లో చిరస్థాయిగా నిలిచారు. ఇప్పుడు ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథ పాలెం మండలానికి మంచుకొండ లిఫ్ట్ స్కీం ద్వారా సుమారు 34 చెరువులను నింపి ఆ ప్రాంత రైతుల్లో అపర భగీరథులుగా నిలిచారు. అంతేకాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యములు చేసే సీతారామ ప్రాజెక్టు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల్లో చిరస్థాయిగా నిలుస్తున్నారు. తుమ్మల ద గ్రేట్ లీడర్.. పదవులు వస్తూ పోతూ ఉంటాయి. చేసిన పనులే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి. శనివారం 34 చెరువులకు నీళ్ళు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, దీప్లా నాయక్, తాతా రఘురాం, దుంపటి నగేష్, బానోత్ కోటేష్ నాయక్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ప్రత్యేక అధికారి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూలై 26 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంవివిధ కార్యక్రమాల ప్రగతి వివిధ పథకాల అమలు గురించి ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించడం జరిగింది. కామారెడ్డి జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమించబడిన రాజీవ్ హనుమంతు శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా బిక్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడం జరిగింది. ముందుగా జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్ ఆయనకు పూల మొక్కను అందజేశారు. బిక్నూర్ ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి వైద్యులు వైద్య సిబ్బంది పనితీరు గురించి రాజీవ్ హనుమంతు సమీక్షించారు.ఆసుపత్రిలో ఉన్న వివిధ విభాగాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఆసుపత్రిలో గల ఇన్ పేషెంట్ వార్డు, ఫార్మసీ గది, ప్రసూతి గది, లాబరేటరీ, విభాగాన్ని తనిఖీ చేశారు. ఎన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు ఏ విధంగా చేస్తున్నారు అలాగే ల్యాబ్ ద్వారా అందుతున్న పరీక్షల సేవల గురించి ఆరా తీశారు.ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న వివిధ రకాల సేవలు అనగా ఔట్ పేషెంట్ సేవలు గర్భిణీ పరీక్షలు, చిన్న పిల్లల వ్యాధినిర్వాహక టీకాల వివరాలు, మరియు కుక్క కాటుకు సంబంధించినటువంటి రాబిస్ వ్యాక్సిన్ వివరాలు, అవసరమైన మందుల యొక్క నిలువ వివరాలు వైద్యాధికారి ని అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం భారీ వర్షాలు, వరదలు, వాతావరణంలో సంభవించే మార్పుల ద్వారా కలిగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అప్రమత్తంగా ఉండాలని మరియు ఇట్టి సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం తగిన చర్యలు మందు జాగ్రత్త చర్యలు చేపడుతూ కావలసిన అత్యవసర మందుల యొక్క నిలువలు తగినంత అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.బిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న సేవల గురించి వసతుల గురించి తెలుసుకు న్న ప్రత్యేక అధికారి రాజీవ్ హనుమంతు మరియు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సంతృప్తి వ్యక్తం చేశారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ ను జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ మరియు ముందు జాగ్రత్త చర్యల గురించి అప్రమత్త చర్యలు మరియు జిల్లాలో తీసుకున్న ముందస్తు చర్యలు మరియు సంసిద్ధత గురించి చేపట్టిన కార్యాచరణ గురించి అడిగి తగిన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.అధికారి రాజీవ్ హనుమంతు ప్రత్యేకంగా జిల్లాలో గల యూరియా సరఫరా మరియు తగినంత యూరియా నిలువ గురించి సమీక్షించారు. యూరియా నిలువ మరియు సరఫరా విషయంలో గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో కొంత తేడా ఉండడాన్ని గమనించిన ప్రత్యేక అధికారి జిల్లా వ్యవసాయ అధికారిని వివరణ అడిగారు జిల్లాలోని ప్రతి మండలాలలో యూరియా కొరత లేకుండా సరఫరాలో జాప్యం జరగకుండా రైతులకు తగిన సమయంలో తగినంత యూరియా సరఫరా అయ్యేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు.పంచాయతీరాజ్ శాఖ రెవెన్యూ శాఖ వ్యవసాయ శాఖ మరియు ఇతర అధికారులను సిబ్బందిని అధిక వర్షపాతం వరద ల ద్వారా సంభవించే సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తో పాటు అడిషనల్ కలెక్టర్ చందర్ నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రభు కిరణ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డివిజనల్ పంచాయతీ అధికారి బిక్నూర్ తాసిల్దార్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఒకే గ్రూప్‌లో భారత్, పాకిస్థాన్

- ఆసియా కప్ టోర్నీ షెడ్యూల్ వచ్చేసింది
- సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం

ఆసియాలోని క్రికెట్ టీమ్స్ ప్రతిష్టాత్మకంగా తీసుకునే ఆసియా కప్ 2025 తేదీలు ఎట్టకేలకు ఖరారయ్యాయి. ఈ టోర్నీని సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభించేందుకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ నిర్ణయించింది. సెప్టెంబరు 9 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 28తో ముగించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వేదికగా ఈ టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. దుబాయ్, అబుదాబి నగరాల్లో ఆటగాళ్లకు ఆతిథ్యం ఇవ్వనున్నారు. అయితే ఈ సారి ఆసియా కప్ నిర్వహణ బాధ్యత భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)దే అయినప్పటికీ తటస్థ వేదికల్లో నిర్వహించేం దుకు బీసీసీఐ అంగీకారం తెలిపింది. పాకిస్థాన్ దేశంలో రాజకీయంగా, వీసాల పరంగా కొన్ని ఆంక్షలున్న నేపథ్యం లో ఈ టోర్నీని యూఏఈలో నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఆసియా కప్ టోర్నీలో మొత్తం 8 దేశాల జట్లు పాల్గొంటాయి. వాటిలో భారత్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్, యూఏఈ, హాంకాంగ్, ఓమన్ జట్లు ఈ టోర్నీలో తలపడనున్నాయి. ఇందులోని మ్యాచ్ లన్నీ టీ-20 ఫార్మాట్‌లో జరుగుతాయి. భారత్‌కు చిరకాల ప్రత్యర్థి అయిన పాకిస్థాన్ ఒకే గ్రూపులో ఉండే అవకాశం ఉంది. ఒకవేళ ఒకే గ్రూప్‌లో ఉంటే లీగ్ దశలో ఒక మ్యాచ్.. సూపర్-4లో మరోసారి ఇరుజట్లు తలపడే అవ కాశం ఉంది. మరోవైపు ఇరు జట్లు ఫైనల్‌కు అర్హత సాధించవచ్చు.



## చిన్నస్వామి స్టేడియం సురక్షితం కాదు

భారత క్రీడా చరిత్రలో రెండో అతిపెద్ద ప్రమాదమైన చిన్నస్వామి తొక్కిసలాటలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ విషాద సంఘటనకు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దే బాధ్యత అని ఇప్పటికే కర్నాటక ప్రభుత్వం తేల్చి చెప్పగా.. తాజాగా ప్రభుత్వ కమిటీ కూడా నివేదికలో పలు అంశాల్ని ప్రస్తావించింది. భారీ జనసమీకరణకు చిన్నస్వామి స్టేడియం ఏమాత్రం సురక్షితం కాదని శనివారం తమ రిపోర్టులో పేర్కొంది. అంతేకాదు మైదానం డిజైన్, నిర్మాణం సామర్థ్యానికి అనుగుణంగా లేదని జస్టిస్ మోహన్ మైఖేల్ డిసున్హా కమిషన్ తెలిపింది. జూన్ 4న చిన్నస్వామి స్టేడియం దగ్గర జరిగిన తొక్కిసలాటపై సమగ్ర విచారణ చేపట్టిన జస్టిస్ మోహన్ మైఖేల్ కమిషన్.. ఘటనకు దారి తీసిన పరిస్థితులను వివరించింది. 'పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వచ్చి మ్యాచ్‌లను వీక్షించేందుకు చిన్నస్వామి స్టేడియం డిజైన్, నిర్మాణం అనుగుణంగా లేవు. స్టేడియంలోకి అనుమతించే.. బయటకు వెళ్లడానికి ఏర్పాటు చేసిన గేట్లు రోడ్డు మీది ఫుట్‌పాత్‌కు సమీపంలో ఉన్నాయి. స్టేడియం బయట అభిమానులు గుమికూడకుండా చూసేందుకు సరిపోను స్థలం.. ఇతర ఏర్పాట్లు ఏమీ లేవు. దాంతో, అభిమానులు రోడ్డు పక్కగానే క్యూ లైన్‌లో వేచి ఉండి స్టేడియంలోపలికి వెళ్లాల్సిన పరిస్థితి.



ఈ మ్యాచ్‌లో భారత జట్టు యొక్క బ్యాటింగ్ విజయవంతంగా సాగినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు బలమైన పోటీ ఇవ్వగల సామర్థ్యం కలిగి ఉంది. భారత బౌలర్లు తమ వ్యూహాత్మక ఆటతీరుతో ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లను ఒత్తిడిలో ఉంచగలిగితే, ఈ స్కోరు గెలుపును అందించే అవకాశం ఉంది. అభిమానులు ఈ రసవత్తర పోరును ఆసక్తిగా గమనిస్తున్నారు, మరియు రాబోయే ఇన్నింగ్స్‌లో భారత జట్టు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందో చూడటానికి ఎదురుచూస్తున్నారు.

# ఇంగ్లాండ్‌తో రసవత్తరం

## భారత్ 50 ఓవర్లకు 138/2 స్కోరు

- ఇంగ్లాండ్ 669 ఆలౌట్..
- భారత్‌పై 311 రన్స్ ఆధిక్యం!



ఇంగ్లాండ్‌తో జరుగుతున్న 50 ఓవర్ల వన్డే మ్యాచ్‌లో టీమ్ ఇండియా 50 ఓవర్లు పూర్తయ్యేసరికి 2 వికెట్ల నష్టానికి 138 పరుగులు సాధించింది. చివరి ఐదు ఓవర్లలో భారత జట్టు 16 పరుగులు రాబట్టగలిగింది, ఇది ఆట యొక్క కీలక దశలో స్థిరమైన ప్రదర్శను సూచిస్తుంది. క్రీజులో ఉన్న కేఎల్ రాహుల్ 62 పరుగులతో, శుభ్మన్ గిల్ 67 పరుగులతో అజేయంగా నిలిచారు, ఇద్దరూ జట్టు స్కోరును ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ లైనప్ స్థిరమైన ప్రదర్శన కనబరిచింది, అయితే చివరి ఓవర్లలో పరుగుల వేగం కొంత తగ్గినట్లు కనిపించింది. కేఎల్ రాహుల్ తన సహజమైన ఆటతీరుతో ఇన్నింగ్స్‌ను నిలకడగా నడిపిస్తుండగా, శుభ్మన్ గిల్ దూకుడుగా ఆడుతూ జట్టుకు బలమైన పునాది అందించాడు. ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో భారత బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేయడానికి ప్రయత్నించారు, ముఖ్యంగా చివరి ఐదు ఓవర్లలో పరుగులను పరిమితం చేసేందుకు వ్యూహాత్మకంగా పనిచేశారు. మ్యాచ్ యొక్క ఈ దశలో భారత్ జట్టు స్థిరమైన స్థితిలో ఉన్నప్పటికీ, రాబోయే ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్‌ను ఎదుర్కోవడానికి భారత బౌలర్లు తమ వంతు పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఈ స్కోరు రక్షణాత్మక ఆటతో పాటు దూకుడు వ్యూహాన్ని కలగలిపి ఆడినట్లు చెప్పవచ్చు, అయితే ఇంగ్లాండ్ బలమైన బ్యాటింగ్ జట్టుగా ఉన్నందున, భారత బౌలర్లు తమ ఆటలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచాల్సి ఉంటుంది.

ఇంగ్లండ్ వర్సెస్ భారత్ మధ్య జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు భారీ స్కోరుతో ఆధిపత్యం చెలాయించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 669 పరుగులకు ఆలౌటైంది. నాలుగో రోజు శనివారం ఆటను 544/7 స్కోరుతో ప్రారంభించిన ఇంగ్లండ్, మిగతా మూడు వికెట్లతో మరో 125 పరుగులు జతచేసి 311 పరుగుల భారీ ఆధిక్యాన్ని సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 77 పరుగులతో క్రీజులో ఉన్న కెప్టెన్ బెన్ స్టోక్స్, అద్భుత బ్యాటింగ్‌తో 198 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 141 పరుగులు సాధించి శతకం పూర్తి చేశాడు. బ్రైడన్ కార్స్ 54 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 47 పరుగులు, లియామ్ డాసన్ 26 పరుగులతో అతనికి తోడయ్యారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో జో రూట్ 248 బంతుల్లో 14 ఫోర్లతో 150 పరుగులు చేసి మెరిశాడు. ఓపెనర్లు జాక్ క్రాలీ 113 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్‌తో 84 పరుగులు, బెన్ డకెట్ 100 బంతుల్లో 13 ఫోర్లతో 94 పరుగులు సాధించారు. వన్‌డౌన్ ఆటగాడు ఓలీ పోప్ 128 బంతుల్లో 7 ఫోర్లతో 71 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. భారత బౌలింగ్‌లో రవీంద్ర జడేజా నాలుగు వికెట్లు తీసినప్పటికీ, భారీ స్కోరును అడ్డుకోలేకపోయాడు. జస్ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్ చెరో రెండు వికెట్లు, అన్షుల్ కాంబోజ్, మహ్మద్ సిరాజ్ చెరో వికెట్ సాధించారు. ఈ మ్యాచ్‌లో బెన్ స్టోక్స్ అరుదైన ఘనత సాధించాడు. ఒకే టెస్టులో 5/72తో ఐదు వికెట్లు పడగొట్టి, 141 పరుగుల శతకం సాధించిన ఐదో ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. 42 ఏళ్ల తర్వాత ఈ ఫీట్ నమోదు చేసిన స్టోక్స్, డెన్నిస్ అట్కిన్సన్, గ్యారీ సోబర్స్, ముస్తాక్ మహమ్మద్, ఇమ్రాన్ ఖాన్‌ల సరసన నిలిచాడు. ఇంగ్లండ్ ఆధిక్యం 311 పరుగులకు చేరడంతో భారత్ విజయ ఆశలు సన్నగిల్లాయి. డ్రా చేసుకోవడం తప్ప టీమిండియా ముందు మరో మార్గం లేదు. మూడో రోజు 225/2 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట ప్రారంభించిన ఇంగ్లండ్‌కు ఓలీ పోప్, జో రూట్ అద్భుత ఆరంభాన్ని అందించారు. ఈ జోడీ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొంది. పోప్ 93 బంతుల్లో హాఫ్ సెంచరీ, రూట్ 99 బంతుల్లో అర్థశతకం సాధించారు. శుభ్‌మన్ గిల్ వీరిని విడదీసే ప్రయత్నాలు విఫలమయ్యాయి.

దాంతో ఇంగ్లండ్ 332/2 స్కోరుతో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో వాషింగ్టన్ సుందర్ ఓలీ పోప్‌ను క్యాచ్ ఔట్ చేసి 144 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. ఆ తర్వాత హ్యారీ బ్రూక్‌ను స్టంపౌట్ చేశాడు. 80 ఓవర్లు పూర్తయిన తర్వాత భారత్ కొత్త బంతి తీసుకోగా, స్టోక్స్‌తో జత కలిసిన రూట్ తన జోరును కొనసాగించాడు. 96వ ఓవర్‌లో అన్షుల్ కాంబోజ్ బంతిని బౌండరీకి తరలించిన రూట్, 178 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. స్టోక్స్ 97 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే, క్రాంప్స్ కారణంగా 66 పరుగుల వద్ద స్టోక్స్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. జెమీ స్మిత్ క్రీజులోకి వచ్చాడు. రూట్ 246 బంతుల్లో 150 పరుగుల మార్క్ అందుకోగా, జడేజా అతన్ని స్టంపౌట్ చేశాడు. బుమ్రా స్మిత్‌ను కీపర్ క్యాచ్‌గా ఔట్ చేశాడు. స్టోక్స్ మళ్లీ బ్యాటింగ్‌కు దిగి, క్రిస్ వోక్స్‌ను సిరాజ్ ఔట్ చేయగా, లియామ్ డాసన్‌తో కలిసి స్టోక్స్ ఆచితూచి ఆడి మూడో రోజు ఆటను ముగించాడు.

మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచ్‌లో భారత క్రికెట్ జట్టు 42 ఏళ్ల తర్వాత ఓ అనవసరమైన రికార్డును సమం చేసింది. భారత ఓపెనర్లు సాయి సుదర్శన్, యశస్వి జైస్వాల్ రెండో ఇన్నింగ్స్‌లో సున్నా పరుగులకే ఔటై, టెస్టు క్రికెట్ చరిత్రలో రెండోసారి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్లు ఒక్క పరుగు కూడా చేయకుండా వెనుదిరిగిన దుర్లభ ఘటనను నమోదు చేశారు. చివరిసారి 1983లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో సునీల్ గవాస్కర్, కృత్తి వెంకట్రాఘవన్ సున్నా వద్ద ఔటయ్యారు. ఈ టెస్టులో ఇంగ్లాండ్ పేసర్ క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో సుదర్శన్, జైస్వాల్ కేవలం రెండు బంతుల వ్యవధిలో ఔటవడంతో ఈ చెత్త రికార్డు నమోదైంది. ఆశ్చర్యకరంగా, తొలి ఇన్నింగ్స్‌లో సుదర్శన్ 61, జైస్వాల్ 58 పరుగులతో జట్టుకు దృఢమైన ఆరంభాన్ని అందించారు. కానీ, రెండో ఇన్నింగ్స్‌లో మొదటి ఓవర్ చివరి బంతికి జైస్వాల్, రెండో ఓవర్ మొదటి బంతికి సుదర్శన్ ఔటవడంతో భారత శిబిరంలో ఆందోళన నెలకొంది.

ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో భారత్ ఇప్పటివరకు ఒక్క టెస్టు గెలవక, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడి, ఐదు మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. ప్రస్తుత సిరీస్‌లో 1-2తో వెనుకబడిన భారత్, ఈ మ్యాచ్ గెలిచి సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో ఉంది. అయితే, ఓపెనర్ల వైఫల్యం జట్టుకు ఆశించిన ఆరంభాన్ని ఇవ్వలేకపోయింది. రెండు వికెట్లు సున్నా వద్ద కోల్పోవడం జట్టుపై ఒత్తిడిని పెంచింది. మిగిలిన బ్యాట్స్‌మెన్లు ఈ ఒత్తిడిని తట్టుకుని జట్టును గట్టెక్కిస్తారా లేదా అనేది చూడాలి. ఈ అనవసర రికార్డు భారత టెస్టు చరిత్రలో మరపురాని క్షణంగా నిలిచిపోనుంది.

## ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్

### డ్రాగా ముగిసిన తొలి గేమ్

బాటుమి: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ ఆసక్తికరంగా మొదలైంది. తెలుగమ్మాయి, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి, దివ్య దేశముఖ్ మధ్య జరుగుతున్న ఈ ఫైనల్లో తొలి గేమ్ డ్రాగా ముగిసింది. దివ్య తెల్లపావులతో ఆడగా.. హంపి నల్లపావులతో ఆడింది. ఆదివారం రెండో గేమ్ నిర్వహిస్తారు. అది కూడా డ్రా అయితే.. సోమవారం టై బ్రేక్ ద్వారా విజేతను నిర్ణయిస్తారు.

## జస్ప్రీత్ బుమ్రా రిటైర్డ్ అవుతారు

### మహ్మద్ కైఫ్ వీడియో సంచలనం!


ఇండియా, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియంలో జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో టీమిండియా బౌలింగ్ అంతగా ప్రభావం చూపలేదు. దీంతో మూడో రోజు ఇంగ్లాండ్ బ్యాటర్లు భారీగా పరుగులు సాధించారు. టీమిండియాకు చెందిన ఇద్దరు కీలక బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్ వికెట్ల కోసం చాలా కష్టపడ్డారు. ఈ మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్ అత్యంత ఆశ్చర్యం కలిగించింది. మూడో రోజు జస్ప్రీత్ బుమ్రా తన పాత ఫామ్‌లో అస్సలు కనిపించలేదు. బుమ్రా వేగం కూడా 125 నుంచి 130 కేఎంపీహెచ్ మధ్యనే ఉంది.

## ఫుడ్ ఇన్ఫెక్షన్‌తోనే బాలిక మృతి

- కస్తూరిబా సిబ్బంది నిర్లక్ష్యం నిండు ప్రాణం బలి
- ఉడకబెట్టి ఒక రోజు దాటిన తరువాత పెట్టిన కోడి గుడ్ల వల్లే డెత్
- వెక్కి వెక్కి ఏడుస్తూ వివరించిన మృతురాలి అక్క



**మర్రిగూడ, జూలై 23 (జనం సాక్షి) :** ఫుడ్ పాయిసన్ తో చిన్నారి మృతి చెందిన ఘటన మర్రిగూడ మండలంలో చోటు చేసుకుంది. కాసింత కాసులకు కక్కుర్తిపడిన హాస్టల్ నిర్వాహకురాలి వల్ల భవిష్యత్తు చూడని బాలిక కన్ను మూసింది. ఓ నియోజకవర్గ స్థాయి లీడర్ ప్రోగ్రాంలో మిగిలిన గుడ్లను తెచ్చుకొని, మరుసటి రోజు పిల్లలకు పెట్టడం వల్లే సంఘటన జరిగినట్లు అనేక అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి..! ఇక వివరాలలోకి వెళ్తే..మండలంలోని కస్తూరిభా వసతి గృహంలో శివన్నగూడెం గ్రామానికి చెందిన గుణగోని లింగయ్య కూతురు నందిని(13) 8వ తరగతి చదువుతుంది. మండలం వ్యాప్తంగా గత ఆదివారం నిర్వహించిన ప్రోగ్రాంలో మిగిలిన గుడ్ల కూరను తెచ్చుకున్న, హాస్టల్ సిబ్బంది కనీస జాగ్రత్తలు పాటించ కుండా పిల్లలకు పెట్టడంతో, సోమవారం రాత్రి ఫుడ్ పాయిసన్ తో 18మంది చిన్నారులు ఆసుపత్రి పాలయ్యారు. ఈ క్రమంలో నందిని ఆరోగ్య పరిస్థితి బాగోలేదనే అమ్మాయిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. చికిత్స పొందుతూ చిన్నారి తుది శ్వాస విడిచింది. జనం సాక్షి పత్రికలో ఫుడ్ పాయిసన్ గురించి వచ్చిన కథనం ఆధారంగా, జిల్లా వైద్య అధికారి విచారణ చేసినప్పటికి, తన సిబ్బందిని రక్షించే కార్యక్రమం ముందు వేసుకున్నారు తప్ప, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టనందుకే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు అనుకుంటున్నారు..!? ఏదేమైనా చిన్నారి మృతిపై విచారణ జరిపి, నిర్లక్ష్యం వహించిన అధికారులపై, హాస్టల్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# స్థానిక పోరుకు నేతలు


## రంగంలో హేమాహేమీలు

### సుల్తానాబాద్, జిల్లా పరిషత్ స్థానానికి పెరిగిపోతున్న ఆశావహుల సంఖ్య

రానున్న సుల్తానాబాద్ జిల్లా పరిషత్ స్థానం కోసం ఇప్పటినుండే రాజకీయ వేడి మొదలైంది. ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా! పోటీ చేద్దాం అంటూ చర్చలు. ఇకపోతే సుల్తానాబాద్ జిల్లా పరిషత్ స్థానానికి పోటాపోటీ నెలకొంది. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, పార్టీలలో నాయకులు ఇప్పటినుండే ప్రచారంలో నిమగ్నం అయ్యారు. అన్ని పార్టీలలో పోటాపోటీ నెలకొంది. ముందుగా జిల్లా పరిషత్ ఎన్నికలకు నోటిఫికేషన్,వస్తే పోటీ చేయడానికి, మూడు పార్టీల నాయకులు అభ్యర్థులను రంగం సిద్ధం చేసుకునే పనిలో ఉన్నాయి. అంతేకాకుండా ఆశావాహుల సంఖ్య కూడా బాగానే ఉంది.




సుల్తానాబాద్,జూలై 26(జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ నుండి బీసీ రిజర్వేషన్ వస్తే మండలంలోని కందునూరిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత పన్నాల రామన్నను అభ్యర్థిగా నిలపనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇకపోతే బిజెపి నుండి రిజర్వేషన్ల దృష్ట్యా సీనియర్ బిజెపి నేత జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు తో పాటు, సామాజికవేత్త మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ పోటీ చేస్తారని వాదనలు వినిపిస్తున్నాయి. బి ఆర్ఎస్ పార్టీ నుండి బీసీ రిజర్వేషన్ అనుకూలిస్తే తాను పోటీ చేస్తానని సామాజిక సేవకులు, బి ఆర్ఎస్ సీనియర్ నేత, తాళ్లపల్లి ఆగయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్ బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. అంతేకాకుండా గర్రెపల్లి గ్రామానికి చెందిన పడాల అజయ్ గౌడ్ పోటీలో ఉంటానని ప్రకటించి తన కార్యాచరణ చేస్తున్నట్లు తెలిసింది. బీఎస్పీ పార్టీ నుండి కూడా అభ్యర్థి ఉంటారని ప్రచారం జరుగుతుంది. కాగా సామాజిక సేవకులుగా గత కొన్ని సంవత్సరాలుగా తన సొంత డబ్బులు వెచ్చించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన తాళ్లపల్లి మనోజ్ గౌడ్ రాజకీయ రంగ ప్రవేశం చేసి జిల్లా పరిషత్ సభ్యునిగా ఎన్నిక కావడానికి సన్నద్ధమవు తున్నారు. అన్ని గ్రామాలలో గత 12 సంవత్సరాలుగా చేసిన సేవా కార్యక్రమాలే తన గెలుపునకు దోహదం చేస్తోందని తాళ్లపల్లి మనోజ్ గౌడ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. బిజెపి నుండి జనరల్ అయితే అశోక్ రావు బిసి అయితే మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ కూడా పోటీలో నిలిచే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూ, లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలలో పాలుపంచు కుంటూ రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో రాజకీయ వాతావరణం వేడెక్కనుంది అని పలువురు చర్చించుకుంటున్నారు. బి ఆర్ఎస్ పార్టీ నుండి జనరల్ అయితే మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ పాల రామారావు కూడా పోటీ చేయడానికి ఇప్పటి నుండే పావులు కదుపుతున్నట్లు ప్రచా రం జరుగుతుంది. ఇద్దరు సామాజిక సేవకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సుల్తానాబాద్ జిల్లా పరిషత్ స్థానానికి పోటాపోటీగా అభ్యర్థులు ఎవరికి వారే తమ అంచనాలు వేసుకుంటూ ఎన్నికల నోటిఫికేషన్ కొరకు వేచి చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి సీనియర్ కాంగ్రెస్ నేత పన్నాల రామన్న మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తూ తన ప్రచారాన్ని కూడా ఉధృతం చేస్తున్నారు. వీరే కాకుండా ఇంకా వివిధ పార్టీల నుండి పోటీలో ఉండేందుకు పలువురు సన్నద్ధం అవుతున్నట్లు వార్తలు వ్యాపిస్తున్నాయి. ఒకవేళ జనరల్ అయితే కాంగ్రెస్ పార్టీ నుండి సీనియర్ కాంగ్రెస్ నేత బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు, బిఆర్ఎస్ పార్టీ నుండి గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు కూడా ఉంటారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సుల్తానాబాద్ మండల జిల్లా పరిషత్ స్థానానికి పోటాపోటీగా అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధపడటంతో మండలంలోని అన్ని గ్రామాలలో పెద్ద ఎత్తున రాజకీయ చర్చ విశ్లేషణ జరుగుతోంది.




## కనికరం లేని కన్న పేగు

- మానవతా విలువలు మరిచి కక్షసాధింపు.
- తల్లిదండ్రుల ఇంటినే కూల్చాలంటూ
- హైకోర్టు మెట్లెక్కిన సొంత కొడుకు...
- నిత్యం నరకం చూస్తున్న వృద్ధ దంపతులు...
- ఇంటిని కూల్చివేస్తే..ఆత్మహత్యే శరణ్యం
- బంధాలు బంధుత్వాలకు విలువలు మాయం



**మర్రిగూడ, జూలై 26 (జనం సాక్షి) :** వాటికి పేరు బంధాలు.. కానీ వాటికి విలువే లేకుండా పోతున్న రోజులు ఇవి. కన్నతండ్రి కష్టాలతో నిర్మించిన ఇంటినే కూల్చాలని సొంత కొడుకే హైకోర్టు మెట్లు ఎక్కిన ఘటన నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం వట్టిపల్లి గ్రామంలో కలకలం రేపుతోంది. ఆ గ్రామానికి చెందిన మల్గిరెడ్డి మాధవరెడ్డి (72), సుశీలమ్మ దంపతులు జీవితం చివరి దశలో నిత్యం నరకం అనుభవిస్తున్నామని కన్నీటి పర్యంతమవుతున్నారు. వీరి పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెడ్డి, తల్లిదండ్రులు 25 సంవత్సరాల క్రితం కష్టపడి నిర్మించిన ఇంటికి అనుమతుల్లేవని కోర్టులో పిటిషన్ వేసి, దాన్ని కూల్చివేయాలని ప్రయత్నిస్తున్నాడని వృద్ధులు వాపోతున్నారు.

**ఇంటిని కూల్చేస్తే... ఆత్మహత్యే శరణ్యం"**

శ్రీనివాస్‌రెడ్డి కక్షపూరితంగా తల్లిదండ్రులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేలా చేస్తుండటం, కోర్టుల్లో లాయర్ల పర్యటనలు చేయించటం, ఆరోపణల వర్షం కురిపించటం తల్లిదండ్రులను మానసికంగా అతికాస్త అలసటకు గురిచేస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు.

**తల్లిదండ్రుల త్యాగానికి ఇదే ఫలితమా?**

మల్గిరెడ్డి దంపతులు వివరించిన మేరకు -వారు తమ జీవితాన్ని కష్టాలతో గడిపి 14 ఎకరాల భూమిని సంపాదించారు. ఆడపిల్లకు 3 ఎకరాలను ఇచ్చి, మిగిలిన భూమిలో కొన్ని ఎకరాలను అప్పుల తీర్చడానికి, వైద్య ఖర్చులకు అమ్ముకున్నారు. ఇంటిని నిర్మించేందుకు 25 ఏళ్ల కిందట 12 గుంటల భూమిని కొని, కొడుకుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ, నిర్మాణాన్ని తాము చేపట్టారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇల్లు దాదాపు 25 ఏళ్లుగా ఉంది. ఇప్పుడు అదే ఇంటిపై పెద్ద కుమారుడు శ్రీనివాస్ రెడ్డి కక్షతో వేటు వేయడం తల్లిదండ్రుల హృదయాలను ఛిద్రం చేస్తోంది.

**గ్రామస్తుల మన్ననలు - కన్నీటి తోడు**

వృద్ధ దంపతుల రోదనలు విన్న వట్టిపల్లి గ్రామస్థులు సైతం భావోద్వేగానికి లోనయ్యారు. "అల్లారు ముద్దుగా పెంచిన కొడుకు ఇలా చేస్తాడని కలలో కూడా ఊహించలేదు" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము సాధించుకున్న ఇంటి మీదా న్యాయం కోసం మౌలికంగా నమ్ముకున్న కుటుంబమే శత్రువుగా మారడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

**దయచేసి మాకు న్యాయం చేయండి"**

ప్రస్తుతం వృద్ధ దంపతులు ఎవ్వరిని చూసినా దండం పెడుతూ, తాము రోడ్డున పడ్డామని, తమను నిలబెట్టాలని వేడుకుంటున్నారు. "ఇల్లు కూలిస్తే బతకలేము%‌%మనువు తీసుకోవాల్సిందే" అని గుండెలు బాదుకుంటూ రోదిస్తున్నారు.

# అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకూ రూ.5 లక్షలు

- వచ్చేనెల 15లోగా ఇండ్ల కేటాయింపు పూర్తి చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్
- వరంగల్ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు..
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**వరంగల్ ప్రతినిధి, జులై 26 (జనం సాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఇండ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను వచ్చే నెల 15వ తేదీలోగా కేటాయించాలని, ఇందుకు అర్హులైన లబ్ధిదారుల ఎంపికను వెంటనే చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం వరంగల్ సమగ్ర అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పాల్గొని సమీక్ష నిర్వహించారు. అంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తిచేసుకోవడానికి ప్రభుత్వమే లబ్ధిదారులకు 5 లక్షల రూపాయిలు ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని ప్రకటించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు దరఖాస్తు ఎప్పుడు చేసుకున్నారనేది ముఖ్యం కాదని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వడమే ప్రధానమన్నారు. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నాకూడా వాటిని పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇసుక, చెల్లింపులు, లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శ్రావణ మాసం మొదలైన నేపథ్యంలో త్వరలోనే ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు కూడా ఉంటాయని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఫిర్యాదులు, సందేహాలు, సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లోని హౌసింగ్ కార్యాలయంలో త్వరలో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తామని తెలపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల ప్రకారం శాసనసభ్యులను భాగస్వామ్యం చేసి ప్రతి మండలంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని ఇందుకు సంబంధించిన ప్రణాళికను రూపొందించుకోవాలని కలెక్టర్లకు సూచించారు. వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో వరంగల్ నగర అభివృద్ధిపై పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి వరంగల్ విమానాశ్రయం, మెగా టెక్స్‌టైల్ పార్క్, భద్రకాళి దేవస్థానం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్‌రింగ్ రోడ్డు, రైల్వే తదితర అంశాలపై సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా చారిత్రాత్మక వరంగల్ నగరాన్ని తెలంగాణ రెండవ రాజధానిగా చేయాలన్ని సంకల్పంతో పనిచేస్తున్నామని గతంలో ఎన్నడూ లేని విధంగా వరంగల్ నగరాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. వరంగల్ అభివృద్ధికి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిపిఆర్ టెండర్, పనులు ప్రారంభించడానికి, పూర్తి చేయడానికి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని పనిచేయాలని సూచించారు. వరంగల్ ప్రాంత చిరకాల స్వప్నమైన మామునూరు ఎయిర్ పోర్ట్ కల త్వరలో సాకారం కానుందని అయితే ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణకు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేవని రెండు రోజుల క్రితం 205 కోట్ల రూపాయిలను విడుదల చేయడం జరిగిందని ఈ భూ సేకరణకు గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేస్తామన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ కు సంబంధించి అక్కడ రాజీవ్ గాంధీ టౌన్ షిప్‌లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద 1398 మంది లబ్ధిదారులను గుర్తించి 863 ప్లాట్‌లు కేటాయించామని తెలపారు. భద్రకాళి ఆలయ మాడవీధులతోపాటు కల్యాణ మండపం, పూజారి నివాసం , విద్యుత్ అలంకరణలను వచ్చే దసరా నాటికి అందుబాటులోకి తెచ్చేవిధంగా ప్రణాళికను రూపొందించుకొని పనిచేయాలని ఆదేశించారు. అమ్మవారి ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణకు తానే స్వయంగా వస్తానని చెప్పారు. రోప్‌వే, గ్లాస్‌బ్రిడ్జి తో సహా అన్ని పనులు వచ్చే డిసెంబర్ కల్లా పూర్తిచేయాలన్నారు. భద్రకాళి చెరువు ప్రాంతంలో ఇంతవరకు 3.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించామని, 2.06 కోట్ల రూపాయిల మట్టిని విక్రయించామని అధికారులు తెలిపారు. ఈ వర్షాకాలం పూర్తయిన వెంటనే ఈ చెరువు మట్టిని తరలించాలని మంత్రి సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరాం నాయిక్, శాసన సభ్యులు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కె.నాగరాజు, గండ్ర సత్యనారాయణ, నాయని రాజేందర్, శాసనమండలి సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, బస్వరాజు సారయ్య, అంజిరెడ్డి, బండ ప్రకాష్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి వివిధ శాఖలకు సంబంధించిన రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పాల్గొన్నారు.

# గోవా గవర్నర్‌గా అశోక్‌గజపతి ప్రమాణం

- హాజరైన లోకేశ్ పలువురు టిడిపి నేతలు



**పనాజి, జూలై24 (జనంసాక్షి) :** గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే ఉదయం 11.30 గంటలకు రాజ్‌భవన్ బంగ్లా దర్బార్ హాల్‌లో అశోక్ గజపతిరాజుతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎపి మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు- పలువురు టిడిపి ఎంపీలు హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో అశోక్ గజపతి రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయమే గోవాకు చేరుకున్నారు. ఆయన వెంట కుమార్తె స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, భార్య సునీలాగజపతి, ఇతర కుటుంబ సభ్యులు వెళ్లారు. అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో ఉన్న అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో గోవాకు తరలి వెళ్లారు. గోవా గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకారంలో పాల్గొనేందుఉ టిడిపి శ్రేణులు కూడా హాజరయ్యారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, మంత్రివర్గ సభ్యులు, ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఏపీ మంత్రులు నారా లోకేశ్, సంధ్యారాణి, తెలుగుదేశం ఎంపీలు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు, నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం అశోక్ గజపతిరాజును గోవా అధికారులు పరిచయం చేసుకున్నారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ స్వయంగా పరిచయం చేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్.. గజపతిరాజుకు బొకే ఇచ్చి.. శాలువా కప్పి సన్మానించారు.

# మావోయిస్టుల లొంగుబాటు



**విజయవాడ, జూలై24 (జనంసాక్షి) :** పలువురు మావోయిస్టులు శనివారం ఉదయం ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఎదుట లొంగిపోయారు. వారి వివరాలను డీజీపీ మీడియాకు వివరించారు. లొంగిపోయిన వారిలో రామకృష్ణ, అరుణ ఉన్నారని పేర్కొన్నారు. ఏవోబీ పరిధిలో భారీ డంప్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. ఏకే 47, హ్యాండ్ గ్రనేడ్లు, ఇతర ఆయుధాలు స్వాధీనం చేసుకున్న వాటిలో ఉన్నాయన్నారు. మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం అందుకుని జాయింట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన దాదాపు 21 మంది ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ వివిధ రాష్ట్రాల్లో మావోయిస్టు సభ్యులుగా పనిచేస్తున్నారని చెప్పారు. మావోయిస్టులంతా జనజీవన స్రవంతిలోకి వచ్చి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# నకిలీ సర్టిఫికెట్ల ముఠా పట్టివేత



**హైదరాబాద్, జూలై 26 (జనంసాక్షి) :** నగరంలో నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని శంషాబాద్ పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు కేపీహెచ్‌బీలోని శ్రీ వ్యాస కన్సల్టెన్సీ పేరుతో నకిలీ బీకాం, బీటెక్ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ఆకాసపు హరీష్ , మావూరి మహేష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరికి విజయవాడకు చెందిన మోహన్ అనే వ్యక్తి సహాయం చేసినట్లు పోలీసులు వివరించారు. సర్టిఫికెట్ల కోసం డబ్బులు వసూలు చేసి, అసలు ధ్రువపత్రాల్లేకుండానే 46 మందికి నకిలీ సర్టిఫికెట్లు-, 24 మంది వీటి ద్వారా విదేశాలకు ప్రయాణం చేశారని పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 2 మొబైల్ ఫోన్లు, ఒక డెస్క్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. నకిలీ డాక్యుమెంట్ల ఆధారంగా విదేశీ వీసాలు పొందిన అభ్యర్థుల కోసం వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం నిందితులను కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బీహార్‌లో మరో దారుణ ఘటన

**అంబులెన్స్‌లో నిస్సహాయ యువతిపై అత్యాచారం**

**పాట్నా, జూలై 24 (జనంసాక్షి) :** అసెంబ్లీ ఎన్నికల ముందు బీహార్‌లో మరో దారుణం వెలుగు చూసింది. ఈ మధ్య వరుస హత్యలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. తాజాగా అంబులెన్స్‌లో ఓ యువతిపై ఇద్దరు సామూహిక అత్యాచారానికి పాల్పడడం తీవ్ర కలకలం రేపుతోంది. బీహార్‌లోని బోధ్‌గయ పోలీస్ స్టేషన్ ప్రాంతంలో జూలై 24న బీఎంపీ-3 పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డు నియామకాలు జరిగాయి.. రేసులో పాల్గొన్న ఒక యువతి స్పృహ కోల్పోయింది. అక్కడే ఉన్న అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అయితే ఇదే అదునుగా భావించిన అంబులెన్స్ డ్రైవర్, టెక్నీషియన్.. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అయితే జరిగిన ఘోరాన్ని బాధితురాలు పోలీసులకు తెలిపింది. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు విఆరణ చేపట్టారు.

# టూవీలర్‌ను ఢీకొన్న ట్యాంకర్

- తండ్రీ కూతుళ్ల దుర్మరణం



**రంగారెడ్డి, జూలై24 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ చౌరస్తాలో శనివారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తండ్రి, కుమార్తె మృతి చెందారు. సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్‌కు చెందిన మచ్చేందర్.. శంషాబాద్ వర్ధమాన్ కళాశాలలో బీటెక్ చదువుతున్న తన కుమార్తె మైత్రిని కాలేజీకి పంపించేందుకు బైక్‌పై బస్టాప్‌కు బయలుదేరారు. షాద్‌నగర్ చౌరస్తా వద్దకు రాగానే వీరి ద్విచక్రవాహనాన్ని ట్యాంకర్ లారీ ఢీకొట్టింది. మచ్చేందర్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా, మైత్రికి తీవ్రగాయాలై లారీ టైర్ల మధ్యలో ఇరుక్కు పోయింది. కాపాడండి అంటూ మైత్రి చేసిన ఆర్తనాదాలు స్థానికులను కంటతడి పెట్టించాయి. ప్రమాదం జరిగిన వెంటనే అతి కష్టమ్మీద తన మొబైల్‌ను సమీపంలో ఉన్న ఓ వ్యక్తికి ఇచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేయాలని ప్రాధేయపడటం అక్కడి వారిని కన్నీరు పెట్టించింది. అదే సమయంలో స్నేహితురాలి నుంచి మైత్రికి ఫోన్లు రావడంతో.. స్థానికులు ప్రమాదం విషయం చెప్పి ఆమె బంధువులకు సమాచారం అందేలా చేశారు. కాసేపటికి మైత్రి కూడా కన్నుమూసిందని సీఐ తెలిపారు. లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సృష్టి టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్ దగా

- ఇతరుల వీర్యకణాలతో స్త్రీకి గర్భం
- డిఎన్ఎ టెస్టుతో బట్టబయలైన మోసం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు




**హైదరాబాద్, జూలై26 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లోని టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ బాగోతం బయటపడింది. భరత్ వీర్యంతో కాకుండా ఇతరుల వీర్యంతో ఓ స్త్రీకి గర్భం వచ్చేలా చేశారు. ఈ సెంటర్‌పై పోలీసులు శనివారం తనిఖీలు నిర్వహించారు. పిల్లల కోసం టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను ఓ మహిళ ఆశ్రయించారు. తన భర్త వీర్య కణాలతో సంతానం కలిగించాలని ఆమె కోరారు. వేరే వారి వీర్యకణాలతో సంతానం కలిగించారు వైద్యురాలు. అనుమానం వచ్చి డీఎన్ఏ టెస్ట్ చేయించారు దంపతులు. కడుపులో ఉన్న శిశువు డీఎన్ఏ వేరే వారిదిగా తేలడంతో ఆ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం వచ్చిన దంపతులకు మగ బిడ్డ జన్మించింది. బిడ్డ ఎదుగుతున్న కొద్దీ అనారోగ్య సమస్యలు వచ్చాయి. కొన్ని రోజుల క్రితమే పుట్టిన బాబుకి కేన్సర్ అని తేలడంతో దంపతులు షాక్‌కి గురయ్యారు. ఈ విషయం తెలియడంతో వెంటనే మరో డాక్టర్‌ను కలిశారు దంపతులు. డీఎన్ఏ టెస్ట్ చేయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. అయితే తొమ్మిదేళ్ల క్రితం సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను సీజ్ చేశారు. అక్రమంగా అనుమతులు పొంది.. మళ్లీ నిర్వహిస్తున్నారు డాక్టర్ నమ్రత. రెండు గంటలుగా రెవెన్యూ, పోలీస్, వైద్య శాఖల ఉన్నతాధికారులు సృష్టి సెంటర్‌లో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా పెద్దఎత్తున వీర్యం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. కొంతమంది యువకులకు డబ్బు ఆశ చూపించి వీర్యం సేకరిస్తున్నారని అధికారులు గుర్తించారు. ఎవరైనా దంపతులు టెస్ట్ ట్యూబ్ బేబీ కోసం వస్తేనే.. విజయవాడ నుంచి డాక్టర్ నమ్రత వస్తున్నారు. నమ్రతను విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కి టాస్క్‌ఫోర్స్ పోలీసులు తీసుకువచ్చి విచారణ చేస్తున్నారు. ఈ విచారణలో పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఎంత మందికి ఇలా ట్రీ-ట్ మెంట్ ఇచ్చారు అనేదానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అంబేద్కర్ వర్సిటీ పార్ట్‌టైం చదువుకే కాదు

# ప్రత్యక్ష ఉపాధికి కేంద్రం

- కొత్త లోగో ఆవిష్కరణ
- వివరాలు వెల్లడించిన డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** డా. బి ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పార్ట్ టైం చదువులకే కాకుండా ప్రత్యక్ష ఉపాధి కల్పనకు ఒక ముఖ్యమైన కేంద్రంగా మారుతోంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కొత్త లోగోను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అందుకు సంబంధించిన వివరాలు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ ప్రకటన ప్రకారం.. స్టైపెండ్-ఆధారిత విద్యా కార్యక్రమంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అప్రెంటిసెప్ల ద్వారా అమూల్యమైన చదువుతో పాటు ఆచరణాత్మక అనుభవాన్ని పొందటానికి దోహదపడుతుంది. విద్యార్థులు నేర్చుకుంటూ నెలకు రూ. 7,000 నుండి రూ.24,000 వరకు స్టిఫెండ్లు పొందే అవకాశం కల్పిస్తోంది. దీనికోసం దేశంలోని ప్రధాన దుకాణ సముదాయాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు భాగస్వాములుగా ఉన్న రీటైలర్స్ అసోసియేషన్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో విశ్వవిద్యాలయం ఒప్పందం చేసుకుంది.

మొదటగా 10,000 మంది విద్యార్థులను ఈ కార్యక్రమ పరిధిలోకి తీసుకురావాలని యోచిస్తోంది. వారంలో వీలైనన్ని రోజులు సమీప వర్తక, వాణిజ్య కేంద్రాల్లో శిక్షణ పొందుతూ, పనిచేసుకుంటూ చదువుకునే వీలు కల్పించనున్నారు. ఇందులో సగం మంది మహిళలకు భాగస్వామ్యం కల్పించాలని, వీలయినంత మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులను ఇందులో చేర్చనున్నారు. రెండోది మహిళలను వృత్తి నైపుణ్యంవైపు నడిపించే కార్యక్రమం. దీనికోసం ప్రభుత్వ సంస్థ వీ హబ్, వీ ఎనేబుల్ కార్యక్రమాన్ని రూపొందించారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారతదేశపు మొదటి రాష్ట్ర ప్రభుత్వ ఇంక్యుబేటర్ అయిన వీ హబ్ భాగస్వామ్యం తో మహిళా విద్యార్థులలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత మరియు నాయకత్వ నైపుణ్యాలను పెంపొందిస్తోంది. స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్ ద్వారా ఏటా 5,000 మంది గ్రామీణ, గిరిజన విద్యార్థులకు స్వల్ప-కాలిక వృత్తి కోర్సులను అందించనున్నారు.

తెలంగాణ లోని పారిశ్రామిక ప్రభుత్వ రంగ సంస్థలను భాగస్వాములుగా చేసుకుని కార్మికులు వారి కుటుంబాలకు వృత్తి శిక్షణ ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సింగరేణి కాలరీస్ కంపెనీ సహకారం తో ప్రతి సంవత్సరం 10,000 మంది అభ్యర్థులను విద్యా వికాసంవైపు నడిపించనున్నారు. రాబోయే దశాబ్దంలో ఒక లక్ష కుటుంబాలకు ఉన్నత విద్యావకాశాలు అందించాలన్నది మా సంకల్పం. అదనంగా ప్రతి సంవత్సరం 10,000 మంది గ్రాడ్యుయేట్లకు కీలకమైన ఆంగ్ల భాష మరియు జీవన నైపుణ్య శిక్షణను అందిస్తాం. దానికోసం ఒక ప్రత్యేక భాషా శిక్షణ కార్యక్రమం రూపొందించనున్నారు. వీటన్నిటితో పాటు సమాన అవకాశాలు సాధించడం కోసం 'సమత' ఫ్రీషిప్లు, నిపుణ ఫెలోషిప్లు ఇవ్వనున్నారు. సమత ఫ్రీషిప్ ఆదివాసీలు, ప్రాచీన గిరిజనులు, ట్రాన్స్ జెండర్ ప్రజలు, శారీరక వికలాంగులు మరియు దివ్యాంగులకు ఉచిత విద్యను అందించనున్నారు. దీనివల్ల తెలంగాణలో ట్రాన్స్ జెండర్ తో పాటు దివ్యాంగులు, గోండు కోయ, చెంచు ఆదివాసులు ఎలాంటి రుసుము లేకుండా ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉంటుంది. ఈ ఫెలోషిప్లు అన్ని వెనుకబడిన వర్గాలకు నైపుణ్య అభివృద్ధి, వృత్తి శిక్షణ మరియు భాషా అభ్యాసానికి మద్దతిస్తాయి. ఖర్చులు పూర్తిగా విశ్వవిద్యాలయం భరిస్తుంది. ఈ పథకాలు ప్రతి సంవత్సరం కనీసం 5,000 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తాయి. అలాగే యూజీసీ నూతన లాటరల్ ఎంట్రీ పాలసీని ఆవిష్కరించారు. దీనివల్ల డిగ్రీలో చేరడానికి సరళమైన నిబంధనలలు అమలులోకి వచ్చాయి. దీనివల్ల ఒకేసారి రెండు డిగ్రీలు (ద్యుయల్ డిగ్రీలు) అలాగే పాలిటెక్నిక్ ఐటీఐ వంటి నైపుణ్య ఆధారిత కోర్సులకు క్రెడిట్ ఇంటిగ్రేషన్ అంటే అప్పటికే చదివి ఉన్న కోర్సులను గుర్తించనున్నారు. ఇంజినీరింగ్ మధ్యలో మానేసిన వాళ్ళు- డ్రాపౌట్లు కూడా మావద్ద డిగ్రీ పూర్తి చేసుకోవచ్చు.

# రాహుల్‌ను అంబేడ్కర్‌తో పోల్చడమా?

**మండిపడ్డ బిజెపినేత షెహజాబ్**




**న్యూఢిల్లీ, జూలై 26 (జనంసాక్షి) :** ఓబీసీ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను పూర్తిగా అర్థం చేసుకోవడంలో విఫలమయ్యానని, దానిని సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తున్నానని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రాహుల్ గాంధీ ఢిల్లీ తల్కటోరా స్టేడియంలో చేసిన వ్యాఖ్యలపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాహుల్‌కు కాంగ్రెస్ నేత ఉదిత్ రాజ్ మద్దతుగా నిలిచారు. ఓబీసీలకు రాహుల్ శుక్రవారం నాడు మాట్లాడుతూ, 2004 నుంచి తాను రాజకీయాల్లో ఉంటున్నానని, అయితే ఓబీసీ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను తాను పూర్తిగా అర్థం చేసుకోవడంలో చారిత్రాత్మకంగా విఫలమయ్యానని అంగీకరించారు. వ్యవసాయ ఉత్పత్తి, మౌలిక సదుపాయాల అభివృద్ధి సహా దేశ ఉత్పాదక శక్తికి ఓబీసీలు ప్రాతినిధ్యం వహిస్తున్నా వారికి తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించడం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుల సర్వేతో రోల్ మోడల్‌గా నిలిచిందని ప్రశంసించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ప్రతిచోటా ఇలాంటి సర్వేలను అమలు చేస్తుందన్నారు. రాహుల్‌ను రెండో అంబేద్కర్‌గా ఉదిత్ రాజ్ అభివర్ణించడంపై బీజేపీ ప్రతినిధి షెహజాబ్ పూనావాలా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ రెండో అంబేద్కర్ గురించి మాట్లాడుతోందని, కానీ ఒరిజనల్ అంబేద్కర్‌ను ఏనాడు గౌరవించలేదని విమర్శించారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో ఎన్‌కౌంటర్



**రాయ్‌పూర్, జూలై 26 (జనంసాక్షి) :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మరోమారు ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనాస్థలి నుంచి భారీగా ఆయుధాలను భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి. బీజాపూర్ జిల్లాలోని నైరుతి ప్రాంతంలో మావోయిస్టుల ఉనికికి సంబంధించి సమాచారం అందగా భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పులు ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. ఈనెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల వారోత్సవాలకు మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఈ వారోత్సవాలకు ముందే ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370